



# విశ్వవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 2 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | సోమవారం 22 సెప్టెంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-


# మిడిల్ క్లాస్‌కు మంచి రోజులు




- మధ్యతరగతి ప్రజలకు కాస్త ఆదా
- 5%.. 18%..40%... ఇకపై ఈ మూడే శ్లాబ్‌లు
- కిరాణా సరుకులు, ప్యాకేజ్డ్ ఫుడ్స్ 5 శాతంలోకి
- ఔషధాలు, వైద్య సంబంధ పరికరాలపైనా పన్ను తగ్గింపు..
- బీమా పాలసీ ప్రీమియంలపై పూర్తిగా పన్ను మినహాయింపు
- కుటుంబాన్ని బట్టి నెలకు రూ.1700%-%2200 మిగిలే చాన్స్
- 40 శాతంలోకి సిగరెట్లు, పాన్‌మసాలా, గుట్కా
- సిమెంటు సహా నిర్మాణ సామగ్రిపై తగ్గింపు
- రోడ్లపైకి మరిన్ని చిన్నకార్లు
- 1500 సీసీ దాటిన ఎస్‌యూవీలు, హైఎండ్ కార్లపై 40% పన్ను
- అంతిమ ప్రయోజనాలు ప్రజలకు చేరేలా ప్రభుత్వం పర్యవేక్షణ

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**
వివిధ వస్తువులపై సవరించిన కొత్త పన్ను రేట్లు సోమవారం నుంచి అమల్లోకి రాబోతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తు ... జీఎస్టీ 2.0గా పేర్కొంటున్న ఈ సవరణలతో చాలా వస్తువుల ధరలు మారబోతున్నాయి. మధ్యతరగతి భారతావనికి ఈ పన్నుల మార్పు ఎంతో మేలు చేస్తుందని, చాలా వస్తువుల ధరలు తగ్గుతాయని ప్రభుత్వం చెబుతోంది. ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ సైతం ఇదే చెప్పారు. ఈ నేపథ్యంలో అసలు జీఎస్టీ మండలి చేసిన సవరణల వల్ల ఎవరికి లాభం? ధరల్లో హెచ్చుతగ్గులు ఏ రకమైన ప్రభావం చూపబోతున్నాయి సేల్స్‌ట్యాక్స్, వ్యాట్, సెంట్రల్ ఎక్సైజ్, సర్వీస్ ట్యాక్స్ సహా పలు రకాల పరోక్ష పన్నులన్నిటినీ తొలగిస్తూ 2017 జూలై నుంచీ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జీఎస్టీ) అమల్లోకి వచ్చింది. తక్కువ - మిగతా6లో




# దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్

- సిద్ధంగా ఉండాలని పోల్ అధికారులకు ఈసీ ఆదేశం
- సెప్టెంబర్ 30వ తేదీలోగా సన్నద్ధం కావాలి
- ఓటర్ లిస్ట్ క్లీనప్ ఎక్సర్‌సైజ్‌ను అక్టోబర్-నవంబర్ నాటికి ప్రారంభించనున్నట్టు సంకేతాలు
- రాబోయే 10-15 రోజుల్లో ఎస్ఐఆర్ రోల్‌అవుట్‌కు సిద్ధంగా ఉండాలి
- గత ఎస్ఐఆర్ తర్వాత ఓటర్ల జాబితాలను పలు రాష్ట్రాల సీఈఓలు ఇప్పటికే తమ వెబ్‌సైట్‌లో ఉంచారు.

6లో




## ఎల్‌టీటీఈ పునరుద్ధరణకు యత్నం

- శ్రీలంక మహిళపై ఈడీ దర్యాప్తు
- భారత్‌లో అక్రమంగా నివసించడం, నకిలీ పాస్‌పోర్ట్ పొందడం వంటి నేరాలపై ఆమెపై కేసు నమోదు
- నిషేధిత ఎల్టీటీఈ పునరుద్ధరణ, ఆ సంస్థ కార్యకలాపాలకు వనరులను సమీకరించడానికి మేరీ ఫ్రాన్సిస్కా కుట్ర పన్నినట్లు దర్యాప్తులో బయటపడింది.

6

## పౌరులకు 'డబుల్ బొనాంజా'

- జీఎస్టీ సంస్కరణలతో ఆత్మనిర్భరత
- దేశవ్యాప్తంగా అభివృద్ధి ఇక వేగవంతం
- స్వదేశీ ఉత్పత్తులకు మరింత ప్రోత్సాహం
- పేదలు, మధ్య తరగతి సహా అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి
- దేశంలో ప్రతి ఇంటినీ స్వదేశీకి ప్రతీకగా మార్చుకోవాలి
- దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు

6లో





## మద్యం ఆదాయంలో రాష్ట్రమే టాప్

- పాపులర్ బ్రాండ్లు లేకపోవడంతో ఇతర రాష్ట్రాల వైపు మందుబాబుల చూపు
- సరిహద్దుల్లో తీవ్ర స్థాయిలో ఆదాయ నష్టం
- ప్రభుత్వం మారాక పెరిగిన అమ్మకాలు
- 10.29 శాతం మేరకు పుంజుకున్న విక్రయాలు
- ఈ ఏడాది రూ.30 వేల కోట్ల ఆదాయం

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**
జగన్ హయాంలో 'జే' బ్రాండ్లతో దోచుకున్నారు. కమీషన్ల కోసం మద్యం కంపెనీలకు చుక్కలు చూపించారు. మరోవైపు ఖజానాకు రావాల్సిన ఆదాయాన్ని పోగొట్టారు. వైసీపీ ప్రభుత్వం అమలుచేసిన అడ్డగోలు మద్యం విధానంతో రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం పక్క రాష్ట్రాలకు తరలిపోయింది. ఐదేళ్లలో సుమారు రూ.18 వేల కోట్ల ఆదాయ నష్టం వాటిల్లిందని ప్రభుత్వం అంచనా వేసింది. తాజాగా మద్యం - మిగతా2లో

# జీఎస్టీ సంస్కరణలతో రూ.వేల కోట్ల ప్రయోజనం

- రైతులు, విద్యార్థులు, సామాన్యులకు లబ్ధి
- తెలుగులో వాణిజ్య పన్నుల శాఖ ఉత్తర్వులు
- ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- ప్రధాని స్వదేశీ నినాదానికి సంపూర్ణ మద్దతు
- 'జీఎస్టీ సంస్కరణలతో ప్రజలపై ఖర్చుల భారం తగ్గుతుంది
- ప్రతి ఇంటికి, రైతులు, విద్యార్థులకు లబ్ధి చేకూరుతుంది
- జీఎస్టీ శ్లాబ్‌ల మార్పులతో ట్రాక్టర్ల నుంచి పాఠ్యపుస్తకాలు, మందుల వరకు అన్నింట్లో ఆదా అవుతుంది



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**
జీఎస్టీ 2.0తో రాష్ట్ర ప్రజలకు రూ.8 వేల కోట్ల ప్రయోజనం చేకూరనుందని సీఎం చంద్రబాబు చెప్పారు. 'జీఎస్టీ 2.0 నెక్ట్స్ జెన్' సంస్కరణలతో రాష్ట్రానికి ఒనగూరే ప్రయోజనాలపై ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆయన ఆదివారం సమీక్షించారు. జీఎస్టీ ఉత్తర్వులను సామాన్యులూ అర్థం చేసుకునేందుకు తొలిసారి తెలుగులో ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. 'జీఎస్టీ సంస్కరణలతో ప్రజలపై ఖర్చుల భారం తగ్గుతుంది. ప్రతి ఇంటికి, రైతులు, విద్యార్థులకు లబ్ధి చేకూరుతుంది. జీఎస్టీ శ్లాబ్‌ల మార్పులతో - మిగతా2లో

## కొచ్చి వాటర్ మెట్రో సరికొత్త రికార్డు



- 50 లక్షల ప్రయాణికులకు చేరిక
- వాటర్ మెట్రో ప్రారంభించిన 29 నెలల్లోనే 50 లక్షల ప్రయాణికులను గమ్య స్థానాలకు తీసుకెళ్లింది
- ఈ 50 లక్షల మైలురాయి ప్రయాణికునిగా ఆస్ట్రేలియాకు చెందిన నైనా నిలిచారు

## కొత్త వారికే వీసా వార్షిక రుసుము

- 'హెచ్1బీ' వీసా ఫీజు పెంపుపై వైట్ హౌస్ కీలక ప్రకటన
- నేటి నుంచి హెచ్1బీ వార్షిక వీసా కోసం దరఖాస్తు చేసే ప్రతి వ్యక్తి లక్ష డాలర్లు (సుమారు రూ.83 లక్షలు) ఫీజు చెల్లించాలి
- ఈ పెంపు కొత్తగా దరఖాస్తు చేసే విదేశీ ఉద్యోగులకు మాత్రమే
- ఇప్పటికే హెచ్1-బీ వీసా ఉన్నవారికి తాజా పెంపు వర్తించదు

6లో



# రాజకీయాలను తెలుగు జాతి శాసించాలనేదే కృష్ణారావు ఆకాంక్ష






**తెలుగు జాతి సమైక్యత కోసం కృష్ణారావు పోరాడారు**

**ప్రజాస్వామ్యం ధనస్వామ్యం కాకూడదు అన్నదే శత జయంతి వేడుకల లక్ష్యం**

**ఘనంగా మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకల సేవా మహోత్సవం**

నాగాయలంక

తెలుగు జాతి రాజకీయాలను శాసించే జాతిగా నిలవాలనే ఆకాంక్షతో సమైక్యత కోసం పోరాడిన మండలి వెంకట కృష్ణారావు ఆదర్శాలు యువతరం అందుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం నాగాయలంకలో ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ పునర్నిర్మాత మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకల 50వ రోజు సందర్భంగా శత జయంతి కమిటీ ఆధ్వర్యంలో సేవా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కృష్ణారావు విగ్రహానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఉల్లిపాలెం శ్రీమన్నారాయణ స్వామి దేవస్థానం వ్యవస్థాపకులు శ్రీ అష్టాక్షరీ సంపత్ కుమార రామానుజ జీయర్ స్వామి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి మొక్కలు నాటారు. ముక్కొల్లు శివరావు సహకారంతో పేదలకు దుప్పట్లు అందచేశారు. కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రారంభించారు. ఎంవీ కృష్ణారావు జీవిత చరిత్ర వ్యాస రచన పోటీల్లో విజేతలుగా నిలిచిన జడ్పీ హైస్కూల్, హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత అధ్యక్షతన జరిగిన శత జయంతి సభలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తెలుగు జాతి అగ్రజాతిగా నిలవాలని కృష్ణారావు వేర్పాటువాదానికి వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. విద్యార్థి దశలోనే గాంధీ పిలుపుతో స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న ఎంవీ కృష్ణారావును రాజకీయంగా ప్రోత్సహించిన గ్రామం నాగాయలంక అన్నారు. కృష్ణారావు రాజకీయంగా తొలి అడుగు వేసింది నాగాయలంకలోనే అన్నారు. గాంధీ ఆశయాలతో రాజకీయాల్లోకి వచ్చిన కృష్ణారావు అనేక ఆటంకాలు ఎదురీది దివిసీమ అభివృద్ధి, మౌళిక సౌకర్యాల కల్పన సాధించారన్నారు. సామాన్య యువనేతగా ఉన్న కృష్ణారావుకు పిలిచి ఎంపీ టికెట్ ఇచ్చారంటే, యుక్త వయసులోనే రాజకీయంగా ఆయన అంతటి స్థాయికి ఎలా ఎదిగారనేది నేటి యువత తెలుసుకోవాలన్నారు. ఎంవీ కృష్ణారావు రాజకీయంగా ఎదిగిన తీరు నేటి యువత పరిశీలించి, వారి భావాలతో ముందుకు సాగాలన్నారు. ప్రజాస్వామ్యం ధనస్వామ్యం కాకూడదని, రాజకీయం ధనవంతుల చేతుల్లోకి వెళ్ళకూడదని, కోటానుకోట్లు ఖర్చు పెట్టే వాళ్ళు కాకుండా ప్రజల నుంచి వచ్చిన నాయకులు, ప్రజల గురించి ఆలోచించే నాయకులు రాజకీయాల్లో రాణించాలనేదే ఈ శత జయంతి వేడుకల నిర్వహణ ముఖ్య ఉద్దేశం అన్నారు. నిస్వార్థ రాజకీయాలతో అందరిచే ప్రేమించబడిన నాయకుడు కావటంతోనే అన్ని కులాల వారు దేశం నలువైపులా కృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనంగా జరుపుకుంటున్నారని తెలిపారు. అష్టాక్షరీ సంపత్ కుమార రామానుజ జీయర్ స్వామి మాట్లాడుతూ మండలి వెంకట కృష్ణారావు ఆదర్శనీయ నాయకులు అన్నారు. స్వార్థ రహిత సేవ చేసిన ఎంవీ కృష్ణారావు ఖ్యాతి నేటికీ నిలిచి ఉందన్నారు. నిస్వార్థంగా ప్రజా సేవ చేసే అరుదైన నాయకుల్లో ఎంవీ కృష్ణారావు ఒకరు అన్నారు. తండ్రి బాటలో పయనిస్తున్న మండలి బుద్ధప్రసాద్ రాజకీయ వనంలో తులసి మొక్కలాంటి వారు అన్నారు. ఉత్తమ రాజకీయ జీవనంతో కృష్ణారావు ప్రాతః స్మరణీయులుగా దివిసీమ గాంధీగా ఖ్యాతి పొందారన్నారు. ఉత్తమ నాయకుల ఆదర్శాలు పుణికి పుచ్చుకున్నప్పుడే వారి సహచర్యం సఫలం అవుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకుడు మండలి వెంకట్రామ్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్లు కొల్లూరి వెంకటేశ్వరరావు, తోట కనకదుర్గ, టీడీపీ మండల అధ్యక్షులు మెండు లక్ష్మణరావు (చంటి), యాసం చిట్టిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, సర్పంచ్ కైతేపల్లి అంకాలు, ఉప సర్పంచ్ తలశిల వెంకట నరసింహారావు (నానీ), నాటక అకాడమి డైరెక్టర్ పైడిపాముల స్వప్న, డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగ మల్లికార్జునరావు, సర్పంచులు మండలి ఉదయ భాస్కర్, అంబటి శ్యాంప్రసాద్, దున్నా రాజేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ శివానందరావు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షులు తోట శ్రీనివాసరావు, మర్రె గంగయ్య, యర్రంశెట్టి సుబ్బారావు, పూతబోయిన కరుణకుమార్, కోట సుబ్బారావు, కమిటీ ప్రతినిధులు భోగాది శివ విష్ణువర్ధన్, సబ్బినేని మహేష్, మాదివాడ అర్జునరావు, గుడివాక శివరావు, రేమాల బాబూరావు, చెన్నగిరి లతా మోహన్, బండ్రెడ్డి మల్లికార్జున్, బండ్రెడ్డి హరి, తాడికొండ పాపారావు, భోగాది సతీష్, భోగిరెడ్డి బుజ్జిబాబు, తలశిల శివరామకృష్ణ, తలశిల శివశంకర్, తానంకి చంటి, ముమ్మారెడ్డి సురేష్, కర్రి కృష్ణమూర్తి, ఏఎంసీ డైరెక్టర్లు ఉప్పల ప్రసాద్, పిరాటి శిరీష, జరుగు ఆదినారాయణ, తోట మానస, పెద్దసంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

**వైద్య శిబిరానికి విశేష స్పందన:**
ఈ సందర్భంగా నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విజయవాడ ఒమేగా అను హాస్పిటల్ వైద్యులు తరలివచ్చి గుండె, నరాలు, వెన్నెముక సమస్యలు, స్త్రీలు, చిన్న పిల్లల ఆరోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు చేశారు. ప్రత్యేక బస్సులో ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు చేశారు. శిబిరంలో 248 మందికి వైద్య పరీక్షలు చేసి 15మందికి ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఈ శిబిరంలో భోగాది శివ విష్ణువర్ధన్, సబ్బినేని మహేష్ ఆర్థిక సహకారంతో రోగులకు ఉచితంగా మందులు అందచేశారు. శిబిరాన్ని ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ సూదాని శివశంకర్, వైద్య సిబ్బంది, కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు. శిబిరంలో మెండు లక్ష్మణరావు (చంటి), తలశిల వెంకట నరసింహారావు, మాదివాడ అర్జునరావు భోజన ఏర్పాట్లు, విగ్రహ పూలమాల ఆవిష్కరణ ఏర్పాట్లు చేశారు.

# జీఎస్టీ సంస్కరణలతో రూ.వేల కోట్ల ప్రయోజనం

-మొదటిపేజీ తరువాయి

ట్రాక్టర్ల నుంచి పాఠ్యపుస్తకాలు, మందుల వరకు అన్నింట్లో ఆదా అవుతుంది. ధరలు తగ్గడం వల్ల ప్రజల కొనుగోలు శక్తి పెరిగి.. ఎంఎస్ఎంఈ రంగం బలోపేతమవుతుంది. దీనివల్ల వేలమంది వ్యాపారులు, ఎకౌంటెంట్లు, అధికారులు, ఉద్యోగులు, నిపుణులకు ప్రయోజనం కలుగుతుంది' అని చంద్రబాబు వివరించారు. తెలుగులో తొలిసారి జారీచేసిన 11 ఉత్తర్వులను సీఎం ఆవిష్కరించారు. ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, చేనేత వస్త్రాలపై జీఎస్టీని 5 శాతానికి తగ్గించడం వల్ల ఎగుమతులు పెరిగేందుకు అవకాశం ఉందని తెలిపారు.

**ప్రధాని స్వదేశీ నినాదానికి సంపూర్ణ మద్దతు**
జీఎస్టీ ఉత్సవ్ సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రధాని మోదీకి ఎక్స్ వేదికగా సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఆత్మనిర్భర్, వికసిత్ భారత్ స్ఫూర్తితో పనిచేయాలన్న ప్రధాని స్వదేశీ నినాదానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. 'గర్వంగా చెప్పండి.. ఇది స్వదేశీ' అని ప్రధాని ఇచ్చిన పిలుపు ఓ జాతీయ ఉద్యమంలా మారనుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 10 మార్గదర్శక సూత్రాల లక్ష్యాలను సాధించేందుకు జీఎస్టీ సంస్కరణలు దోహదపడతాయని వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ బాబు పేర్కొన్నారు. 'పేదరికం లేని సమాజం, జనాభా నిర్వహణ, మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యం, ఉపాధి, నీటిభద్రత, రైతు సంక్షేమం, లాజిస్టిక్స్ అభివృద్ధి, ఇంధన వినియోగంలో ఖర్చు తగ్గింపు, చేతి వృత్తుల అభివృద్ధి, స్వచ్ఛాంధ్ర, డీప్‌టెక్ సాంకేతికత వినియోగం' వంటి సూత్రాల సాధనకు సంస్కరణలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు.

**వివిధ వర్గాలకు లబ్ధి**
నిత్యావసర వస్తువులపై పన్నును 18 నుంచి 5 శాతం చేయడం వల్ల ఖర్చుల భారం తగ్గుతుందని సీఎం చెప్పారు. 'వెన్న, నెయ్యి, సబ్బులు, షాంపూ, హెయిర్ ఆయిల్, ప్రాసెస్డ్ ఫుడ్, బిస్కెట్లు, కాఫీ లాంటి వాటిపై పన్ను తగ్గుతుంది. పాశ్చరైజ్డ్ పాలు, ప్యాకేజ్డ్ పనీర్, బ్రెడ్ ఉత్పత్తులపై జీఎస్టీ నుంచి పూర్తిగా మినహాయింపు లభించింది' అని వివరించారు. ద్విచక్ర వాహనాలు, చిన్న కార్లు, టీవీలు, ఏసీలు, సిమెంట్ వంటి వాటిపై పన్నును 28 నుంచి 18 శాతానికి తగ్గించడంతో మధ్యతరగతికి ఊరట లభిస్తుంది.
రైతులు వినియోగించే ఎరువులు, పురుగుమందులు, ట్రాక్టర్లపై జీఎస్టీ 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గడం రైతులకు ప్రయోజనకరం.
కొన్ని ప్రాణాధార మందులు, ఆరోగ్యబీమా పాలసీల ప్రీమియంపై జీఎస్టీ నుంచి పూర్తిగా మినహాయింపు ఇచ్చారు. దీనివల్ల వినియోగదారులకు రూ.లక్ష కోట్ల వరకు ఆదా అవుతుందని అంచనా. సేవారంగం, హోటళ్లలో వసతులపై జీఎస్టీ తగ్గించడం వల్ల ఆ మేరకు అద్దె తగ్గుతుంది.

# బ్లాక్‌ను వైట్ మనీగా.. లిక్కర్ కేసులో విస్తుపోయే నిజాలు

విజయవాడ

ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. స్కామ్‌లో బ్లాక్ మనీని వైట్‌గా మార్చడం, విదేశాలకు తరలించారనే ఆరోపణలు ఉన్నాయి. అక్కడి నుంచి వివిధ సూట్‌కేసు కంపనీల్లో పెట్టుబడులు పెట్టారనే అనుమానాలు ఉన్నాయి. వాటిని నిగ్గుతేల్చే పనిలో పడింది ఈడీ. అందుకే ఈ ఉదయం నుంచి దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. ఈ స్కామ్‌లో ప్రమేయం ఉందని ఆరోపణలు ఎదుర్కొంటున్న మనీలాండరింగ్ మధ్యవర్తులపై ఫోకస్ పెట్టింది. అందుకే గురువారం ఉదయం నుంచి హైదరాబాద్, ఢిల్లీ, తమిళనాడు, కర్ణాటకతో సహా దేశవ్యాప్తంగా ఉన్న అనుమానితుల ఇళ్లు ఆఫీసులపై సోదాలు నిర్వహించింది. ఇరవైకి పైగా ప్రాంతాల్లో ఏక కాలంలో ఈ సోదాలు కొనసాగుతున్నాయి. ఒక్క హైదరాబాద్‌లోనే దాదాపు 8 ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది. ముందు ఈ స్కామ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. ఆ సిట్ చేసిన దర్యాప్తు, నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ జోక్యం చేసుకుంది. ఇందులో మనీలాండరింగ్ ఆరోపణలు ఉండి, భారీగా నిధులు దారి మళ్లించారనే అనుమానాలు వ్యక్తం చేయడంలో కేస్‌ను టేకప్ చేసింది. బినామీ సంస్థలు, షెల్ కంపెనీలు హవాలా ప్రక్రియ ద్వారా దాదాపు ?3,500 కోట్లు మళ్లించారనే ఆరోపణలు ఉన్నాయి. అందుకే ఇందులో కీలక పాత్ర ఉన్న వారిపై ఈడీ దృష్టి పెట్టింది. వారే లక్ష్యంగా సోదాలు చేస్తోంది. ఈ స్కామ్‌తో సంబంధం ఉన్న డిస్టిలరీల నుంచి కూడా ఇప్పటికే ఇఆ వాంగ్మూలాలు తీసుకుంది. జైలులో ఉన్న ప్రధాన నిందితుడు రాజ్ కాసిరెడ్డి వాంగ్మూలం కూడా రికార్డు చేసింది. వాటి ఆధారంగానే ప్రస్తుతం ఈ సోదాలు జరుగుతున్నట్టు సమాచారం. 2019–2024 మధ్య ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి సరఫరా ఆర్డర్‌లను పొందడానికి 16 మద్యం కంపెనీలు 1,677 కోట్ల రూపాయల లంచం ఇచ్చాయని ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ కేసు నమోదు చేసింది. దీనికి బదులుగా ఆయా కంపెనీలు 10,835 కోట్ల విలువైన కాంట్రాక్టులు పొందినట్లు పేర్కొంది. జగన్ ప్రభుత్వ హయాంలో ంఖూఃఅఇ 23 వేల కోట్ల రూపాయల విలువైన సరఫరా ఆర్డర్‌లను జారీ చేసిందని, వాటిలో 90% కంటే ఎక్కువ 111 రిజిస్టర్డ్ మద్యం కంపెనీలలో కేవలం 40 కంపెనీలకు మాత్రమే వెళ్ళాయని ాఎ తెలిపింది.3,500 కోట్లకుపైగా లంచాలు బినామీ సంస్థలు, షెల్ కంపెనీలు, హవాలా ఆపరేటర్ల ద్వారా మళ్లించినట్లు అనుమానిస్తోంది. సిట్ దర్యాపులో వెలుగు చూసిన అంశాల ఆధారంగానే ఇఆ మనీలాండరింగ్ నిరోధక చట్టాన్ని ప్రయోగించింది. నిందితులకు, ఆయా సంస్థలు సమన్లు ??జారీ చేసింది. ఇప్పుడు సోదాలు చేస్తోంది.

## మద్యం ఆదాయంలో రాష్ట్రమే టాప్



-మొదటిపేజీ తరువాయి

అమ్మకాలపై తీసిన లెక్కలు ఇదే విషయాన్ని రుజువు చేశాయి. గత ప్రభుత్వంలో ఏపీలో మంచి బ్రాండ్లు లేక పక్క రాష్ట్రాల బాట పట్టిన మందుబాబులు ఇప్పుడు రాష్ట్రంలోనే మద్యం కొనుక్కుని తాగుతున్నారు. ఫలితంగా మన ఆదాయం మనకే దక్కుతోంది. ముఖ్యంగా రాష్ట్ర సరిహద్దుల్లోని షాపుల్లో అమ్మకాలు భారీగా పెరిగి, పక్క రాష్ట్రాల షాపుల్లో విక్రయాలు పడిపోయాయి. దీంతో 11.05 శాతం ఆదాయం పెరిగింది. కర్ణాటక మినహా మిగిలిన ఏ రాష్ట్ర మద్యం ఆదాయంలోనూ రెండంకెల వృద్ధి కనిపించలేదు.

**అమ్మకాలు పైపైకి!**
ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 5 నెలల్లో అమ్మకాలపై ఎక్సైజ్ శాఖ అధ్యయనం చేసింది. ఈ వివరాలను ఇటీవలి కలెక్టర్ల సదస్సులో ఆ శాఖ అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ ఐదు నెలల కాలంలో 10.29శాతం అమ్మకాలు పెరిగాయి. 2024–25లో రూ.11,812 కోట్ల అమ్మకాలు నమోదయ్యాయి. ఈ ఏడాది అదే కాలంలో రూ.13,028 కోట్ల విక్రయాలు జరిగాయి. అదే తెలంగాణలో 3.45 శాతం, తమిళనాడులో 5.3 శాతం, కర్ణాటకలో 4.27 శాతం, కేరళలో 6.74 శాతం మాత్రమే అమ్మకాలు పెరిగాయి. గతేడాది అక్టోబరులో కొత్త మద్యం విధానం అమల్లోకి వచ్చిన తర్వాత పరిస్థితి మారింది. ఆదాయాన్ని పరిశీలిస్తే.. ఐదు నెలల కాలంలో ఏపీ 11.05 శాతం వృద్ధి సాధించింది. తెలంగాణ 0.65 శాతం, తమిళనాడు 2.53 శాతం, కర్ణాటక 13.64 శాతం, కేరళ 6.25 శాతం ఆదాయం పెరిగింది. మద్యం అమ్మకాలు భారీగా నమోదయ్యే ఒక్క కర్ణాటక మినహా మిగిలిన అన్ని రాష్ట్రాల్లో ఆదాయం చెప్పుకోదగ్గ స్థాయిలో పెరగలేదు. ఏపీ ప్రజలు పక్క రాష్ట్రాల్లో మద్యం కొనుగోలు మానేయడం వల్లే అమ్మకాలు, ఆదాయం ఇలా పెరిగాయని అధికారులు అంచనా వేశారు. సాధారణంగా మద్యం విక్రయాలలో ఎప్పుడూ 10శాతం వృద్ధి ఉంటుంది. గత ప్రభుత్వం నిర్వాకంతో అమ్మకాలు పెంచుకున్న సరిహద్దు రాష్ట్రాలకు ఇప్పుడు ఆ అవకాశం లేకుండా పోయింది. ఫలితంగా విక్రయాలు తగ్గాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా రూ.29,442 కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.30 వేల కోట్లు దాటనుంది.

**జిల్లాల వారీగా ఇలా...**
జిల్లాలవారీగా గడిచిన 5 నెలల అమ్మకాలు పరిశీలిస్తే కర్నూలు టాప్‌లో ఉంది. తెలంగాణతో సరిహద్దు ప్రాంతం ఎక్కువగా ఉండే ఆ జిల్లాలో 57శాతం అమ్మకాలు పెరిగాయి. శ్రీసత్యసాయి జిల్లాలో 53 శాతం, అల్లూరిలో 52 శాతం, చిత్తూరులో 44శాతం అమ్మకాలు పుంజుకున్నాయి. కానీ, విజయనగరం, కృష్ణా, కడప, శ్రీకాకుళం జిల్లాల్లో అమ్మకాలు పెరగకపోగా తగ్గాయి. గుంటూరు, నెల్లూరులో 3 శాతం మాత్రమే అమ్మకాలు పెరిగాయి. అయితే, కొన్ని జిల్లాల్లో ఎమ్మార్పీ ఉల్లంఘనల కారణంగా అమ్మకాలు తగ్గుతున్నాయి.

**రూ.132 కోట్ల భారం తగ్గింది**
వైసీపీ ప్రభుత్వంలో నాసిరకం బ్రాండ్లతో ఇక్కడి మద్యం తాగాలంటే వినియోగదారులు భయపడ్డారు. వాటికే ధరలు విపరీతంగా పెంచడంతో అమ్మకాలు ఇంకా తగ్గాయి. పోనీ ఈ కారణాల వల్ల ప్రజలు మందు మానేశారా అంటే అదీ లేదు. ఎక్కువ ఖర్చయినా కొందరు పక్క రాష్ట్రాల నుంచి మద్యం తెప్పించుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సరైన ప్రమాణాలు పాటించని 29 బ్రాండ్లను నిలిపేశారు. 46 బ్రాండ్లు స్వచ్ఛందంగా ధరలు తగ్గించుకున్నాయి. ఈ ప్రభుత్వంలో కమీషన్ల బెడద లేకపోవడంతో తక్కువ ధరకే మద్యం సరఫరా చేసేందుకు ముందుకొచ్చాయి. దీంతో ఒక్కో లిక్కర్ బాటిల్‌పై రూ.10నుంచి రూ.100 వరకు ధర తగ్గింది. ఫలితంగా నెలకు వినియోగదారులపై రూ.132 కోట్ల భారం తగ్గింది. ఇది ఖజానాకు నష్టం అయినప్పటికీ ఏపీలో 11.05 శాతం వృద్ధి నమోదైందని అధికారులు చెప్పారు.

# జగన్ చుట్టూ చక్రబంధం

విజయవాడ

వైసీపీ చీఫ్ వైఎస్ జగన్ చుట్టూ చక్రబంధం బిగుసుకుంటుందా? అంటే అవుననే అంటున్నారు. అనేక విషయాలు జగన్ కు రానున్న కాలంలో కష్టాలు తప్పేట్లు లేదని సంకేతాలు కనిపిస్తున్నాయి. జగన్ పై కేంద్ర ప్రభుత్వం వైఖరి మారినట్లు కనపడుతుందంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి కొంత కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు వేగంగా అడుగులు వేయడం చూస్తుంటే జగన్ కు కష్టాలు చుట్టుముడుతున్నట్లే కనిపిస్తుంది. ఎందుకంటే గత వారం రోజుల నుంచి జరుగుతున్న ఘటనలు ఇందుకు కారణమని వైసీపీలోని చాలా మంది నేతలు భావిస్తున్నారు. జగన్ చుట్టూ చక్రబంధం వేస్తున్నట్లే కనిపిస్తుంని పార్టీకి చెందిన సీనియర్ నేత ఒకరు చేసిన వ్యాఖ్యలను బట్టి అర్థమవుతుంది. చంద్రబాబు నాయుడు పక్కా పొలిటికల్ లీడర్. తాను జగన్ పై ఏదో కేసులు పెట్టి జైలుకు పంపితే అది సానుభూతిగా మారి జగన్ కు వరంగా మారుతుంది. రాజకీయంగా నష్టం జరిగేది టీడీపీకే. అందుకే ఈసారి ఆ బాధ్యతను కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలపైన పెట్టినట్లు కనిపిస్తుంది. దానివల్ల సానుభూతి గ్రాఫ్ చాలా వరకూ తగ్గించే వీలుందన్నది చంద్రబాబు అంచనా. గతంలో తనను 52 రోజుల పాటు జైలులో వేయడంతోనే ఈసారి టీడీపీకి అంత గా ప్రజలు పట్టం కట్టారు. అదే పద్ధతిలో తాను వెళితే.. అదే సానుభూతి జగన్ కు చేరుతుందని అంచనా వేసిన పెద్దాయన ఇప్పటి వరకూ ఎలాంటి కేసుల విషయంలో దూకుడు ప్రదర్శించలేదు. తన పార్టీ నేతలు, కార్యకర్తలు ఈవిషయంలో అసంతృప్తిగా ఉన్నప్పటికీ చంద్రబాబు దూరాలోచనతో దానిని పట్టించుకోనట్లు వదిలేస్తున్నారు. ఇక తాజాగా వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తిరిగి దర్యాప్తు చేయడానికి తాము సిద్ధమని సీబీఐ సుప్రీంకోర్టుకు చెప్పడాన్ని కూడా కొందరు ఉదహరిస్తున్నారు. 2019లో వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగితే అందులో ఎవరి ప్రమేయం ఉందన్నది ఇంత వరకూ తేలలేదు. సీబీఐ ఒక దశలో తాము దర్యాప్తు పూర్తి చేశామని చెప్పేసింది. కానీ చివరకు సీబీఐ తాము విచారణ చేపట్టడానికి సిద్ధమని చెప్పడం బట్టి చూస్తుంటే జగన్ కు కొన్ని చిక్కులు తప్పేలా లేవని అంటున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారుల సోదాలు నిర్వహించడాన్ని బట్టి చూస్తే కేంద్ర దర్యాప్తు సంస్థలే జగన్ చుట్టు ఉచ్చు బిగుస్తున్నట్లు తెలిసింది. ఇన్నాళ్లూ హస్తినతో మంచి సంబంధ బాంధవ్యాలు మెయిన్ టెయిన్ చేసిన జగన్ కు ఈసారి మాత్రం ఆసరా దొరికే అవకాశం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. మరి ఈ చక్రబంధం నుంచి జగన్ ఎలా తప్పించుకుంటారో చూడాలి.





# బాస్ ఈజ్ బ్యాక్

**జనసేన రాజమండ్రి సిటీ ఇన్చార్జిగా అనుశ్రీ పునర్నియామకం**

**అనుశ్రీకి శుభాకాంక్షల వెల్లువ**

**అనుశ్రీపై సస్పన్షన్ తొలగించిన అధినేత పవన్ కల్యాణ్**

**అనుశ్రీ రాకతో మళ్ళీ రాజమండ్రిలో జనసేనకు పూర్వ వైభవం**

**జనసైనికులు,వీరమహిళలు సంబరాలు**

**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ ప్రత్యేక కథనం:** సస్పెన్షన్ తొలగించి జనసేన రాజమండ్రి సిటీ ఇన్చార్జిగా అనుశ్రీ(అత్తి )సత్యనారాయణను పునర్నియమించడంతో బాస్ ఈజ్ బ్యాక్ అంటూ జనసైనికులు వీర మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.జనసేన అధినేత,ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అనుశ్రీపై సస్పన్షన్ తొలగించి పునర్నియామం చేసినట్లు ప్రకటించడంతో పార్టీ శ్రేణులు,అనుశ్రీ అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు.పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రం విడుదల సందర్భంగా తెలంగాణ ఎగ్జిబిటర్లు థియేటర్ల విషయంలో చేసిన కుట్రకు బలైన అనుశ్రీ సత్యనారాయణ నాలుగు నెలల క్రితం సస్పన్షన్ వేటుకు గురయ్యారు. తన తప్పులేదని ఆయన పార్టీకి వివరణ ఇచ్చుకోవలసి వచ్చింది.దీనిపై జనసేన అధిష్టానం విచారణ జరపడంతో అనుశ్రీ సత్యనారాయణ తప్ప లేదని తేలడంతో తిరిగి రాజమండ్రి అర్బన్ నియోజకవర్గం ఇన్చార్జి పగ్గాలు అప్పగించారు. సుమారు నాలుగు నెలలుగా రాజమండ్రి జనసేన పార్టీలో అనుశ్రీ లేని లోటు కనిపించిందని కార్యకర్తలు,నాయకులు, వీరమహిళలు వ్యాఖ్యానిస్తున్నారు. ఎప్పుడూ చిరునవ్వుతో నిత్య చైతన్యశీలిగా చురుగ్గా పార్టీ కార్యక్రమాలు,కూటమి ప్రభుత్వ కార్యక్రమాల్లో తిరిగే ఆయన సస్పన్షన్ తరువాత పార్టీ కార్యక్రమాలకు దూరంగా మౌనంగాఉండిపోయారు.

జనసేన రాజమండ్రి కార్పొరేషన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ ఇంత వరకు పార్టీ బాధ్యతలు చూశారు. పార్టీ ఆవిర్భవం నుంచి రాజమండ్రి సిటీలో జనసేనకు మంచి పునాది వేసి నిరంతరం ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తూ పార్టీని బలోపేతం చేసిన అనుశ్రీ సత్యనారాయణ 2019 ఎన్నికల్లో పోటీ చేసి 25 వేలకు పైగా ఓట్లు సాధించగలిగారు.

ఆ తర్వాత 2024 నాటికి పార్టీ బలం మరింత పెంచారు. కూటమి పొత్తులో భాగంగా టీడీపీ అభ్యర్ది ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు)కు సిటీ సీటును జనసేన త్యాగం చేయాల్సి వచ్చింది.ఆ ఎన్నికల్లో అధినేత పవన్ కల్యాణ్ పిలుపు మేరకు జన సైనికులు కూటమి అభ్యర్ది విజయానికి కసిగా పనిచేశారు.టీడీపీ,జనసేన,బీజేపీ కలిసికట్టుగా పని చేయడంతో రాజమండ్రి సిటీలో టీడీపీ అభ్యర్ది ఆదిరెడ్డి వాసు కనీవినీ ఎరుగని రీతిలో 72 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. ఎన్నికల అనంతరం అనుశ్రీ సత్యనారాయణకు మంచి నామినేటెడ్ పోస్టు వస్తుందని అంతా ఆశించారు.అనుకోని ఉపద్రవం ముంచుకొచ్చి ఆయనపై సస్పన్షన్ వేటు పడింది.ఇప్పుడు గ్రహణం వీడింది.ఇకపై మళ్ళీ అనుశ్రీ స్టైల్ రాజకీయం మొదలవుతుంది.ఎందు

కంటే ఆయన ప్రత్యర్థి పార్టీ నాయకులపై చేసే చేసే విమర్శలు చురుక్కు చమక్కు అన్నట్లుగా ఉంటాయి. 2024 ఎన్నికల ముందు, తరువాత కూడా వైసీపీ నాయకులపై ముఖ్యంగా మాజీ ఎంపీ మార్గాని భరత్ ను అనుశ్రీ ఒక ఆటాడుకునేవారు.

ఆ విమర్శ వాస్తవానికి దగ్గరగా ఉండి ప్రత్యర్థికి కారం పూసినట్లు మండేది. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కు అనుశ్రీ సత్యనారాయణ అండగా, చేదోడు,వాదోడుగా ఉండేవారు.ఆయన లేని ఈ మూడు నాలుగు నెలలుగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఒక్కరే ప్రతిపక్ష వైసీపీ నాయకులపై ఎదురుదాడి చేస్తున్నారు.ఇప్పుడు మళ్ళీ అనుశ్రీ రాకతో నిప్పుకు వాయువు తోడైనట్లు వైసీపీ నాయకుల విమర్శలకు అనుశ్రీ తనదైన శైలిలో ప్రతి విమర్శలు చేస్తారని అంతా భావిస్తున్నారు.ప్రతిపక్షాలకు మాటల తూటలతో సరైన కౌంటర్లు ఇచ్చే ఎన్ కౌంటర్ (విమర్శల)స్పెషలిస్టు అనుశ్రీ సత్యనారాయణ మళ్ళీ పొలిటికల్ రీ ఎంట్రీ ఇవ్వడం జనసైనికులు, నాయకులు,వీరమహిళలకు సంతోషం కలిగిస్తోంది. అందుకే బాస్ ఈజ్ బ్యాక్ అంటున్నారు.

# నగర పాలక సంస్థ అవినీతి కంపులో విధులు నిర్వహణ.

- రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు అవస్థలు..

-రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పెండ్యాల కామరాజు , ఆరోపణ,



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** రాజమండ్రికి దిశ వున్నా దశ లేకుండా పోయిందని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి)ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టి వారంతపు సమావేశంలో అర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు ఓ ప్రకటనలో తీవ్ర ఆవేదన చెందారు .. కామరాజు మాట్లాడుతూ పేరుకు మాత్రమే రాజమండ్రిది కార్పొరేషన్ స్థాయి ఆచరణలో మాత్రం మురికి కూపం.. రాజమండ్రి కి వచ్చే అధికారులు రాజమండ్రి అభివృద్ధి సుందరికరణ కన్నా వారు సుందరలుగా మారుతున్నారు. పాలకులు అంటే గౌరవం లేదు . పౌరులపై ఆప్యాయత లేదు.ఏ విభాగంలోను పౌర సేవలు అమలు కావు. ఎందుకోసం నగర పాలక సంస్థ వున్నదో నగర పౌరులకు అర్ధం కాదు. ఏ పని అయినా అవినీతి ముడుపులు అప్పగించాల్సిందే,లేకుంటే సంవత్సరాలు గడిచినా ఆ పని కాదు,కొన్ని కార్పొరేషన్ పబ్లిక్ స్థలాలను మాల్స్ కు ఉపయోగ పడే విధంగా ప్రైవేట్ పార్కింగ్ లకు దారదత్తం చేసి లక్షల్లో అవినీతి సొమ్ములు ఆర్జిస్తున్నారు.పారిశుధ్య మురుగు కంపుతో ప్రజలు అసౌకర్య జీవితాలు గడుపుతున్నారు.దోమలు నిర్మూలనకు సైతం నాణ్యమైన మందు కొట్టకుండా వాటిలో కూడా జేబులు నింపుకుంటున్నా రు.రాజమండ్రి రోడ్ల పరిస్థితి అఘామ్యగోచరంగా వుంది . కొన్ని రోడ్లు గుంతలు గత రెండేళ్లుగా పుడ్చలేదు. కొన్ని రోడ్లు రెండేళ్ల పైభడి పూర్తి చేయలేదు.కాలువలు పూడికలు తీసి ఎన్నేళ్లు అయ్యిందో చెప్పగలరా ! ప్రజలు కట్టే పన్నులు ఎక్కడికి వెళుతున్నాయో , కార్పొరేషన్ ఉద్యోగులు ఎందుకు విధులు నిర్వహిస్తున్నారో నగర ప్రజలకు మిలియన్ డాలర్ల ప్రశ్నగా వుందని ఆయన తీవ్ర మనస్థాపం చెందారు బంగారం. రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రి పేరుకు మాత్రమే పెద్ద ఆసుపత్రి ఇక్కడ వైద్య సేవలు మాత్రం రోగులకు అందవు.జనరల్ వార్డులు , సెప్టిక్ వార్డుల పరిస్థితులు వర్ణనాతీతం. పారిశుధ్యం లేక ఆసుపత్రిలో కొత్త రోగాలు రోగులను వెంటాడుతున్నాయి.రోగం నిర్ధారణకు సంబందించిన రక్త పరీక్షలు అక్కడ వద్దు బయటనే చేయించుకోండి మంచి రిజల్ట్ వస్తాయి అని అక్కడ వారే చెప్పటం గమన్నార్వం.ఆసుపత్రి లో వైద్య పరికరాలు వున్నా నిరుపయోగం గానే ఉంటాయి. ఉద్దేశ్య పూర్వకంగానే భయట ప్రైవేట్ వ్యక్తులతో లాలూచి అయ్యి ఆసుపత్రిలో గల యంత్రాలు పనికి రాకుండా చేస్తున్నారు.రేడియాలజిస్ట్ ఆసుపత్రిలో రోగుల అవసరార్ధం కనపడి ఎన్ని రోజులు అయ్యిందో ఆసుపత్రి వర్గాలకే తెలియదు.కాలం చెల్లిన మందుల కంపెనీలతో ముందుగా మాట్లాడుకుని రోగం తగ్గని మందులు రోగికి ఇస్తున్నారు.ప్రశ్నించే రోగులను కాకినాడ ఆసుపత్రికి బదిలి చేస్తు రోగిని,రోగి బంధువులను మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రోగులకే ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలపై నమ్మకం కోల్పోయే విధంగా భయభ్రాంతులకు గురించేస్తున్నారని ఆయన తీవ్ర ఆందోళన చెందారు . రాజమండ్రి నగర పాలక సంస్థకు నేటి వరకు విడుదల చేసిన నిధులు పైన , నివాసితులు, వ్యాపారస్తులు నుండి వసూలు కాబడుతున్న పన్నులు పైన, నగర అభివృద్ధికి ఖర్చు చేసిన నిధులు పైన స్పష్టమైన శ్వేతపత్రం రాజమండ్రి నగర పాలక సంస్థ విడుదల చేయాలి.రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు నిత్యం రోగులకు అందుబాటులో వుండే విధంగా మెరుగైన సంస్కరణలు చేపట్టాలి . పారిశుధ్యం,నాణ్యమైన మందులు,ల్యాబ్ టెక్నీషియన్స్, రేడియాల జిస్టు రోగులకు అందుబాటులో ఉండాలి . నిత్యం రోగుల వద్ద , రోగి బంధువుల వద్ద నుండి తస్కరింపబడుతున్న వస్తువులు,నగదు రక్షణకై ప్రధానమైన ప్రాంతాల్లో నిత్యం పర్యవేక్షణ వుండే విధంగా సి సి కెమెరాలను అమర్చాలి.వైద్యులు , టెక్నీషియన్స్ , పారిశుధ్య సిబ్బందికి సంబందించిన మొబైల్ నెంబర్లు తెలిపే విధంగా పెద్ద నోటిస్ బోర్డులు ఆసుపత్రి ప్రాగణంలో ఏర్పాటు చేయాలని ఆర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు డిమాండ్ చేసారు .

**ఈ సభకు ఆర్పిసి సెక్యులర్ మేడిచర్ల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు.**

ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ సిమ్మా దుర్గారావు,దుడ్డే త్రినాద్ , ఎమ్ డి హుస్సేన్,వర్ధనపు శరత్ కుమార్,కారుమూరు యుగంధర్,దుడ్డే సురేష్, వల్లి శ్రీనివాసరావు,గుడ్ల సాయి దుర్గా ప్రసాద్,బసా సోనియా,వాడపల్లి జ్యోతిష్,యర్రా బాల మురళి కృష్ణ ,పసుపులేటి వీర్రాజు,పసుపులేటి సుశీల, మాసా రాజులమ్మ, మాసా నూకరాజు, మాసా అప్పాయమ్మ, చల్లా సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ఆర్టిఫిషియల్ లింబ్స్

**- హీల్ సంస్థ ద్వారా కొలతలు తీయించిన దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్**

**- అవసరమైన వారు 939 108 9381 నెంబరులో సంప్రదించాలి.**



**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు:** దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గన్నవరం దగ్గర ఉన్న హీల్ సంస్థ ద్వారా వచ్చే నెలలో ఆర్టిఫిషియల్ లింబ్స్ ఇప్పించడానికి ఉభయగోదావరి జిల్లాలకు చెందిన 9 మంది దివ్యాంగుల నుంచి కొలతలు తీసుకున్నారు. కొవ్వూరు నుండి దివ్యాంగులను పంపడానికి ప్రయాణ ఖర్చుల నిమిత్తం ఆర్ధిక సహాయం దాతలు అందించారు. తాళ్లపూడి మంగన్న సర్జికల్ అండ్ మెటర్నరీ నర్సింగ్ హెూమ్ డాక్టర్ మూర్తి 7 వేలు, టీచర్ మోహన్ 1000, చందు 500 సహాయం చేశారు. ముఖ్య అతిథిగా ఏ ఎస్ ఓ జోడాల వెంకట్ విచ్చేసారు. ఈ కార్యక్రమంలో దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ప్రత్తిపాటి నాగరాజు, వేములూరి రాజు పాల్గొన్నారు. దివ్యాంగులకు ఆర్టిఫిషియల్ లింబ్స్ కావలసిన వారు తమ సంస్థ ను (మొబైల్ నెంబర్ 939 108 9381) సంప్రదిస్తే, ఉచితంగా ఇప్పిస్తామని తెలియజేశారు.

## ఎన్టీఆర్ జాతీయ అవార్డు గ్రహీత వీర్నాలకృష్ణకు ఎంపీ పురందేశ్వరి అభినందన



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** విశాఖకు చెందిన దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ ఈనెల 14వ తేదీన 37వ జాతీయ వార్షికోత్సవాలు సందర్భంగా వివిధ రంగాలలో విశిష్ట కృషి చేసిన కళా ప్రముఖులకు అవార్డులు ప్రకటించింది. అందులో భాగంగా తూర్పుగోదావరి జిల్లా బేడ బుడగ జంగాలకు చెందిన ప్రముఖ బుర్రకథ కళాకారులు వీర్నాలకృష్ణ కు ఎన్టీఆర్ జాతీయ పురస్కారం లభించింది. అదే వేదికపై విశాఖరత్న కల్చరల్ అసోసియేషన్ నుండి సేవా కార్యక్రమాల్లో భాగంగా కళాసేవా రత్న మరో అవార్డు లభించింది. ఒకే వేదికపై ఒకేరోజు రెండు అవార్డులు లభించడం కళాకారుడుగా తనకు ఎంతో గర్వకారణంగా ఉందని తెలిపారు.ఎన్టీఆర్ జాతీయ అవార్డు అందుకున్న వీర్నాల కృష్ణకు ఎంపీ దగ్గుబాటిపురందేశ్వరి అభినందనలు తెలుపుతూ, నాన్న పేరు మీద ఈ అవార్డు అందుకున్నందుకు ఆనందిస్తున్నాను. కళాకారులకి తగిన గౌరవం దక్కాలన్నదే నాన్న ఆకాంక్ష ఇలాంటి అవార్డులు మరెన్నో అందుకోవాలి అని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఏపీ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్.ఆర్ కృష్ణ బాబు,తూర్పుగోదావరి జిల్లా బేడ బుడగ జంగాల అధ్యక్షులు వీర్లపల్లి ఏసు, బిజెపి నాయకులు తగరం సురేష్ బాబు,మట్టా వెంకట రమణ,రాష్ట్ర కళాకారుల సంఘం మహిళ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖపట్నంలో 22వ తేదీన వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ పై అవగాహన సదస్సు



**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** విశాఖపట్నం లో 22వ తేదీన నిర్వహించే వైజాగ్ స్టీల్ ప్రయివేటి కరణ ప్రభావం ,కర్తవ్యం పై జరుగు సదస్సు ని విజవంతం చెయ్యాలని లైబరేషన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ బొంతా శ్యామ్ రవిప్రకాష్ కోరారు దీనికి ముఖ్య అతిథిగా మాజీ ఐఏఎస్ అధికారి లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జి యస్ ఆర్ కె ఆర్ విజయ్ కుమార్ పాల్గొంటారని తెలిపారు లాభాల్లో వున్నా స్టీల్ ప్లాంట్ ను నష్టాలోకి నెట్టి ప్రయివేటి కరణ చేయడం దారుణం అన్నరు స్టీల్ ప్లాంట్ యస్సి ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘమ్ అధ్యర్యంలో జరుగుతుందని తెలిపారు అధ్యక్షులు బి తౌడన్న జనరల్ సెక్రటరీ బయ్యే మల్లయ్య కార్యనిర్వాహక అధ్యక్షులు సత్యనారాయణ వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నటరని తెలిపారు

## రోడ్లను మరమ్మతులు చెయ్యాలి

ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలని విజ్ఞప్తి

ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ను కలిసిన పెందుర్తి అభిరామ్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** శనివారం ఉదయం రాజమహేంద్రవరంలోని ఆర్ అండ్ బి కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ను రాజానగరం తెలుగుదేశం పార్టీ యువ నాయకులు పెందుర్తి అభిరామ్ కలిశారు.ఇటీవల కాలంలో కురిసిన భారీ వర్షాల కారణంగా రాజానగరం నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి, ఈ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వెంటనే మరమ్మతులు చేపట్టాలని అలాగే పూర్తిగా దెబ్బతిన్న రోడ్లను పునర్నిర్మించాలి కోరిన పెందుర్తి అభిరామ్ ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ రోడ్ల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించారాని పెందుర్తి అభిరామ్ పేర్కొన్నారు. దీనికి స్పందించిన ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డిప్యూటీ ఇంజనీర్లు నియోజకవర్గం లో పలు రహదారుల అభివృద్ధి పనులు స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సహకారం ప్రోత్సాహంతో ప్రారంభించామని తొందరలోనే పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకి పెందుర్తి అభిరామ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



## ఎడిటర్ వాయిస్

# మావోయిస్టుల్లో మార్పు సాధ్యమేనా

ఆపరేషన్ కగార్.. మావోయిస్టులను కంగారెత్తిస్తున్నాయి. అందుకే కాల్పుల విరమణ పాటిద్దాం.. చర్చలకు సిద్ధం అని చెప్పడం సంచలనంగా మారింది. ఇకపై ప్రజా పోరాటాల్లో పాల్గొంటామన్న మావోలు. మావోయిస్టు పార్టీ తీసుకున్న సంచలన నిర్ణయం చుట్టూ పెద్ద కథే నడుస్తోంది. ఆయుధాలను వదిలి సాయుధ పోరాటానికి తాత్కాలిక విరమణ పాటించాలని నిర్ణయించినట్లు ప్రకటించింది. మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో లేటెస్ట్ గా ఒక ప్రకటన రిలీజ్ అయింది. అభయ్ పేరుతో చలామణి అవుతున్న కిషన్ సోదరుడు మల్లోజుల వేణుగోపాల్ ఫోటోను తాజా స్టేట్ మెంట్లో ప్రింట్ చేశారు. అంతే కాదు ప్రజాభిప్రాయాలు పంచుకునేందుకు ఫేస్ బుక్, ఈ మెయిల్ ఐడీలను జత చేశారు. నిజానికి మావోయిస్టులు గతంలో ఎన్నడూ ఇలా చేసిన దాఖలాల్లేవు. కానీ ఇది నిజమే అంటున్నారు. నెల రోజుల తర్వాత బయటికొచ్చిన స్టేట్మెంట్. ఆగస్టు 15వ తేదీతో ఉన్న ఈ స్టేట్ మెంట్ నెల రోజుల తర్వాత అంటే సెప్టెంబర్ 16న రాత్రి వెలుగులోకి వచ్చింది. శాంతి చర్చకు సిద్ధమే అన్న సంకేతాలు పంపారు. ఈఏడాది మార్చి నుంచి మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రభుత్వంతో శాంతిచర్చలకు నిజాయతీగా ప్రయత్నిస్తోందని, మే 10న పార్టీ ప్రధాన కార్యదర్శి స్వయంగా పార్టీ కేంద్ర కమిటీ ప్రతినిధి అభయ్ పేరుతో ప్రకటన విడుదల చేశారు. పార్టీ ఆయుధాలను వదులుకుంటున్నట్లు ప్రస్తావించారు. ప్రభుత్వానికి కాల్పుల విరమణ ప్రతిపాదించారు. అయితే కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా రియాక్ట్ కాలేదు. ఒకవైపు తుపాకులు చేతబట్టి ఇంకోవైపు చర్చలు అంటే ఎలా అని క్వశ్చన్ కూడా చేశారు. వీటికి తోడు 2024 జనవరి నుంచి బలగాలతో కూంబింగ్ ముమ్మరం చేయించి దొరికితే ఎన్ కౌంటర్ అన్నట్లుగా వ్యవహారం నడిపిస్తోంది. చాలా మంది ఎన్ కౌంటర్లలో హతమయ్యారు. ఇందులో పార్టీ అగ్రనేతల నుంచి కామన్ మావోయిస్టుల దాకా ఉన్నారు. మే 21న గుండెకోట్ సమీపంలో జరిగిన భీకర దాడిలో పార్టీ ప్రధానకార్యదర్శి బస్వరాజ్‌తో పాటు 28 మంది చనిపోయారు. ఆపరేషన్ కగార్‌ను స్పీడప్ చేసిన కేంద్రం. పైగా కేంద్రం ఆపరేషన్ కగార్ ను స్పీడప్ చేసింది. 2026 మార్చి నాటికి మావోయిస్టుల అంతమే పంతంగా ముందుకెళ్తోంది. మొన్నటికి మొన్న కర్రెగుట్టల్ని జల్లెడ పట్టి కథ ముగించారు. ఇంకా కూంబింగ్స్ పెద్ద ఎత్తున సాగుతున్నాయి. గ్రౌండ్ నుంచి హెలికాప్టర్లు ఇలా అన్ని చోట్లా గాలింపు పెరగడంతో మావోయిస్టులకు షెల్టర్ కరువైంది. దీంతో బస్వరాజ్ ఆలోచనలకు తగ్గట్లుగా శాంతిచర్చలను ముందుకు తీసుకెళ్లాలని తాము నిర్ణయించుకున్నామంటోంది మావోయిస్టు పార్టీ. ఆయుధాలు విదలి జనజీవన స్రవంతిలో కలవాలన్న ప్రధాని సూచనతో తాము వెపన్స్ వదిలేయాలని డిసైడ్ చేసుకున్నామంటున్నారు. హోంమంత్రి లేదంటే ఆయన ప్రతినిధి ఎవర్ని నియమించినా చర్చలకు సిద్ధమంటున్నారు. అయితే తమ అభిప్రాయం చెప్పడానికి తమ ఇతర సహచరులు, అలాగే జైళ్లలో ఉన్న మావోయిస్టు నేతలను సంప్రదించి నిర్ణయం ప్రకటిస్తామని, ఇందుకోసం నెల రోజుల టైం ఇవ్వాలన్నారు. ఆ లోపు కూంబింగ్ వద్దు.. బలగాల కాల్పులు వద్దు అని కోరుకుంటున్నారు. చర్చల విషయంలో ప్రభుత్వంతో వీడియోకాల్ ద్వారానైనా తమ అభిప్రాయాలను పంచుకోవడానికి రెడీ అంటున్నారు. సో ఇప్పుడు అసలు గేమ్ షురూ కాబోతోంది. 2026 మార్చి నాటికి మావోయిస్టుల్ని నామరూపాల్లేకుండా చేయాలని, పూర్తిగా రెడ్ కారిడార్ అన్నదే లేకుండా చేయాలన్న లక్ష్యంతో కేంద్రం ఉంది. అయితే మావోయిస్టులను లొంగిపోయేలా చేయడం, లేదంటే ఎన్ కౌంటర్లలో హతమార్చడం ఈ రెండే టార్గెట్. మధ్యలో చర్చలకు తావు లేదని కేంద్రం అంటోంది. మరి రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందన్నది కీలకంగా మారింది. మావోయిస్టుల్లో ఇప్పుడు అగ్రనేతలంతా చాలా వరకు ఎన్ కౌంటర్ అయ్యారు. కొందరే మిగిలారు. అందులో చాలా మంది లొంగిపోవడానికి రెడీగా లేరు. చావో రేవో అంటున్నారు. అటు మరికొందరు కగార్ తో ఏ ఒక్కరు కూడా బతికే పరిస్థితి లేదంటున్నారు. అందుకే ఆయుధాలు వదిలి చర్చలకు ప్రయత్నిద్దామని చెప్పి ఇలా లేఖ రిలీజ్ చేశారా? అసలు ఈ లేఖ నిజమా కాదా అన్నది కూడా మరో డౌట్ గా మారింది. మరిప్పుడు గేమ్ ఎలా మారబోతోంది? జనంలోనే ఉండి పోరాటాలు చేస్తారా? కేంద్ర ప్రభుత్వం అస్సలు ఛాన్స్ ఇవ్వట్లేదు. ఈ మొత్తం ఎపిసోడ్ లో సామాన్యులకు ఇబ్బందులు వస్తున్నాయని, కోవర్టులని, మరొకటని సమస్యలు పెరుగుతున్నాయి తప్ప తగ్గడం లేదు. దీంతో ఏ ప్రజల కోసమైతే అడవుల బాట పట్టారో ఇప్పుడు జనంలోనే ఉండి ప్రజాపోరాటాలు చేయాలన్న నిర్ణయానికి మావోలు వచ్చారా అన్న చర్చ జరుగుతోంది. ఒకవేళ మావోయిస్టులు నిజంగానే తుపాకులు వదిలి జనజీవన స్రవంతిలోకి వస్తే వెనుకబడిన ప్రాంతాల్లో శాంతి, అభివృద్ధికి మార్గం సుగమం అవుతుందంటున్నారు. నిజానికి కేంద్రం ప్రభుత్వం మావోయిస్టులతో అసలు చర్చలే లేవంటోంది. అయితే లొంగిపోవడం, లేదంటే ఎన్ కౌంటర్ అవడం రెండే ఆప్షన్లు ఇచ్చింది. సో నెల రోజులు కాల్పుల విరమణ కొనసాగుతుందా లేదా అన్నది కూడా పెద్ద డౌటే. తెలంగాణ, ఏపీ, జార్ఖండ్, ఒడిశా, మహారాష్ట్ర ఇలా రెడ్ కారిడార్ ఏరియాల్లో అగ్రనేతలంతా ఒక్కొక్కరుగా వచ్చి డీజీపీలు, ఐజీలు ఇలా పోలీస్ ఆఫీసర్ల ముందు లొంగిపోతున్నారు. ఇటీవలే తెలంగాణలో డీజీపీ ముందు సుజాతక్క సరెండర్ అయ్యారు. మావోలకు బలగాలపై తిరగబడే పరిస్థితి ఉందా? సో కేంద్ర ప్రభుత్వం సిగ్నల్స్ ప్రకారం చూస్తే మావోయిస్టులు సాయుధ పోరాటాన్ని వదులుకోవడమే మార్గంగా కనిపిస్తోంది. బలగాలపై తిరగబడే పరిస్థితి అసలే లేదు. సామాజిక సమస్యలపై దృష్టి పెట్టి ప్రజా పోరాటాలే చేయడం మార్గం ఉంది. సో ఫైనల్ గా మావోయిస్టు ఉద్యమంలో బిగ్ ట్విస్ట్ వచ్చినట్లైంది. ఆపరేషన్ కగార్ ఎఫెక్ట్ తో కథ మారిపోతోంది. పెద్ద ఎత్తున సరెండర్లు జరుగుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 600 మంది వరకు మావోయిస్టులు అరెస్ట్ అవడం లేదంటే లొంగిపోవడం జరిగాయి. గత 16 నెలల్లో 1600 మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిశారు. సిపిఐ మావోయిస్ట్ పార్టీ సెంట్రల్ కమిటీ పూర్తి సరెండర్‌కు రెడీ అని ప్రకటించడం వెనుక పెద్ద కారణాలే ఉన్నాయి. ఈ ఏడాది 192 మంది ఎన్ కౌంటర్ అయ్యారు. గత 9 నెలల్లో 210 మంది, గత 15 నెలల్లో 400 మంది హతమయ్యారు.

2024 జనవరిలో ఆపరేషన్ కగార్ ప్రారంభమైన తర్వాత మావోయిస్టులు తీవ్ర ఒత్తిడిలో ఉన్నారు.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# నైపుణ్యానిదే భవిత



చాన్నాళ్ల క్రితం 'మీ పిల్లల్ని ఏం చదివిద్దామనుకుంటున్నార'ని తల్లిదండ్రుల్ని అడిగితే వైద్య విద్యనో, సాంకేతిక విద్యనో సమాధానంగా వచ్చేది. 90వ దశకానికల్లా సాంకేతిక విద్యే తారక మంత్రమైంది. పట్టా రావటానికి ముందే క్యాంపస్ ఇంటర్వ్యూల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఖాయమయ్యేది మరి. ఇప్పుడంతా తారుమారైంది. సాంకేతిక విద్య కిక్కిరిసి అవకాశాలు అంతంత మాత్రం అయ్యాయి. చదువుతోపాటు సాంకేతిక నైపుణ్యాలగురించి అడగటం మొదలైంది. ప్రస్తుతం కృత్రిమ మేధ(ఏఐ)లో నైపుణ్యం ఏమిటన్నదే ప్రధాన ప్రశ్నగా మారింది. దశాబ్దం క్రితం నైపుణ్యాల విషయంలో మన సాంకేతిక పట్టభద్రులు వెనకబడి ఉన్న మాట వాస్తవమే అయినా ఇప్పుడంతా మారిందని తాజాగా విడుదలైన 'ఇండియా స్కిల్స్ నివేదిక 2025' చెబుతోంది. దాని ప్రకారం 54.8 శాతం మంది పట్టభద్రులు ఉద్యోగార్హులు. చూడటానికి ఇది ఎక్కువేం కాదన్న అభిప్రాయం కలగొచ్చు. కానీ పదేళ్ల క్రితంతో పోలిస్తే ఇది 20 పాయింట్లు అధికం. గతేడాదితో పోల్చినా మూడు పాయింట్లు అధికం. విద్యారంగానికీ, పారిశ్రామిక రంగానికీ అనుసంధానం పెరగటం వల్ల ఇదంతా సాధ్యమైందని ఆ నివేదిక అంటున్నది. ముఖ్యంగాఇంటర్న్‌షిప్‌లు విద్యార్థులకు ఆచరణాత్మక అనుభవాలనిచ్చి వారిని ఉద్యోగాలకుసంసిద్ధం చేస్తున్నాయని చెబుతోంది. కానీ ప్రభుత్వాలు విద్యకు ఇవ్వాల్సినంత ప్రాముఖ్యత ఇస్తున్నాయా? ఫీజు రీయింబర్స్‌మెంటువంటి పథకాలను పకడ్బందీగా అమలు చేసి పేద పిల్లలకు సాంకేతిక విద్య అందుబాటులోకి తెస్తున్నాయా? మన సాంకేతిక విద్యారంగం ప్రపంచ శ్రేణితో పోటీ పడాలంటే మరింత వేగంగా కదలాల్సి ఉంటుంది. అందులో అన్ని వర్గాల భాగస్వామ్యం పెంచాల్సి ఉంది. ఈమధ్యే విడుదలైన నాల్‌స్కేప్ సంస్థ నివేదిక 2028 నాటికి తయారీ రంగ పరిశ్రమలో సాంకేతిక నైపుణ్య లేమి వల్ల ప్రపంచ వ్యాప్తంగా 24 లక్షల ఉద్యోగాలు ఖాళీగా మిగిలిపోతాయని తెలిపింది. దీన్ని సరిదిద్దకపోతే 2030 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక నష్టం తప్పదని హెచ్చరించింది. తయారీ రంగంలో అత్యధిక పరిశ్రమలు ఉద్యోగార్థుల చదువుతోపాటు వారికున్న భిన్న రకాల నైపుణ్యాలేమిటని చూస్తున్నాయి. ముఖ్యంగా ఏఐ ఆధారిత సామర్థ్యాలు, సీఎన్‌సీ ఆపరేషన్స్, ఆటోమేషన్ సిస్టమ్స్ ఇంటెగ్రేషన్, డేటా ఎనలిటిక్స్, డిజిటల్ ట్విన్ టెక్నాలజీస్, హ్యూమన్%-%మెషీన్ ఇంటర్‌ఫేస్ డిజైన్ వగైరాలకు అపారమైన డిమాండ్ ఏర్పడబోతోంది. సాఫ్ట్‌వేర్ రంగంలో క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, రోబోటిక్స్ వగైరాలు అవసరమవుతాయి. సిబ్బందికుండే నైపుణ్యాలే విజయానికి బాటలు వేస్తాయి గనుక ఎంపికలో వాటినే ప్రధానంగా చూస్తామని 94 శాతం సంస్థలంటున్నాయి. అవసరాలకు అనుగుణంగా తగిన నైపుణ్యాలను పెంపొందించుకునే వారికే, ప్రపంచ స్థాయిలో పోటీపడగల వారికే ఏ పరిశ్రమల్లోనైనా ఉద్యోగాలు భద్రంగా ఉంటాయన్నది ఆ నివేదిక సారాంశం. కానీ మన సాంకేతిక విద్య ఈ స్థాయికి చేరుకుందా... విద్యాసంస్థలు ఇందుకనుగుణమైన సాంకేతికతను విద్యార్థులకు సమర్థంగా అందించగలుగుతున్నాయా అనే సందేహాలున్నాయి. మన దేశానికుండే ప్రత్యేకతేమంటే ప్రస్తుతం ఇక్కడ పనిచేయగలిగిన సత్తా గల (15%-%64 యేళ్ల మధ్య) జనాభా 99 కోట్ల 47 లక్షలకు చేరుకుంది. ఇది చైనాకన్నాఅధికం. 2030 వరకూ ఏడాదికి కోటి మందికి పైగా దీనికి జమ అవుతారు. భిన్నరంగాల్లో మెరుపు వేగంతో దూసుకొస్తున్న ఏఐకి సంబంధించిన బహుముఖ నైపుణ్యాలను ఒడిసిపట్టుకోవటంలో వెనకబడితే వీరందరికీ మెరుగైన ఉద్యోగాల కల్పన అసాధ్యమవుతుంది. ఐటీ, ఆరోగ్య రంగం, హరిత ఇంధన రంగం వగైరాల ద్వారా2030 నాటికి ప్రపంచ ఆర్థిక రంగానికి 50,000 కోట్ల డాలర్ల అదనపు సంపద జమవుతుందని అంచనా. ఈ సంపదలో మన వాటా చెప్పుకోదగ్గ స్థాయిలో ఉండాలంటే మెరికల్లాంటి నిపుణుల సైన్యం తయారు కావాలి. సాంకేతిక కళాశాలల తీరుతెన్నుల్నిసంపూర్ణంగా మార్చాలి. నిరుపేద గ్రామీణ విద్యార్థులకు అందుబాటులోకి తేవాలి. ఊకదంపుడు ఉపన్యాసాలు కాదు, ప్రభుత్వాలు ఫీజురీయింబర్స్‌మెంట్ వంటివిసక్రమంగా అమలు చేయాలి. అప్పుడే అన్ని వర్గాల పిల్లలూ ఈ అభివృద్ధిలో భాగస్వాములవుతారు.

## విదేశాల్లో హిందూ, ముస్లింల ఐక్యత

# పాలకులకు ఒక పాఠం!

అమెరికా, యూరప్, ఆస్ట్రేలియాలలో సాగే జాత్యహంకార శక్తుల ఆందోళనలు మన దేశ హిందువులకు ఓ గుణపాఠం. విదేశాల్లో వలస జీవుల పట్ల నిరసన ఆందోళనల పరిణామాల నేపథ్యంలో న్యూయార్క్‌లో హిందూ ముస్లిం ఐక్యత న్యూఢిల్లీకి ఆదర్శం. లండన్‌లో భుజం కలిపిన హిందూ, ముస్లిం, సిక్కు ఐక్యత భారత్‌కి ఆదర్శం. ఈ ఐక్యత మన పాలకులకు సరికొత్త గుణపాఠం కావాలి.. ఈ అంశం ఆధారం చేసుకొని మత సమైక్యతకై ప్రత్యేకంగా కృషి చేద్దాం. కొందరు లోతైన అవగాహనతో శాస్త్రీయ విశ్లేషణలు చేస్తున్నారు. వారు చాలా అభినందనీయ కృషిని సాగిస్తున్నారు. ఈ దేశ మట్టిలో పుట్టి, ఈ మట్టిలో పెరిగి, మట్టిలో కలిసిపోయే మనుషులు కొన్ని శతాబ్దాల క్రితం ముస్లిం మతంలో చేరి అనుసరిస్తున్నారు. అనేక శతాబ్దాల తర్వాత ఆధునిక యుగంలో ముస్లింలపై కక్ష గట్టి 'గో టూ పాకిస్తాన్ లేదా కబరిస్తాన్' అనే దుస్థితిని హిందుత్వ సంస్థలు కల్పిస్తున్నాయి. అది ప్రైవేటు మతతత్వ సంస్థల పని అనుకుంటే రిపబ్లిక్ రాజ్యాంగాన్ని పరిరక్షణ చేసే బాధ్యత గల మోడీ ప్రభుత్వం కూడా చేసేది అంత కంటే భిన్నంగా ఏమి లేదు. ముస్లిం మతం పట్ల పక్షపాతంతో ఎన్ఆర్‌సి చట్టం తేవడం ఓ నిదర్శనం. ముస్లింల పట్ల ప్రత్యేకంగా మోడీ సర్కార్ వెలివేత వైఖరి చేపట్టింది. గో బ్యాక్ ఆసియన్స్, గో బ్యాక్ ఆఫ్రికన్స్, గో బ్యాక్ లాటిన్ అమెరికన్స్ ఇవీ స్థానికుల నినాదాలు.. అమెరికా నుంచి బ్రిటన్ వరకు ఎవరూ ఫలానా ముస్లిం మతస్తులు, ఫలానా హిందూ మతస్తులు, ఫలానా సిక్కు లేదా బౌద్ధ మతస్తులు 'గో బ్యాక్' అనడం లేదు. అదే సమయంలో అమెరికా, బ్రిటన్‌లలో మరో కొత్త పరిణామం కూడా జరుగుతోంది. వలస జీవులు కూడా క్రమంగా ఏకమై 'మీ దేశ ఆర్థిక వ్యవస్థల వృద్ధిలో మా శ్రమశక్తి పాత్ర కూడా వుంది, మమ్మల్ని ఎలా గో బ్యాక్ అంటారని ప్రశ్నిస్తూ రోడ్డెక్కుతున్నారు'. చాలా విచిత్ర విషయం ఏమంటే, లండన్ కౌంటర్ ర్యాలీలో హిందువులు, ముస్లింలు, సిక్కులు, బౌద్ధులు భుజం కలిపి ప్లకార్డులు ధరించి పాల్గొనడం! అక్కడ మత సామరస్యం, సమైక్యత వెల్లివిరియడం విశేషాల్లో కెల్లా విశేషం! ఉదాహరణకు యూకేలో ఇరవై లక్షల మంది ఇండియన్ ఇమ్మిగ్రెంట్స్, పదిహేను లక్షల మంది పాకి స్తాన్ ఇమ్మి గ్రెంట్స్ భుజం కలిపి తమ భద్రత కోసం ఐక్యం అవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.



మరో చేదు నిజం కూడా చెప్పాల్సిన సందర్భమిది. పొట్టచేత పట్టుకొని వెళ్లిన శ్రమజీవులకు ఏ విదేశంలోనైనా కష్టాలు తప్పవు. గల్ఫ్ దేశాలు కూడా అతీతం కాదు. కా నీ యూఎస్, కెనడా, యూకే, ఐర్లాండ్, ఆస్ట్రేలియా వంటి చోట్ల నేటివ్స్‌ని రెచ్చగొట్టి 'వలస జీవులు గో బ్యాక్' ప్రదర్శనలను చేపట్టే జాత్యహంకార సంస్థలు గల్ఫ్ దేశాల్లో లేకపోవడం గమనార్హం! అవన్నీ ముస్లిం దేశాలే! ఆ గల్ఫ్ వెళ్లిన భారతదేశ హిందువులకు స్థానిక ముస్లిం సంస్థల నుండి ఇలాంటి దుస్థితి ఎదురు కాలేదు. మన దేశ హిందువులకు తాజా పరిణామాలు నేర్పే పాఠం ఒకటే! అదే మత సామరస్య త, సమైక్యత అవసరం అనేది. మత భావోద్వేగాలు ఆయా మతావలంబీకుల మనస్సులను ఆవహించిన నిర్దిష్ట సమయాల్లో మత సామర స్యం, సమైక్యతల గూర్చి నూరు బోధనలు చేసినా, వేల ప్ర సంగాలు చేసినా మెదళ్లకు ఎక్కవు. కానీ తమ జీవనాధారాన్ని మత, ప్రాంత, జాతిపర విద్వేషాలు దెబ్బతీసే నిర్దిష్ట సమయాలలో అర్థం చేసుకుంటారు. కీడులో మేలులా నేడు అట్టి సువర్ణావకాశాన్ని చరిత్ర అందించింది. ఈ క్యాచింగ్ పాయింట్‌ని ఆధారం చేసుకొని మన దేశ హిందూమత సోదరీ, సోదరుల మనస్సుల్లో ఓపికగా మత సమైక్యత స్ఫూర్తి నింపి మేల్కొలిపే అవకాశం లభించింది. ఇది లౌకిక, వామపక్ష, విప్లవ, ప్రజాతంత్ర సంస్థలు, శక్తుల బాధ్యత! అవి తమ బాధ్యత నిర్వహిస్తాయని ఆశిద్దాం. అమెరికా, గ్రేట్ బ్రిటన్, ఆస్ట్రేలియా, ఐర్లాండ్ వంటి అతి పెద్ద, చిన్న దేశాల్లోనూ భారతీయులపై దాడి చేసి హత్య చేయడం, కత్తులతో నరకడం, ఆన్ లైన్ రేసిజంలో కూడా భారతీయులను టార్గెట్ చేయడం వంటి ఘటనలు వరుసగా జరుగుతుండాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఈ ఘటనలు కేవలం వ్యక్తిగత దాడులు కాదు, విస్తృతమైన రేసిజం, ఆర్థిక ఒత్తిడి, రాజకీయ వాతావరణం వల్ల జరుగుతున్నాయి. పాశ్చాత్య దేశాల్లో భారతీయులు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో, స్థానికుల్లో 'జాబ్స్ దొంగలు' అనే భావన పెరిగింది. పాశ్చాత్య దేశాల్లో ఉద్యోగాలు తగ్గుతున్నాయి, ఇన్‌ఫ్లేషన్ పెరిగింది. భారతీయులు ఐటీ, హెల్త్‌కేర్ రంగాల్లో డామినేట్ చేస్తున్నారు కాబట్టి, అక్కడి స్థానికులు మనల్ని అలా భావిస్తున్నారు. ఈ శత్రుత్వం ప్రభావాలు భయంకరం. భారతీయ విద్యార్థులు, వర్కర్లు భయపడుతున్నారు. 2025లో అమెరి కా, కెనడాలో మనపై దాడులు గత 4 ఏండ్లతో పోలిస్తే ఎక్కువగా నమోదయ్యాయి. యూరప్‌లో ఫార్-రైట్ పార్టీలు శక్తివంతమవుతున్నాయి. ఇవి బలపడే కొద్దీ స్థానికులకు, వలస వచ్చిన వారికి మధ్య ఘర్షణ మరింతగా పెరిగే ప్రభావం ఉంది. వలసపోయిన వారిలో ఐక్యతా బంధాలు పెరగడం ఉమ్మడిగా నిరసనలకు చేపట్టడమే ఈ సమస్యకు పరిష్కారమవుతుంది.



## కలెక్టరేట్లో యధావిధిగా స్పందన అర్జీ పరిష్కార వేదిక

**కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్**



**అమలాపురం, జిల్లా ప్రతినిధి విశ్వం వాయిస్ న్యూస్ సెప్టెంబర్ 21:** ఈనెల 22 వ తేదీ సోమవా రం స్థానిక కలెక్టరేట్ లో ఉద యం 10 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిం చడం జరుగుతుందని అర్జీ దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల ని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాక పోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నెంబర్ కు కాల్ చేయ వచ్చునన్నారు. అర్జీదారు లు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి "మీకోసం డాట్ ఏపీ డాట్ జివోవి డాట్ ఇన్" వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవ చ్చున్నా రు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కా రం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈనెల 22వ తేదీన సోమవారం స్థానిక కలెక్టరేట్ లోనీ గోదావరి భవన్ నందు ప్రజా సమ స్యల పరిష్కార వేదిక ( పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుం దని తెలిపారు. ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించ డం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొం టారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీదారులు తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబం ధించి అర్జీలను వ్రాత పూర్వ కంగా అందజేయాలన్నారు సమస్య పరిష్కారమైన ప్పుడు అర్జీ దారుని ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీ దారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు.నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సాప్ లో పంపడం జరుగుతుందన్నారు.మం డల, డివిజన్, పురపాలక సంఘ స్థాయిల లో పి జి ఆర్ ఎస్ కార్యక్రమాలు ఆ యొక్క స్థాయి సమస్యలపై యధావిధిగా కొనసాగుతా యన్నారు.అర్జీదారులు కేవలం జిల్లాస్థాయి లో సమస్యల పరిష్కారం కొరకు మాత్రమే కలెక్టరేట్ నందు పిజిఆర్ఎస్ కార్య క్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు

## సేంట్ అన్స్ స్కూల్ నుండి కెఎన్ పురం రహదారి కి మోక్షం....

**అమరావతి సచివాలయానికి గుండాల గ్రామ సమస్యలు తీసుకెళ్లిన సిపిఎం పార్టీ గ్రామ సెక్రటరీ...**

**చింతూరు పి ఓ గారికి ధన్యవాదములు తెలిపిన గుండాల గ్రామస్తులు....**



**చింతూరు డివిజన్ విశ్వం వాయిస్ న్యూస్:** సేంట్ అన్స్ స్కూల్ నుండి గుండాల కాలనీ, కే ఎన్ పురం రహదారులు అధ్వానంగా ఉండటం తో ప్రయాణికులు ప్రయాణం చేయాలంటే భయపడుతూ ప్రయాణం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గుండాల సీ పి యం పార్టీ గ్రామశాఖ సెక్రటరీ తోట శ్రీనివాస్ అమరావతి సచివాలయానికి రిజిస్టర్ పోస్ట్ ద్వారా గుండాల గ్రామ సమస్యలు తీసుకెళ్లడంతో సంబంధిత అధికారులు పాడేరు కలెక్టర్ ఆఫీస్ కు పంపించారు. అక్కడినుండి చింతూరు పి ఓ ఆఫీస్ కు రావడంతో పి ఓ సంబంధిత అధికారులు ను ఆదేశించడం తో సేంట్ అన్స్ నుండి కె ఎన్ పురం వరకు రహదారుల కొలతలను అధికారులు తీసుకున్నారు.ఈ సందర్భంగా గుండాల పంచాయతీ గ్రామస్తులు పలువురు అధికారులు కు కృతజ్ఞతలు తెలిపారు..ఈ కార్యక్రమం లో ప్రముఖ న్యాయవాది అవులూరి సత్యనారాయణ, పిల్లెం. రాజా, కాగిత. ధర్మయ్య, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎస్పిబి కృష్ణారావుకి ఆత్మీయ వీడ్కోలు పలికిన జిల్లా పోలీస్ సిబ్బంది



**అమలాపురం, జిల్లా ప్రతినిధి, విశ్వం వాయిస్ న్యూస్ సెప్టెంబర్ 21** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుండి పల్నాడు జిల్లాకు బదిలీ అయిన ఎస్పీ బి.కృష్ణారావు, కు అమలాపురం పట్టణంలోని ఎ 1ఫంక్షన్ హాలులో సెప్టెంబర్ 21న సిబ్బంది ఘనంగా 'ఆత్మీయ వీడ్కోలు పలికారు. జిల్లాలో పని చేసిన కాలంలో ప్రజలు, అధికారులు, సిబ్బంది అందించిన సహకారాన్ని మరువలేమన్న ఎస్పీ తన జీవితంలో జిల్లాలో పని చేసిన కాలం తమకు ఒక మధుర స్మృతిగా నిలుస్తుందన్న ఎస్పీ బి.కృష్ణారావు, ఈ సందర్భంగా ఎస్పీ బి.కృష్ణారావు, మాట్లాడుతూ - తన సర్వీసులో జిల్లాలో పని చేయడం ఒక మధుర స్మృతిగా నిలుస్తుందన్నారు. జిల్లాలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది, ప్రజలు అందించిన సహకారంతో జిల్లాను శాంతి పదంలో నిలిపామన్నారు. జిల్లా ప్రజలు చాలా సౌమ్యులని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుశాఖ చేపట్టిన చర్యలకు ప్రజలు తమవంతు సహకారాన్ని అందించారన్నారు. ప్రజలు, పోలీసు అధికారులు, సిబ్బంది సమిష్టిగా, సమన్వయంతో పని చేయడం వలనే జిల్లాలో నేర నియంత్రణలోను, చేధనలోను మంచి ఫలితాలు సాధించామన్నారు. జిల్లాలో ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా అధికారులు, సిబ్బంది చాలా సమర్ధవంతంగా, అంకిత భావంతో పనిచేసారన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగానికి అవసరమైన సదుపాయాలూ సమకూర్చడంలో అందరూ తగిన సహకారాన్ని అందించారన్నారు. మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేయదలిచినట్లు, తాను జిల్లాలో మరో సంవత్సరం పని చేస్తానని భావించానని, కాని ఆకస్మిక బదిలీ జరిగిందన్నారు. తాను జిల్లాలో పని చేసిన కాలంలో సహకరించిన అధికారులు, సిబ్బందికి ఎస్పీ బి.కృష్ణారావు, పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన నూతన ఎస్పి రాహుల్ మీనా మాట్లాడుతూ జిల్లా శాంతి భద్రతల విషయంలో, పోలీసు యంత్రాంగానికి అవసరమైన అభివృద్ధి పనులలోను ఎస్పీ బి.కృష్ణారావు,మంచి బాటను వేసారు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నూతన ఎస్పి రాహుల్ మీనా , అదనపు ఎస్పీ ఏ.వి.ఆర్.పి.బి. ప్రసాద్ , ఏ.ఒ , డిఎస్పీ లు, ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, ఇతర అధికారులు మరియు సిబ్బంది హాజరైనారు.

## ఆదివాసి జేఏసీ చింతూరు డివిజన్ కమిటీ ఏర్పాటు డివిజన్ చైర్మన్ గా జల్లి నరేష్ ఏకగ్రీవ ఎన్నిక





**చింతూరు డివిజన్ విశ్వం వాయిస్ న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్ చింతూరులో ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసీ చింతూరు డివిజన్ కమిటీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది . ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసీ సెంట్రల్ కమిటీ సభ్యులు మడివి నెహ్రూ, జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్, హాజరై చింతూరు డివిజన్ నూతన కమిటీని ప్రకటించడం జరిగింది.ఈ ఎన్నికలో ఆదివాసీ జేఏసీ చింతూరు డివిజన్ చైర్మన్ జల్లి నరేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.వైస్ చైర్మన్స్ గా ఉయిక.రాంప్రసాద్,కారం. సాయిబాబు,శీలం. తమ్మయ్య,వెటకాని.మల్లయ్య,సున్నం.శేఖర్,కుంజా శ్రీను,పాగా.బాబురావు,ప్రచార కార్యదర్శిలుగా సోడే.శ్రీను,పాయం చంద్రయ్య కమిటీ సభ్యులుగా మడివి.రాజు,సోయం. కన్నారావు,పొడియం. లక్ష్మణ్,మాదాల.లోవరోజు బొక్కిలి.ప్రసాద్ లకు పాత కమిటీ వాళ్లతో పాటు చోటు దక్కింది.లీగల్ అడ్వైజర్ గా ఆత్రం.నవీన్, సమావేశానంతరం భవిష్యత్ కార్యాచరణగా ఏజెన్సీ ఉద్యోగ నియమకల చట్టం ప్రకటించేదాకా పోరాటం సాగుతుందని, జేఏసీ ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన కమిటీలు ఏర్పాటు చేసి డిసెంబర్ నెలలో జరిగే భారీ సభకు అన్ని రకాల ప్రణాళికలు సిద్ధం చేయాలని, ప్రతి పంచాయతీలో ఉన్న పెస కమిటీలతో ఐటీడీఏ ల ద్వారా శిక్షణ తరగతులు ఇచ్చి ప్రతి సమస్యపై ఆ కమిటీల ద్వారా తీర్మానాలు చేసే విధంగా ఈ కమిటీ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ నూతన కమిటీకి జిల్లా రాష్ట్ర మరియు ఉద్యోగ సంఘాల వారు అభినందనలు తెలియజేసే భవిష్యత్తు పోరాటానికి సన్నద్ధం కావాలని ఆకాంక్షించారు.ఈ సమావేశానికి ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి.జోగారావు ఉద్యోగులు సంఘాల నాయకులు తిమ్మ సాయి,తొడం దేశయ్య, కాక రాజు,నాలుగు మండలాల సభ్యులు ప్రతినిధులు మండల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాపునాడు ప్రాంతీయ సదస్సు...



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** రాజమండ్రిలో కాపునాడు ఉభయగోదావరి జిల్లాల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం కోసం డిసెంబర్ నెలలో విజయవాడలో రాష్ట్రవ్యాప్త సదస్సు నిర్వహిస్తామని తెలియజేశారు. కార్యాచరణ ఏర్పాటు చేసుకుని క్రమశిక్షణతో ముందుకు వెళదామని తెలియజేశారు. కాపునాడు జాతి అధ్యక్షుడు గాళ్ళ సుబ్రహ్మణ్యం, శాసనమండలి సభ్యులు సోము వీర్రాజు, రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, రాజమండ్రి టిడిపి అధ్యక్షులు మజ్జి రాంబాబు, పంతం కొండలరావు, బొమ్మల దత్తు, అడబాల రామకృష్ణ, కాపునాడు రాష్ట్ర నాయకులు, ఏలూరు, నరసాపురం, అమలాపురం, కాకినాడ, రాజమండ్రి పార్లమెంట్ నాయకులు, మహిళా నాయకులు, రాష్ట వర్కింగ్ ప్రెసిడెంట్ కోటిపల్లి వెంకట రామారావు పాల్గొన్నారు. గుదే రఘు నరేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున గోదావరి జిల్లాల కాపునాడు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ముమ్మిడి వీరబాబు, రుద్ర ప్రసాద్, దేశినీడి రాంబాబు రాంబాబు,కాళ్ళ చక్కరావు తదితరులు సభను పర్యవేక్షించారు.

## విద్యుత్ సర్క్యూట్ తో కొబ్బరి చెట్లు దగ్ధం....

**ఓ ఎన్ జి సి సహకారం తో మంటలు ఆర్పిన ఫైర్ సిబ్బంది.**





**అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్.** అల్లవరం మండలం ఓడలరేవు గ్రామం లో ఆదివారం సాయంత్రం చొల్లంగి రాధాకృష్ణ ఇంటి ప్రక్కనే విద్యుత్ సర్క్యూట్ తో కొబ్బరి చెట్లు దగ్ధం అవడం తో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఓడలరేవు ఓ ఎన్ జి సీ అగ్నిమాపక సిబ్బంది కి స్థానికులు సమాచారం ఇవ్వడం తో ఓ ఎన్ జి సి అధికారి సుమంత్ ఆద్వర్యంలో ఫైర్ సిబ్బంది హుటా హుటిన సంఘటనా స్థలానికి అగ్నిమాపక ఫైర్ ఇంజన్ వెహికల్ తో వచి మంటలు అదుపు చేశారు. ఫైర్ అధికారి వై సుమంత్, సిబ్బంది,స్థానిక ఎలక్ట్రికల్ లైన్ మెన్ శ్రీను ,సచివాలయం ఎలెక్ట్రిషన్ ప్రసాద్ పాల్గొన్నారు.

## 25న గుంటూరులో యుటిఎఫ్ రణభేరి సభ



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** సెప్టెంబర్ 25వ తేది ఉదయం 10 గంటలకు గుంటూరు లోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం ఆవరణలో ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలు, విద్యారంగ సమస్యలు పరిష్కారం కోరుతూ రాష్ట్ర స్థాయి బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు యు టి ఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి సురేంద్రకుమార్, ఎమ్ టి వి ఎ ఎస్ సుబ్బారావు తెలియజేశారు. ఆదివారం అమలాపురం యుటిఎఫ్ ఆఫీసులో జిల్లా ఆఫీసు బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా రణభేరి జాతా నిర్వహించడం జరిగిందని అన్నారు. అన్నీ జిల్లాలలో జాతాకు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున సంఘీభావం తెలియజేశారని అన్నారు. ఈ రణభేరి ముగింపు సభ 25న జరుగుతుందని అన్ని మండలాల నుండి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని అన్నారు. కార్యక్రమము లో రాష్ట్ర కార్యదర్శి ఎస్ జ్యోతి బసు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రభుత్వ అకాడమిక్ విధానాలపై తీవ్రమైన వ్యతిరేకతతో ఉన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలైనా డి ఎ గానీ, ఐ ఆర్ గానీ ఇవ్వకపోవడంపై ఉద్యోగులు ఉపాధ్యాయులు అసంతృప్తితో ఉన్నారని అన్నారు. 25వ తేదీన జరిగే రణభేరి సభలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


## జగన్ చుట్టూ చక్రబంధం

**విజయవాడ :** వైసీపీ చీఫ్ వైఎస్ జగన్ చుట్టూ చక్రబంధం బిగుసుకుంటుందా? అంటే అవుననే అంటున్నారు. అనేక విషయాలు జగన్ కు రానున్న కాలంలో కష్టాలు తప్పేట్లు లేదని సంకేతాలు కనిపిస్తున్నాయి. జగన్ పై కేంద్ర ప్రభుత్వం వైఖరి మారినట్లు కనపడుతుందంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి కొంత కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు వేగంగా అడుగులు వేయడం చూస్తుంటే జగన్ కు కష్టాలు చుట్టుముడుతున్నట్లే కనిపిస్తుంది. ఎందుకంటే గత వారం రోజుల నుంచి జరుగుతున్న ఘటనలు ఇందుకు కారణమని వైసీపీలోని చాలా మంది నేతలు భావిస్తున్నారు. జగన్ చుట్టూ చక్రబంధం వేస్తున్నట్లే కనిపిస్తుంని పార్టీకి చెందిన సీనియర్ నేత ఒకరు చేసిన వ్యాఖ్యలను బట్టి అర్థమవుతుంది. చంద్రబాబు నాయుడు పక్కా పొలిటికల్ లీడర్. తాను జగన్ పై ఏదో కేసులు పెట్టి జైలుకు పంపితే అది సానుభూతిగా మారి జగన్ కు వరంగా మారుతుంది.

# 9 న ఆంధ్రా శబరిమలలో మహా కుంభాభిషేకం

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం పెదమల్లాపురం పంచాయతీ శివారు సిద్దివారి పాలెం గ్రామంలోని సర్వే నెంబరు 18 భూమిలో 18 మెట్లపై వెలసి ఆంధ్రా శబరిమల శ్రీ అయ్యప్పస్వామిగా ప్రసిద్ధి చెందిన ఆలయం ప్రాంగణంలో 9 వ తేది నుంచి తొలి ఏకాదశి వేడుకలను నిర్వహిస్తున్నట్టు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కుసుమంచి సత్య శ్రీనివాసరావు గురుస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నవరం నుంచి 18 కి.మీ., శంఖవరం నుండి 9 కి.మీ. దూరంలో ఉన్న ఈ ఆలయంలో అక్టోబరు 9,10,11 తేదీల్లో 1,008 కలశాలతో మహాకుంభాభిషేకాన్ని, 11 తేదీన మహా శక్తివంతమైన కలశ మహాకుంభాభిషేకాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. అలాగే 28 న సహస్ర బిల్వార్చన, 29 న లక్షబిల్వార్చన నిర్వహిస్తామని, 30 న అత్యంత అద్భుతమైన మహా కోటి బిల్వార్చన ప్రారంభించి, నవంబరు 18 వరకూ ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిత్యం కొనసాగిస్తూ ఉంటామని, ఈ 18 రోజులు నిత్యం మహాకోటి బిల్లార్చన 18 రోజులూ మెట్ల పూజ (పడి వెలుగించుట) నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. అయ్యప్ప దర్శనార్థం వచ్చిన భక్తులు, అయ్యప్ప దీక్షా స్వాములు స్వయంగా పూజలో పాల్గోనే అవకాశాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్నం అన్న ప్రసాద సదుపాయం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ చక్కని శుభ సదవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకుని స్వామి కృపా, కటాక్షాలను పొందాలని, మరిన్ని వివరాలకు 9550258507 వాట్సాప్ నెంబర్లో సంప్రదించాలని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కుసుమంచి శ్రీసత్య శ్రీనివాసరావు గురుస్వామి ఆదివారం ఈ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.





# వెతలు తీరేనా...? వాతలే మిగిలేనా?




**నరక ప్రాయంగా మారిన రహదారిలో ప్రయాణం**

**ప్రతిపక్షంలో ఉండగా వినూత్న నిరసన, అధికారం మారినా తీరని రహదారి కష్టాలు**

**ఎక్కడ వేసిన గోంగలి అక్కడే అన్న చందాన పనితీరు**

**కల్వర్టులు,రోడ్డు బెర్మలను ఎప్పుడు పూర్తి చేస్తారని ప్రజల ఎదురు చూపులు**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్..**


కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రహదారులకు మహర్దశ పడుతుందని సంబరపడుతూ, దశాబ్ద కాలంగా ఎదురుచూసి, మండపేట, ద్వారపూడి రహదారి పూర్తయి పోతుంది అని సంబర పడిన ప్రజలకు ఆఖరికి ఎదురుచూపులే మిగిలాయి. గత ప్రభుత్వం రహదారులను పట్టించుకోకుండా మొండి వైఖరి అవలంభించిన సమయంలో ఎంతో మంది పలు రకాలుగా నిరసనలు తెలిపి, ప్రభుత్వం పై ఒత్తిడి తేగా పుణ్యకాలం సమీపించి రహదారి పనులను చేపట్టారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యమో.? అధికారుల వైఫల్యమో.? ఆ రహదారి పని విషయంలో తీవ్ర జాప్యం ఏర్పడి పని పూర్తి కాలేదు. ఇదిలా ఉండగా అసెంబ్లీ ఎన్నికలు రావడంతో రాష్ట్రంలో అధికారం మారగా, రహదారి పనులు ఎక్కడివి అక్కడే ఆగిపోయయి. ఏడాది గడిచినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా రహదారి పరిస్థితి మారింది. మండపేట పట్టణ శివారులో ఉన్న మెహర్ బాబా ప్రైవేట్ స్కూల్ దాటిన వెంటనే రహదారి వెతలు ప్రారంభం అవుతున్నాయని ఆ మార్గం గుండా ద్వారపూడి వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్ళవలసిన పరిస్థితి దాపురించిందని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. ఒకప్పుడు ప్రతిపక్ష నాయకులుగా ఉండి వినూత్న పద్దతిలో నిరసనలు తెలపుతూ ప్రజలు కష్టాలపై మాట్లాడి,ఆగ మేఘాల మీద రోడ్డు నిర్మాణం చేపట్టడానికి పోరాటం చేసిన స్థానిక శాసన సభ్యులు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రహదారి విషయాన్ని మర్చిపోయారని పలువురు చర్చించుకుంటున్నారు.

రహదారి నిర్మాణం చేపట్టిన వారు అర్ధం ఆకలి కడుపునింపినట్లు, రహదారిని వేసే ప్రక్రియ లో రోడ్డు పక్కన గ్రావెల్ బెర్మలతో సమాంతరం చేయకుండా విడిచి పెట్టడమే కాక, కల్వర్టులు పూర్తి చేయకుండానే రహదారిని గాలికి వదిలేయగా, రోడ్డుపై ఎదురెదురుగా వాహనాలు వస్తుంటే తప్పించే క్రమంలో రోడ్డు పక్కన గ్రావెల్ బెర్మలు లేని భాగంలో పడుతూ పెద్ద శబ్దంతో వాహనాల చక్రాలు విరగడం నిత్యం పరిపాటిగా మారిందని, ఆ శబ్ధాలకు,భయానక సన్నివేశాలకు తీవ్ర భయాందోళనకు గురవుతున్నామని ప్రయాణికులు , స్థానికులు సైతం బెంబేలెత్తి పోతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోరాడి, అధికారం వచ్చాక నోరు మెదపని శాసన సభ్యుల వైఖరిపై స్థానికులు పెదవి విరవడం చూస్తుంటే, రహదారి కోసం ఆశ పడిన వాహనదారులకు గుంతలు వలన ప్రమాదాలు జరిగి తమ శరీరాలపై గాయాల వాతలే మిగిలాయని మాట్లాడుకుంటున్నారు. ఇక ఆ రహదారి పై ద్విచక్ర వాహనదారులు, పాదచారుల పరిస్థితి మరింత అధ్వాన్నం వారు ఇంటి నుండి బయలుదేరిన రూపం, వస్త్రాలు రంగు ఒకటైతే భారీ వాహనాల వేగం పుణ్యమా అని గమ్యం చేరే సరికి వారిని గుర్తు పట్టడమే కష్టం అయ్యేలా దుమ్ము, ధూళి తో నిండిపోవడమే కాక, ప్రమాదకరమైనా తప్పని పరిస్థితుల్లో మార్గంలో పయనిస్తున్నారు. ఎటుచూసినా ప్రమాదంతో నిండిన ఇటువంటి పరిస్థితుల నుండి విముక్తి కల్పించి త్వరితగతిన కల్వర్టులు, గ్రావెల్ బెర్మలను అధికారులు, పాలకులు ఏర్పాటు చేసే పనులు చేపట్టాలని ముక్త కంఠంతో కోరుతున్నారు.



అనునిత్యం పలు అవసరాలకు ఇదే రహదారి లో ప్రయాణం చేస్తున్నాం. ఎదురుగా కాని వెనుకనుండి కాని భారీ వాహనాల శబ్దం వినబడుతుంటే ఎటు తప్పుకోవాలో తోచక కొన్నిసార్లు చాలా మంది అదుపుతప్పి పడిపోతున్నారు. రహదారి పని పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటే పరిస్థితి చక్క పడుతుంది.

ప్రసాద్, ప్రయాణికుడు, మండపేట



నిత్యం పలు వాణిజ్య, వ్యాపార, విద్య,ఉద్యోగం వంటి అవసరాలకు రాజమహేంద్రవరం చేరాలంటే ఈ మార్గమే ప్రధానం అయినప్పటికీ రహదారి పనులు పూర్తి కాకపోవడంతో ఆ దారి లో వెళ్ళాలంటే భయంతో పాటు తీవ్ర అసౌకర్యం ఏర్పడుతుంది. దుస్తుల పై దుమ్ము, ధూళి చేరడం తో ప్రయాణం ముందుకు సాగించాలా? దుస్తులు స్థితి చూసి బాధ పడాలా ? అన్నట్టు ఉంటుంది దయచేసి అధికారులు త్వరితగతిన పరిష్కారం చూపాలని కోరుతున్నాము.

రఘు, ప్రయాణికుడు, మండపేట



# ఆంధ్ర వర్సెస్ కర్ణాటక... కంపెనీల వార్...

**విజయవాడ :** ఏపీకి పెట్టుబడులు తెచ్చే పనిలో ఉన్నారు మంత్రి నారా లోకేష్. రెండు రోజుల కిందట ఆయన లండన్ పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బెంగళూరులోని ఓ కంపెనీ సీఈఓ రోడ్ల సమస్యపై చేసిన ట్వీట్ పెద్ద చర్చకు దారితీసింది. ఆ సీఈవో ట్వీట్ పై స్పందించారు మంత్రి నారా లోకేష్. విశాఖకు రమ్మని ఆహ్వానించారు. అయితే దీనిపై తాజాగా స్పందించారు కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్. బ్లాక్మెయిల్ అంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలకు లోకేష్ సైతం కౌంటర్ ఇచ్చారు. తాము ప్రజల సమస్యలను పట్టించుకుంటామంటూ ఘాటుగానే రియాక్ట్ అయ్యారు నారా లోకేష్. ప్రస్తుతం ఇదో వైరల్ అంశంగా మారింది. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండగా.. ఏపీలో కూటమి అధికారంలో ఉంది. పరస్పర రాజకీయ విరుద్ధ ప్రభుత్వాలు అయినా మంచి వాతావరణం నడుస్తూ వచ్చింది. అటువంటిది కర్ణాటక డిప్యూటీ సీఎం వర్సెస్ ఏపీ మంత్రి అన్నట్టు వ్యవహారం మారింది.బెంగళూరులోనిబ్లాక్ బక్ అనే కంపెనీ సీఈవోగా రాజేష్ యా బాజీ ఉన్నారు. ఆయన చేసిన ట్వీట్ ఇప్పుడు దొమ్మారం రేపుతోంది. ఆయన ఇచ్చిన ట్వీట్ పై స్పందించారు మంత్రి నారా లోకేష్. సదరు కంపెనీని విశాఖకు ఆహ్వానించారు. బెంగళూరులో వర్షాలు, రోడ్ల వ్యవహారంపై జాతీయస్థాయిలో చర్చ సాగుతోంది. రాజేష్ యాబాజీ తన ట్వీట్లో ‘ గతంలో ఇంటి నుంచి ఆఫీస్కు వెళ్లి రావడం సులభంగా ఉండేది. ఇప్పుడు కఠినంగా ఉంది. మా కంపెనీ ఉద్యోగులు ఆఫీస్ కు రావాలంటే గంటన్నర సమయం పడుతోంది. రోడ్లన్నీ గుంతలు, దుమ్ముతో నిండి ఉన్నాయి. గత ఐదేళ్లుగా ఎలాంటి మార్పు లేదు. మేము ఇక్కడి నుంచి వెళ్ళిపోవాలని అనుకుంటున్నాం’ అంటూ పోస్ట్ చేశారు. ఈ ట్వీట్ పై మంత్రి నారా లోకేష్ స్పందించారు.’ హాయ్ రాజేష్.. నేను మీ కంపెనీని విశాఖకు మార్చుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నాను. దేశంలోనే విశాఖ పరిశుభ్రమైన నగరాల్లో ఒకటి. అక్కడ మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయి. మహిళలకు సైతం సురక్షిత నగరంగా గుర్తింపు ఉంది. నాకు డిఎం పంపండి’ అంటూ ట్వీట్ చేశారు. ఇప్పుడు అదే తెలుగు రాష్ట్రాల మధ్య వివాదంగా మారింది.అయితే తాజాగా దీనిపై స్పందించారు కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్. ఘాటు వ్యాఖ్యలు చేశారు. కర్ణాటక ప్రభుత్వం ఇటువంటి బెదిరింపులకు, బ్లాక్ మెయిల్స్ కు పట్టించుకోదంటూ కామెంట్ చేశారు. బెంగళూరులో ప్రపంచ స్థాయి సంస్థలు ఉన్నాయని.. ఇప్పటికే తమ ప్రభుత్వం 1100 కోట్ల రూపాయలతో రోడ్డు మరమ్మత్తులు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. బెంగళూరులో గుంతలు పూడ్చుడానికి, రోడ్ల మరమ్మత్తులు పూర్తిచేసేందుకు నవంబర్ వరకు డెడ్ లైన్ విధించిన విషయాన్ని ప్రస్తావించారు. అయితే డీకే శివకుమార్ కామెంట్స్ చేసిన తర్వాత మంత్రి నారా లోకేష్ ఆసక్తికర ట్వీట్ చేశారు.’ మిగిలిన రాష్ట్రాలకు, ఆంధ్రప్రదేశ్కు ఉన్న తేడా అదే.. మా ప్రజల నిజమైన సమస్యలను బ్లాక్ మెయిల్ గా కొట్టిపారేయలేం.. వాటిని మర్యాదపూర్వకంగా శ్రద్ధ చూపించి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తాం’ అన్నారు నారా లోకేష్. బ్లాక్ మెయిల్ అనే పదాన్ని హైలెట్ చేశారు. దీంతో ఇది డీకే శివకుమార్కు కౌంటర్ అని ఎక్కువమంది భావిస్తున్నారు. మొత్తానికైతే రెండు రాష్ట్రాల మధ్య ఇప్పుడు ఈ సరికొత్త వార్ నడుస్తోంది.



# మహాలయ పక్ష సేవలతో పుష్కలంగా పితృదేవతల ఆశీస్సులు

## స్వర్ణాంధ్రలో ఇండియన్ బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సేవలు అద్వితీయం
## కొనియాడిన మాజీ ఎంపీ ఉండవల్లి, ఇండియన్ బ్యాంకు జోనల్ మేనేజర్ రాజశేఖర్
## 15రోజులపాటు పితృ తర్పణాలు, పిండ ప్రదానం, మూడు ప్రాంతాల్లో భోజన వితరణ
## అమావాస్య నాడు శాస్త్రోక్తంగా గోదానం, స్వయంపాకాలు,వృద్ధులకు దుప్పట్ల పంపిణీ, అన్న సమర్పణ

**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** మహాలయ పక్షాన్ని దృష్టిలో ఉంచుకుని పితృదేవతలకు తిల తర్పణాలు, పిండ ప్రదానంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్,ఇండియన్ బ్యాంకు జోనల్ మేనేజర్ కత్తుల రాజశేఖర్ ప్రశంసించారు.సేవకు ప్రతిరూపంగా నిలిచిన స్వర్ణాంధ్ర సేవా సంస్థ కార్యదర్శి గుబ్బల రాంబాబును సమన్వయం చేసుకుని చేస్తున్న సేవా ప్రశంసనీయమన్నారు. పితృదేవతల ఆశీస్సులు పుష్కలంగా లభించాలని వారు ఆకాక్షించారు.ఆంధ్ర, తెలంగాణ పరిధిలోని ఇండియన్ బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సంఘం (ఐబిఆర్ఐ),ఇండియన్ బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యాన మహాలయ పక్షం సందర్భంగా గడిచిన 15రోజులనుంచి పితృ తర్పణాలు, పిండ ప్రదానాలు పవిత్ర గోదావరి తీరాన కోటిలింగాల ఘాట్ లో నిర్వహించారు. స్వరాంధ్ర సేవా సంస్థ, పుష్కర్ ఘాట్, ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర అన్నదానం చేసారు.మహాలయ అమావాస్య సందర్భంగా లాలా చెర్వులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం దగ్గర ఆదివారం శాస్త్రోక్తంగా గోదానం చేసి,బ్రాహ్మణుల కు దక్షిణలతో స్వయంపాకం అందజేసారు.హైదరాబాద్ నుంచి విచ్చేసిన సంఘం వ్యవస్థాపకులు, చైర్మన్ ఎంవి మురళీధర రావు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బివి నారాయణరావు, జనరల్ సెక్రటరీ పివి రమణ కుమార్, జాయింట్ జనరల్ సెక్రటరీ పిపి శర్మ, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బి వీరభద్రరావు, జాయింట్ జనరల్ సెక్రటరీ ఎండి మస్తాన్,స్వరాంధ్ర కార్యదర్శి గుబ్బల రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిధులుగా హాజరైన ఉండవల్లి అరుణ కుమార్, జోనల్ మేనేజర్ రాజశేఖర్ చేతులమీదుగా 100 మందికి దుప్పట్లు పంపిణీ



చేసారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ, స్వరాంధ్ర సేవా సంస్థలో నిస్వార్ధంగా గుబ్బల రాంబాబు సేవలు అందిస్తూ, వచ్చిన ప్రతిరూపాయి సద్వినియోగం చేస్తున్నారని అన్నారు. అటువంటి వ్యక్తిని ఎంచుకుని ఇండియన్ బ్యాంకు విశ్రాంత ఉద్యోగులు మహాలయ పక్ష సేవా కార్యక్రమాలు చేయడం సమంజసంగా ఉందన్నారు. వృద్ధులకు చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని దుప్పట్లు పంపిణీ చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తంచేస్తూ, ఎవరికి ఎప్పుడు ఏది ఎలా ఇవ్వాలో బ్యాంకు ఉద్యోగులకు బాగా తెలుసునని అభినందించారు.జోనల్ మేనేజర్ రాజశేఖర్ మాట్లాడుతూ మన సంస్కృతీ సంప్రదాయాల ను గౌరవిస్తూ, పితృ దేవతలను సంతృప్తి పరిచేలా సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని అన్నారు. పదవీ విరమణ చేసినప్పటికీ ఉత్సాహంగా ఇలాంటి సమాజ సేవా కార్యక్రమాలు చేయడం పట్ల ఆయన ఆనందం వ్యక్తంచేశారు.

ఐబిఆర్ఐ చైర్మన్ మురళీధర రావు మాట్లాడుతూ 2001సెప్టెంబరు 30న 100మంది సభ్యులతో ప్రారంభించిన తమ సంఘంలో ప్రస్తుతం 1800మంది పైగా సభ్యులు ఉన్నారని తెలిపారు. ఇండియన్ బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సభ్యుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. చనిపోయిన సభ్యుల , కుటుంబ సభ్యులకు మహాలయ పక్షంలో 2003నుంచి సేవలు చేస్తున్నామని, అయితే గత 9ఏళ్లుగా పవిత్ర గోదావరి తీరాన శాస్త్రోక్తంగా పిండ ప్రదానాలు చేసి, పితృ తర్పణాలు వదిలి పెడుతున్నామని వివరించారు. 15రోజుల పాటు స్వరాంధ్ర ఆశ్రమంలో వృద్ధులకు, పుష్కర్ ఘాట్ దగ్గర, ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర అన్నదానం చేసి, ఆఖరి రోజున స్వర్ణాంధ్ర సేవా సంస్థ దగ్గర గోదానం చేశామని, బ్రాహ్మణులకు స్వయంపాకం అందజేశామని తెలిపారు. అదేవిధంగా సెప్టెంబరు 7నుంచి ఇక్కడ అన్నదానం జరిపించినట్లు తెలిపారు. చనిపోయినవారి తిధుల ప్రకారం పిండప్రదానాలు, పితృ తర్పణాలు జరిపించామని తెలిపారు. 50మంది బ్రాహ్మణులకు ఒక్కొక్కరికి బియ్యం, కూరలు, పాలు పెరుగు , దక్షిణ కల్పి అందజేశామని తెలిపారు. తమ కార్యక్రమాలకు స్వరాంధ్ర కార్యదర్శి గుబ్బల రాంబాబు ఏర్పాట్లు చేసి సహకరించారన్నారు. సమాజసేవ పూర్తి సమయం వెచ్చించేందుకు స్వచ్ఛంద పదవీ విరమణ చేసి మరీ సేవలు చేస్తున్న రాంబాబుని హృదయపూర్వకంగా అభినందించారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ భవన నిర్మాణం నుంచి తమకు అనుబంధం ఉందని మురళీధరరావు గుర్తుచేసుకున్నారు. ఇండియన్ బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల అందిస్తున్న సహకారానికి రాంబాబు ధన్యవాదాలు తెలియజేశారు.అశోక్ కుమార్ జైన్,వివిఎస్ఎస్ కృష్ణకుమార్,పసుపులేటి కృష్ణ,మెట్ల ఏసుపాదం తదితరులు పాల్గొని, దుప్పట్ల పంపిణీ చేసారు.

# ఎస్‌కెవిటిలో ఉత్సాహంగా జిల్లా టీమ్ ఎంపికలు

## కబడ్డీ క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తాం..
## శాప్ డైరెక్టర్ పి.రవీంద్ర, అధ్యక్షుడు జి.చంద్రశేఖర్, జిల్లా సెక్రటరీ బురిడి త్రిమూర్తులు

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** రాజమహేంద్రవరం ఎస్.కె.వి.టి డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి కబడ్డీ జట్టు ఎంపికకు సెలక్షన్ ఆదివారం ఉత్సాహంగా జరిగింది.ఈ కార్యక్రమాన్ని శాప్ డైరెక్టర్, నన్నయ్య యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు మెంబర్ పి.రవీంద్ర, తూర్పు గోదావరి జిల్లా కబడ్డీ అధ్యక్షుడు జి.చంద్రశేఖర్,తూర్పు గోదావరి జిల్లా సెక్రటరీ బురిడి త్రిమూర్తులు పర్యవేక్షించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కబడ్డీ క్రీడాకారులను అసోసియేషన్ ద్వారా అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. బాలుర నుంచి 115 మంది, బాలికల నుంచి 65 మంది ఈ ఎంపికకు హాజరయ్యారని, వారిలో ప్రతిభ చూపిన 20 మందిని జిల్లా టీమ్‌కు ఎంపిక చేస్తామని వివరించారు. ఎంపికైన జిల్లా జట్టు ఈనెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు విజయవాడ గొల్లపూడి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనడం జరుగుతుందన్నారు. కొత్తగా ఏర్పడిన తూర్పు గోదావరి జిల్లాలో జరుగుతున్న తొలి





క్రీడా సంబరం ఇదేనని, ఇకపై మరిన్ని కార్యక్రమాలు అసోసియేషన్ ద్వారా నిర్వహిస్తామన్నారు. కబడ్డీ కుటుంబంగా ఏర్పడి రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపేలా జిల్లా స్థాయిలో కబడ్డీ క్రీడాకారులకు తర్ఫీదు ఇవ్వడంతో పాటు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో 43 వేల పాఠశాలకు 30 కోట్ల రూపాయలతో స్పోర్ట్స్ కిట్లు అందచేస్తుందని రవీంద్ర వెల్లడించారు. జూనియర్స్, సబ్ జూనియర్స్, సీనియర్స్ టీమ్‌లకు అయ్యే ఖర్చులు, డ్రెస్‌లు ఇతర చార్జీలను తామే భరిస్తున్నట్టు పేర్కొన్నారు. కబడ్డీ క్రీడాకారులు బాగా ఆడి జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పిఇటిలు, పిడిలు వి.శ్రీనివాస్, ఎ.మల్లిఖార్జునరావు, ఎస్.వీరబాబు,ఎస్.కుమార్,ఎం.చంద్రశేఖర్, ఎం.శ్రీనివాస్, అర్జున్, ఏలియా,ఎస్.నాగరాజు, వీర్రాజు,ఈశ్వరరావు,ఎడి ప్రసాద్, కృష్ణ, ఎస్.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన కళాకారులను ప్రోత్సహించడమే నా లక్ష్యం

## గోదావరి నది మధ్యలో సినిమా తీయాలని ఆశ..
## రాజమండ్రి కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రాధాన్యత ఇస్తా
## వీర చంద్రహాస సినిమా విడుదల సందర్భంగా విలేకరుల సమావేశం
## డాక్టర్ జేమ్స్ వాట్ కొమ్ము విలేకరులతో చిట్ చాట్

**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** గోదావరి నది మధ్యలో సినిమా తీయాలని ఉందని, నూతన కళాకారులను ప్రోత్సహించడమే నా లక్ష్యం అని రాజమండ్రి నగరానికి చెందిన ప్రొడ్యూసర్ డాక్టర్ జేమ్స్ వాట్ కొమ్ము అన్నారు.చంద్రహాస చిత్రం సెప్టెంబర్ 20 శివజ్యోతి లో మ్యాట్నీ షో మీడియా మిత్రులకు ప్రదర్శించడం జరిగింది.డాక్టర్ జేమ్స్ వాట్ నిర్మించిన ఈ చిత్ర ప్రదర్శన అనంతరం ప్రొడ్యూసర్ డాక్టర్ జేమ్స్ వాట్ కొమ్ము మీడియా మిత్రులతో మాట్లాడుతూ..చిత్ర పరిశ్రమలు 2018 నుండి నా ప్రయాణం ప్రారంభం అయినట్లు




తెలిపారు. తన మొదటి చిత్రం నువ్వు తోపురా, రెండవ చిత్రం వాయిస్ ఆఫ్ మరియా, మూడవ చిత్రం కిల్లర్ ఆర్టిస్ట్ సినిమాలు తీసినట్లు వివరించారు.ఇది 4వ చిత్రం మని,ఈ ఆర్ట్ రిలేటెడ్ చిత్రాన్ని కూడా ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. కన్నడ పరిశ్రమలో 100 రోజులు విజయవంతంగా ప్రదర్శింపబడిన ఈ చిత్రాన్ని తెలుగులో నేను అందించడం జరిగిందన్నారు.సలార్, కెజిఎఫ్ చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించిన రవి బసూర్ కన్నడ సంస్కృతిని పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ చిత్రానికి దర్శకత్వం వహించడం జరిగిందని అన్నారు. ఆయనతో కలిసి ఈ చిత్రానికి పని చేయాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని తెలుగులో చేయడం జరిగిందన్నారు. క్రొత్త వాళ్లకు అవకాశాలు ఇస్తూ, భిన్నమైన చిత్రాన్ని అందించడానికి సన్నహాలు జరుగుతున్నాయని వివరించారు.ఈ సంవత్సరంలోనే ఆ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని,త్వరలో వాటి వివరాలు తెలియజేస్తామన్నారు. భారతదేశంలోని కళలు సంస్కృతి సాంప్రదాయాలు ప్రపంచానికి తెలియజేయాలని ఉద్దేశంతోనే



ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేసినట్లు వివరించారు. తాను కొత్త నటుడిని ప్రోత్సహిస్తానని తన సినిమాలలో నూతన నటీనటులకు ప్రోత్సహించే అవకాశం కల్పిస్తానని అన్నారు.తాను పుట్టిన రాజమండ్రి కళలకు ఖాణాచి అని రాజమండ్రి నుంచి వచ్చే కళాకారులకు ఎప్పుడు ప్రోత్సాహం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈరోజు సంబంధం లేని మంచి కథలను తీసుకొని సినిమాలు తీస్తానని అన్నారు. తనకు మ్యూజిక్ సినిమా ఒక ఫ్యాషన్ అని వివరించారు. సినిమా పరిశ్రమ ఒక ఆయుధం వంటిదని, దీని ద్వారా ప్రపంచానికి ఒక సందేశం అందించే అవకాశం ఉందని అన్నారు. సామాజిక విలువలతో పాటు, కమర్షియల్ సినిమాలను కూడా తాను నిర్మిస్తానని తెలిపారు. ఆర్ట్ ఫిలింలను ప్రేక్షకులు థియేటర్ కు వచ్చి సినిమా చూస్తే నిర్మాతలను ప్రోత్సహించినట్లు ఉంటుందని అన్నారు.

# సరికొత్త విజయాలకు “దసరా”నాంది కావాలి

**– ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు**



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** ఈ నెల 22వ తేదీ నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో నగరంలోని పలు అమ్మ వారి ఆలయ కమిటీల ప్రతినిధులు ఏపీ శెట్టి బలిజ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబుకు ఆహ్వానం పలుకుతున్నాయి. ఇందులో భాగంగా భవానిపురం లోని కనకదుర్గ అమ్మ వారి ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆదివారం ఉదయం స్థానిక వెంకటేశ్వర నగర్ లోని ఏపీ శెట్టి బలిజ కార్పొరేషన్ కార్యాలయం లో చైర్మన్ కుడుపూడి సత్తిబాబును కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన ఉదంతానికి గుర్తుగా 10 రోజుల పాటు జరుపుకునే విజయ దశమి ఉత్సవాలు ఆద్యంతం స్నేహపూరిత వాతావరణంలో ఆధ్యాత్మిక విలువల్ని అందించాలని ఆకాంక్షించారు.ఈ ఉత్సవాలు ప్రజలకు సరికొత్త విజయాలకు నాంది కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీసీ సాధికార సమితి విశ్వ బ్రాహ్మణ విభాగం జిల్లా కన్వీనర్ వీరమళ్ళ సత్యనారాయణ ( సత్తి బాబు)కోన సుబ్రహ్మణ్యం, పెదగడ నాని, తాడాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతీ ఘాట్లో ఆదిత్య స్వచ్ఛభారత్,సేవ్ గోదావరి






**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్.ఎస్.ఎస్,యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు ఆదివారం ఉదయం సరస్వతి ఘాట్లో, స్వచ్ఛభారత్, సేవ్ గోదావరి కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ ను ఏరివేసి వ్యర్థ పదార్థాలను తొలగించి స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఎన్.ఎస్.ఎస్.ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి. వి. ఎస్. నాగేశ్వరరావు రూపకల్పన లో కొంతమంది విద్యార్థులు మహాలయ పక్షాలలో పిండ ప్రదానాలు చేసినప్పుడు వేసిన ప్లాస్టిక్ కవర్లు,ప్లాస్టిక్ సీసాలు వంటివి తీసివేసి, గోదావరి జలాల పరిరక్షణ కు సహకరించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ కి చెందిన పి.వి.ఎస్.కృష్ణారావు,కవయిత్రి,ప్రముఖ సామాజిక సేవకురాలు,ఈ కార్యక్రమానికి తెలుగు మహిళా నగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ విచ్చేశారు. ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టెంబర్ 17వ తారీఖు నుండి అక్టోబర్ రెండు వరకు స్వచ్ఛత సేవలో భాగంగా ఉత్సవాలు జరుగుతున్నా యనీ,స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.ఆదిత్య డిగ్రీ కళాశాలలు ఇటువంటి వినూత్న కార్యక్రమాలకు ముందే ఉంటాయని ఆమె ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. డా. జీవీఎస్ నాగేశ్వరరావు డాక్టర్ బి.హెచ్.వి రమాదేవి మాట్లాడుతూ 2002 నుండి నేటి వరకు ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు నిరాటంకంగా జరుగుతున్నాయని, ఆదిత్య విద్యాసంస్థలు సేవకు పెద్దపీతను వేస్తాయని చెప్పారు. ప్రతి కార్యక్రమానికి వాలంటీర్లను పంపించి ప్రోత్సహిస్తున్న వారి తల్లిదండ్రులకు తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

**ఆదిత్య వాలంటీర్లకు నేర్పిన యోగా శిక్షణ**

అనంతరం యోగా లో వివిధ ఆసనాలు ఆదిత్య వాలంటీర్లకు నేర్పిన యోగా టీచర్ ఎ. మాధవికి, కోసూరి చండీప్రియ లకు డాక్టర్ బిహెచ్. వి. రమాదేవి,బి.విమల లు శాలువా కప్పి పూలమాలల తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య కళాశాల ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ బి హెచ్. వి.రమాదేవి, పోలు కొండ సాయి,ఆకుల శిరీష, యానిమేషన్ కళాశాలకు చెందిన బి.విమల, ఎన్.ఎస్.ఎస్. నాయకులు సూర్య,వినయ్, మౌనిష్,మనోజ్, సందీప్,యశస్విని,సుమ హర్షిణి,శ్రావణి తదితరులు పాల్గొన్నారు. వాలంటీర్లను ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే విధంగా తీర్చిదిద్దుతున్న ఆదిత్య సంస్థల యాజమాన్యం మరియు ఎన్ ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్లను, సరస్వతి ఘాట్ ఆలయ నిర్మాణకర్త తోట సుబ్బారావు అభినందించారు. ఈ కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్స్ సిహెచ్. ఫణి కుమార్,ఎస్. కె. ఎన్.రెహమాన్, ఎం.చంద్రశేఖర్,డి.రామకృష్ణ తదితరులు అభినందించారు.

# అన్ని సౌకర్యాలతో పూలే భవన్ పూర్తి చేయాలి

**– ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచన**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** అవసరమైన అన్ని సౌకర్యాలతో పూలే భవన్ పూర్తి చేయాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచనలు చేశారు. స్థానిక గోదావరి గట్టున రూపుదిద్దుకుంటున్న ఉన్న పూలే భవన్ ను రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న భవనం ప్రగతి, ఇంకా చేపట్టాల్సిన పనులపై నాయకులు, కాంట్రాక్టర్, నగరపాలక సంస్థ అధికారులతో చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన పనులు పూర్తి చేసి పూలే భవన్ ను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఎక్కడ ఎలాంటి అవసరం ఉన్నా తనను సంప్రదిస్తే సహకారాన్ని అందిస్తామన్నారు. అందరికీ సౌకర్యవంతంగా ఉండేలా పూలే భవన్ ఉండాలని సూచించారు.

# పౌరులకు 'డబుల్ బొనాంజా'

న్యూఢిల్లీ

తదుపరి తరం వస్తు సేవల పన్ను(జీఎస్టీ) సంస్కరణలతో దేశవ్యాప్తంగా అభివృద్ధి వేగం పుంజుకోనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. 'ఆత్మనిర్భర్ భారత్' సాధన దిశగా ఇది అతిపెద్ద, కీలకమైన అడుగు అని అభివర్ణించారు. దేశ సౌభాగ్యం కోసం స్వదేశీ ఉత్పత్తులకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు. జీఎస్టీ సంస్కరణలు సోమవారం నుంచే అమల్లోకి రాబోతున్నాయని, నిత్యావసరాల ధరలు తగ్గుతాయని, పేద, మధ్య తరగతి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. నవరాత్రులను పురస్కరించుకొని ప్రధాని మోదీ ఆదివారం దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'స్వదేశీ' ఉద్యమం దేశ స్వాతంత్ర్య పోరాటానికి కొత్త శక్తిని ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రజలంతా స్వదేశీ ఉత్పత్తులు ఉపయోగించుకుంటే దేశ ఆర్థిక ప్రగతికి నూతన బలం చేకూరుతుందని వెల్లడించారు. దేశంలో ప్రతి ఇంటినీ స్వదేశీకి ప్రతీకగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రతి దుకాణాన్నీ స్వదేశీ వస్తువులతో అలంకరించాలని పిలుపునిచ్చారు. రూ.12 లక్షల దాకా ఆదాయంపై ఇప్పటికే పన్ను మినహాయింపు ఇచ్చామని, ఇప్పుడు జీఎస్టీ సంస్కరణలు తీసుకొచ్చామని, ఈ రెండూ దేశ పౌరులకు 'డబుల్ బోనాంజా' అని స్పష్టంచేశారు. దీనివల్ల ఖర్చులు తగ్గి, డబ్బులు ఆదా చేయడం పెరుగుతుందని, తద్వారా ప్రజలు వారి కలలు నిజం చేసుకోవడానికి అవకాశం దక్కుతుందని వ్యాఖ్యానించారు. రెండు కీలక నిర్ణయాల వల్ల ప్రజలకు రూ.2.5 లక్షల కోట్లు ఆదా అవుతాయని వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే..

**నాగరిక్ దేవో భవ**

"మన దేశం స్వావలంబన సాధించాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలి. పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని రాష్ట్రాలు కల్పించాలి. తయారీ రంగాన్ని మరింతగా ప్రోత్సహించాలి. ప్రజలు 'మేన్ ఇన్ ఇండియా' ఉత్పత్తులు విస్తృతంగా ఉపయోగించాలి. స్వదేశీ ఉత్పతుల కొనుగోలు, విక్రయం మన ధ్యేయం కావాలి. మన దేశంలో తయారైన వస్తువులు, సరుకులే వాడుకుంటున్నామని ప్రతి ఒక్కరూ గర్వంగా చెప్పుకోవాలి. అప్పుడు మన దేశం ప్రగతి పథంలో పరుగులు తీస్తుంది. నాగరిక్ దేవో భవ(ప్రజలే దేవుళ్లు) అనేదే మా విధానం. ప్రజలకు మేలు చేయాలన్న తలంపుతోనే జీఎస్టీ సంస్కరణలకు శ్రీకారం చుట్టాం. ఈ నిర్ణయంతో కీలకమైన నిత్యావసర వస్తువులు, సేవల ధరలు తగ్గుతాయి. నిర్మాణం, ఆరోగ్య రంగంలోనూ ఖర్చులు తగ్గిపోతాయి. సోమవారం నుంచి 'జీఎస్టీ సేవింగ్స్ ఫెస్టివల్' ప్రారంభం కానుంది. ప్రతి కుటుంబానికీ సంతోషం తీసుకొస్తుంది. ఆత్మనిర్భర్ భారత్ కోసం ఈ నవరాత్రుల్లో తొలి రోజు దేశం కీలకమైన అడుగు వేయబోతోంది. మీకు ఇష్టమైన వస్తువులు తక్కువ ధరకే కొనుక్కోవచ్చు. పేదలు, మధ్య తరగతి, యువత, రైతులు, మహిళలు, వ్యాపారులు, దుకాణదారులు.. ఇలా అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందుతారు. దేశంలో సులభతర వాణిజ్యం ఊపందుకుంటుంది. భారీగా పెట్టుబడులు వస్తాయి" అని మోదీ చెప్పారు.

**బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు..**

"2017లో జీఎస్టీ సంస్కరణలు ఆరంభించాం. చరిత్ర లిఖించడానికి అప్పుడే అడుగు పడింది. ఒకే దేశం%–%ఒకే పన్ను అనే స్వప్నాన్ని జీఎస్టీ నిజం చేసింది. గతంలో రకరకాల పన్నులు, సుంకాల వల్ల వ్యాపారులకు, వినియోగదారులకు ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యేవి. పన్నుల భారాన్ని వ్యాపారులు జనంపైనే వేసేవారు. జీఎస్టీతో ఆ కష్టాలకు చరమగీతం పాడేశాం. 2014లో ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఓ విదేశీ పత్రికలో వార్త చదివా. బెంగళూరు నుంచి 570 కిలోమీటర్ల దూరంలోని హైదరాబాద్‌కు సరుకులు చేరవేయడం ఓ కంపెనీకి పెద్ద సవాలుగా మారిందని అందులో రాశారు. పలు రకాల పన్నులు చెల్లించాల్సి వస్తోందని పేర్కొన్నారు. దానికి బదులు తొలుత యూరప్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్‌కు చేర్చడమే సులభమని ప్రస్తావించారు. అందుకే పన్నులపరంగా అవరోధాలు తొలగించాలని నిర్ణయించాం. అన్ని రాష్ట్రాలు, భాగస్వామ్య పక్షాలతో చర్చించి, జీఎస్టీని తీసుకొచ్చాం" అని ప్రధాన మంత్రి 'మోదీ వివరించారు.

**ఇకనుంచి 5, 18% శ్లాబ్‌లే..**

'సంస్కరణలతో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు(ఎంఎస్ఎంఈ) సైతం ప్రయోజనం పొందుతాయి. మేన్ ఇన్ ఇండియా ఉత్పత్తులకు పూర్వ వైభవం తీసుకురావాలని ఎంఎస్ఎంఈలను కోరుతున్నా. స్వావలంబన భారత్ నిర్మాణంలో ఎంఎస్ఎంఈలదే కీలక పాత్ర. సాధ్యమైనంత ఎక్కువగా మన దేశంలోనే వస్తువులు ఉత్పత్తి చేయాలి. మనం ఉపయోగించుకుంటున్న వస్తువు ఎక్కడ తయారైందో ప్రజలు తెలుసుకోవాలి. నిత్యం వాడుతున్న దువ్వెన ఎక్కడ తయారు చేశారో కూడా చాలామందికి తెలియదు. విదేశీ వస్తువులకు ప్రాధాన్యం వేయడం సరైంది కాదు. ఇకపై స్వదేశీ ఉత్పత్తులకే పెద్దపీట వేద్దాం. తగ్గిన జీఎస్టీ రేట్ల ప్రయోజనం ప్రజలకు దక్కేలా పరిశ్రమ వర్గాలు చొరవ చూపుతుండడం సంతోషంగా ఉంది. ఇకనుంచి 5 శాతం, 18 శాతం ట్యాక్స్ శ్లాబ్‌లే ఉంటాయి. గతంలో 12 శాతం పన్ను శ్లాబ్‌లో ఉన్న 99 శాతం వస్తువులను 5 శాతం పన్ను శ్లాబ్‌లోకి తీసుకొచ్చాం. ఫలితంగా వాటి ధరలు గణనీయంగా తగ్గిపోతాయి' అని మోదీ అన్నారు.

# కొత్త వారికే వీసా వార్షిక రుసుము

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్1 బీ వీసా వార్షిక రుసుమును లక్ష డాలర్లకు పెంచుతూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. అయితే, ఆ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్న తరుణంలో వైట్‌హౌస్ కీలక ప్రకటన చేసింది. నేటి నుంచి హెచ్1బీ వార్షిక వీసా కోసం దరఖాస్తు చేసే ప్రతి వ్యక్తి లక్ష డాలర్లు (సుమారు రూ.83 లక్షలు) ఫీజు చెల్లించాల్సి ఉంది. అయితే, ఈ పెంపు కొత్తగా దరఖాస్తు చేసే విదేశీ ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుందని తెలిపింది. ఇప్పటికే హెచ్1–బీ వీసా ఉన్నవారికి తాజా పెంపు వర్తించదని తెలిపింది. అమెరికా అధ్యక్షుడు తాజాగా విడుదల చేసిన 'ప్రోక్లమేషన్ ఆఫ్ రెస్ట్రిక్షన్ ఆన్ ఎంట్రీ ఆఫ్ సర్టెన్ నాన్‌ఇమ్మిగ్రెంట్ వర్కర్స్' ప్రకటన ప్రకారం హెచ్ 1బీ వీసాలపై కీలకమైన పరిమితులు విధించింది. ట్రంప్ ఆదేశాలను అమలు చేసే యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ అధికారికంగా మార్గదర్శకాలు విడుదల చేసింది. ఆ మార్గ దర్శకాల ప్రకారం.. హెచ్ 1 బీ వీసా పొందిన ఈ ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చింది.

మినహాయింపులు:

అమెరికా పౌరుల జీవిత భాగస్వాములు, పిల్లలు అమెరికాలో స్థిర నివాసం ఉన్న వ్యక్తులు

వ్యవసాయం, మాంసం ప్రాసెసింగ్, ప్యాకింగ్ హౌసులు, రవాణా వంటి రంగాల్లో పనిచేసే కార్మికులకు మినహాయింపు

ఆరోగ్య సంరక్షణ రంగంలోకి వచ్చే ముఖ్యమైన విభాగాల్లో పనిచేసే ఉద్యోగులకు మినహాయింపు ఉంటుంది.

ఈ నిబంధనలు అమెరికాకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్న కొత్త వీసా దారులకు మాత్రమే వర్తిస్తుంది. ఇప్పటికే దాఖలైన కానీ ఇంకా వీసా పొందని ధరఖాస్తు దారులకు మాత్రమే వర్తిస్తుంది.

ఏమిటీ హెచ్–1బీ వీసా?

విదేశీ నిపుణులను అమెరికాలోని కంపెనీలు ఉద్యోగాల్లో నియమించుకోవడానికి వీలుగా 1990వ దశకంలో అమెరికా ప్రభుత్వం ఇమ్మిగ్రేషన్ చట్టం ద్వారా హెచ్%–%1బీ వీసాలను ప్రవేశపెట్టింది. ఈ వీసాలతో లక్షలాది మంది విదేశీయులు అమెరికాలో ఉద్యోగాలు సంపాదించారు. ఇక్కడే స్థిరపడ్డారు. క్రమంగా పౌరసత్వం కూడా పొందారు. హెచ్%–%1బీ వీసా దరఖాస్తు ఫీజు ప్రస్తుతం 2 వేల డాలర్ల నుంచి 5 వేల డాలర్ల (రూ.1.76 లక్షలు%–% రూ.4.40 లక్షలు) దాకా ఉంది. తొలుత మూడేళ్ల కాలానికి హెచ్%–%1బీ వీసా జారీ చేస్తారు. అవసరాన్ని బట్టి మరో మూడేళ్లు పొడిగిస్తారు. ఈ వీసాలతో అత్యధికంగా ప్రయోజనం పొందుతున్నది భారత నిపుణులే. ఆ తర్వాత చైనా నిపుణులు ఉంటున్నారు. భారత్‌లో ఇంజనీరింగ్ విద్య అభ్యసించిన విద్యార్థుల కల హెచ్–1బీ వీసా అంటే అతిశయోక్తి కాదు. దీని గురించి తెలియనివాళ్లు దాదాపు ఉండరు. సాధారణంగా హెచ్–1బీ వీసా దరఖాస్తు ఫీజుతోపాటు ఇతర రుసుములను కంపెనీలే భరిస్తాయి. ఇకపై దీనికోసం ఏటా ఒక్కో విదేశీ ఉద్యోగిపై రూ.88 లక్షలకుపైగా చెల్లించాల్సి రావడం అమెరికా సంస్థలకు పెనుభారమే. అది పరోక్షంగా విదేశీ ఉద్యోగులకు.. ముఖ్యంగా భారతీయులకు నష్టం చేకూర్చనుంది. కంపెనీల అవసరాలు తీర్చేలా అత్యధిక ప్రతిభాపాటవాలు ఉంటే తప్ప హెచ్%–%1బీ వీసాతో అమెరికాలో ఉద్యోగం పొందడం దుర్లభమేనని అంటున్నారు.

## దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్..

న్యూఢిల్లీ

బిహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తరహాలోనే దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ చేపట్టేందుకు ఎన్నికల కమిషన్ సమాయత్తమవుతోంది. ఇందుకోసం సెప్టెంబర్ 30వ తేదీలోగా సన్నద్ధం కావాలని అన్ని రాష్ట్రాల ఎన్నికల అధికారులకు ఈసీ ఆదేశాలిచ్చింది. ఓటర్ లిస్ట్ క్లీనప్ ఎక్సర్‌సైజ్‌ను అక్టోబర్–నవంబర్ నాటికి ప్రారంభించనున్నట్టు సంకేతాలిచ్చింది. ఈసీ వర్గాల సమాచారం ప్రకారం, రాష్ట్రాల చీఫ్ ఎలక్టోరల్ అధికారులతో న్యూఢిల్లీలో ఈసీ ఇటీవల సమావేశం నిర్వహించింది. రాబోయే 10–15 రోజుల్లో ఎస్ఐఆర్ రోల్‌అవుట్‌కు సిద్ధంగా ఉండాలని ఈసీ ఉన్నతాధికారులు ఈ సమావేశంలో ఆదేశాలిచ్చారు. లాంఛనంగా సెప్టెంబర్ 30వ తేదీని చివరితేదీగా నిర్ణయించారు. చివరిసారిగా నిర్వహించిన ఎస్ఐఆర్ ఓటర్ లిస్ట్‌ను సిద్ధంగా ఉంచాలని ఈసీ ఆదేశాలిచ్చింది. గత ఎస్ఐఆర్ తర్వాత ఓటర్ల జాబితాలను పలు రాష్ట్రాల సీఈఓలు ఇప్పటికే తమ వెబ్‌సైట్‌లో ఉంచారు. న్యూఢిల్లీలో చివరిసారిగా 2008లో ఎస్ఐఆర్ నిర్వహించారు. ఉత్తరాఖండ్‌లో 2006లో చివరిసారిగా ఎస్ఐఆర్ నిర్వహించారు. చాలా రాష్ట్రాల్లో చివరిసారి ఎస్ఐఆర్ 2002–2004 మధ్య జరిగింది. బిహార్ తర్వాత దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహించనున్నట్టు ఈసీ ఇటీవల ప్రకటించింది. 2026లో అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. పుట్టినస్థలం రికార్డులను పరిశీలించి అక్రమ విదేశీ వలసదారులను జాబితా నుంచి తప్పించడం ఎస్ఐఆర్ ప్రధాన లక్ష్యంగా ఉంది.

## ఎల్‌టీటీఈ పునరుద్ధరణకు యత్నం

**చెన్నై:** నిషేధిత తమిళ ఉగ్రవాద సంస్థ లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్టీటీఈ) పునరుద్ధరణకు శ్రీలంక మహిళ ప్రయత్నించింది. నకిలీ పాస్‌పోర్ట్ కేసులో అరెస్టై జైలులో ఉన్న ఆమెపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు చేపట్టింది. మనీలాండరింగ్ ఆరోపణలపై ఆమెను ప్రశ్నించనున్నది. శ్రీలంక జాతీయురాలైన లెచ్చుమనన్ మేరీ ఫ్రాన్సిస్కా 2019 డిసెంబర్‌లో టూరిస్ట్ వీసాపై భారత్‌కు వచ్చింది. అయితే వీసా గడువు ముగిసిన తర్వాత కూడా చెన్నైలో ఉండటంతో పాటు నకిలీ పత్రాల ద్వారా భారత్ పాస్‌పోర్ట్ పొందింది. ఈ నేపథ్యంలో 2021 అక్టోబర్‌లో చెన్నై విమానాశ్రయంలో మేరీ ఫ్రాన్సిస్కాను తమిళనాడు సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. భారత్‌లో అక్రమంగా నివసించడం, నకిలీ పాస్‌పోర్ట్ పొందడం వంటి నేరాలపై ఆమెపై కేసు నమోదు చేశారు. కాగా, నిషేధిత ఎల్టీటీఈ పునరుద్ధరణ, ఆ సంస్థ కార్యకలాపాలకు వనరులను సమీకరించడానికి మేరీ ఫ్రాన్సిస్కా కుట్ర పన్నినట్లు దర్యాప్తులో బయటపడింది. యాక్టివ్‌గా లేని బ్యాంకు ఖాతాలను యాక్సెస్ చేయడం, ఎల్టీటీఈ క్యాడర్ల పునఃసమూహానికి సహాయపడేందుకు నిధులు మళ్లించేందుకు ఆమె ప్రయత్నించినట్లు ఆరోపణలున్నాయి. ఆమె వాంగ్మూలాల ఆధారంగా టీ కెన్నిస్టన్ ఫెర్నాండో, కే బాస్కరన్ సహా మరో ఏడుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు అప్పగించారు. డెన్మార్క్‌లో స్థిరపడిన శ్రీలంక తమిళుడు, మాజీ ఎల్టీటీఈ కార్యకర్త ఉమాకాంతన్‌తో శ్రీలంక మహిళకు సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఉమాకాంతన్ సూచనల మేరకు పనిచేస్తున్న ఫ్రాన్సిస్కా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లోని నిష్క్రియాత్మక ఖాతా నుంచి రూ.42 కోట్లకు పైగా మళ్లించేందుకు ప్రయత్నించినట్లు ఎన్ఐఏ ఆరోపించింది. ఈ కుట్రలో భాగంగా సహచరులకు విదేశీ చెల్లింపులు ఆమె జరిపినట్లు దర్యాప్తులో గుర్తించారు. కాగా, 2021 అక్టోబర్‌లో అరెస్ట్ అయినప్పటి నుంచి పుళల్ సెంట్రల్ జైలులో మేరీ ఫ్రాన్సిస్కా ఉన్నది. ఎల్టీటీఈ పునరుద్ధరణ కోసం మనీలాండరింగ్‌కు ఆమె పాల్పడినట్లు ఈడీ ఆరోపించింది. దీంతో జైలు ఆవరణలో రెండు రోజుల పాటు ఆమెను ప్రశ్నించేందుకు కోర్టు అనుమతిని ఈడీ కోరింది. దీనికి అంగీకరించిన కోర్టు 'విచిత్రమైన కేసు'గా అభివర్ణించింది. ఫ్రాన్సిస్కా విచారణ కోసం ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్లు, ఇతర అవసరమైన పరికరాలను ఈడీ అధికారులు జైలులోకి తీసుకెళ్లడానికి కోర్టు అనుమతించింది.

## కొచ్చి వాటర్ మెట్రో సరికొత్త రికార్డు

**కొచ్చి :** కేరళలోని కొచ్చి వాటర్ మెట్రో ముఖ్యమైన మైలురాయిని చేరుకుంది. వాటర్ మెట్రో ప్రారంభించిన 29 నెలల్లోనే 50 లక్షల ప్రయాణికులను గమ్య స్థానాలకు తీసుకెళ్లిందని సంబంధిత అధికారులు ఆదివారం తెలిపారు. ఈ 50 లక్షల మెలురాయి ప్రయాణికునిగా ఆస్ట్రేలియాకు చెందిన నైనా నిలిచారు. శనివారం మధ్యాహ్నం ఫోర్ట్ కొచ్చికి ప్రయాణించేందుకు హైకోర్టు టెర్మినల్‌లో నైనా టిక్కెట్ కొనుగోలు చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కొచ్చి మెట్రో మేనేజింగ్ డైరెక్టర్ లోక్‌నాథ్ బెహెరా నైనాకు ఒక బహుమతినిచ్చారు. పరిమిత సంఖ్యలో, రూట్లలో నడుస్తున్నప్పటికీ, వాటర్ మెట్రో సౌకర్యవంతమైన , అధిక నాణ్యత ప్రయాణ అనుభవాన్ని అందించడం కారణంగా ఈ విజయం సాధ్యమైందని బెహెరా పేర్కొన్నారు. కేరళ ప్రభుత్వం ఏప్రిల్ 2023, ఏప్రిల్ 25న ప్రారంభించిన కొచ్చి వాటర్ మెట్రో స్థానికులతో పాటు పర్యాటకులలో ప్రజాదరణ పొందింది.

# మిడిల్ క్లాస్‌కు మంచి రోజులు




-మొదటిపేజీ తరువాయి

పన్నురేట్లుండాలని మొదట లకిక్ష్యంచినా సాధ్యం కాలేదు. తాజా సవరణలతో అది సాధ్యమై జీఎస్టీ శ్లాబ్‌లు 3కు తగ్గాయి. తక్కువ శ్లాబ్‌లుంటే పాలన, ధరల నిర్ణయం, బిల్లింగ్ సులువవుతుంది. పన్ను అధికారులపైనా భారం తగ్గుతుంది. జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాల్లో అత్యంత ప్రధానమైనది.. 12 శాతం, 28 శాతం పన్ను రేట్లను పూర్తిగా తొలగించటం. కొన్ని విలాస, అనారోగ్య (సిన్) వస్తువుల కోసం 40 శాతం పన్ను రేటును చేర్చటం. వాస్తవంగా చూస్తే చాలావరకూ ఆహార పదార్థాలు, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులు, ప్యాకేజ్డ్ ఫుడ్స్ 5% పరిధిలోకి వచ్చాయి. కొన్నింటిపై పన్నే లేకుండా చేశారు. గతంలో వీటిపై 12, 28 శాతం పన్ను రేట్లుండేవి. ఇది అత్యధికులకు ఊరటే. ఇక కొన్ని విలాస వస్తువులు, కూల్‌డ్రింక్స్, టొబాకో ఉత్పత్తులు, పాన్ మసాలా వంటివి మాత్రం 28 శాతం పన్ను పరిధిలో ఉండగా ఇపుడు 40 శాతం శ్లాబ్‌లోకి వెళ్లాయి.

**తగ్గింపు ప్రయోజనాలు ఎక్కువే...**

ముఖ్యంగా ప్రాణాధార ఔషధాలపై పన్ను భారం తొలగిపోనుంది. మరెన్నో ఔషధాలు, వైద్య పరికరాలు, ఎఫ్ఎంసీజీ ఉత్పత్తులైన టూత్‌బ్రష్, టూత్‌పేస్ట్, సబ్బులు, షాంపూలు, హెయిర్ ఆయిల్, టాల్కమ్ పౌడర్, షేవింగ్ క్రీమ్‌తో పాటు నెయ్యి, పన్నీరు, బటర్, నమ్కీన్, కెచప్, డ్రై ఫ్రూట్స్, కాఫీ దగ్గర్నుంచి.. పెద్ద సైజు టీవీలు, ఏసీలు, వాషింగ్ మెషీన్లు, కార్ల వరకు మొత్తం 375 ఉత్పత్తుల ధరలు గతంతో పోల్చితే తగ్గనున్నాయి. ఈ తగ్గింపు వల్ల జనం చేతుల్లో మరికొంత డబ్బు మిగులుతుంది కనక ఇది సేవింగ్స్‌లోకి, స్టాక్ మార్కెట్లోకి మళ్లే అవకాశం ఉందనేది ప్రభుత్వం అంచనా. అంతిమంగా ఇది ఆర్థిక వృద్ధికి దారితీయాలనేది లక్ష్యం. అయితే అదే తరుణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయాలు తగ్గిపోకూడదు కనక విలాస, అనారోగ్య వస్తువులపై ఏకంగా పన్ను శాతం 40కి పెంచారు.

**ధర పెరిగే వస్తువులివీ..**

బీడీ మినహా సిగరెట్లు, సిగార్లు, గుట్కా, పాన్ మసాలా, నికొటిన్ ఉత్పత్తులు గతంలో ఉన్న 28 శాతం నుంచి 40 శాతానికి చేరాయి. అయితే ఈ పెంపు ప్రస్తుతానికి అమల్లోకి రాదు. బీడీలపై పన్నును మాత్రం 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించారు. బిహార్, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల్లో సిగరెట్లు తాగేవారికన్నా బీడీలు కాల్చేవారు దాదాపు మూడురెట్లు ఎక్కువనేది గమనార్హం.

కార్బొనేటెడ్ డ్రింక్స్, ఎనర్జీ డ్రింక్స్, కెఫైన్ ఆధారిత పానీయాలను 28 నుంచి 40 శాతంలోకి చేర్చారు.

? లాటరీ టికెట్లు, కేసినో సేవలు, ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫారాలపై పన్ను రేటు 40 శాతంగా నిర్ణయించారు. 1,500 సీసీకన్నా ఎక్కువ సామర్థ్యం ఉన్న ఎస్‌యూవీలు, హై%–%ఎండ్ కార్లపై ఇకపై 40 శాతం జీఎస్టీ అమలవుతుంది. ఫ్యాట్స్, చక్కెర, ఉప్పు ఎక్కువగా ఉండే ఫాస్ట్ ఫుడ్స్, ప్యాకేజ్డ్ స్నాక్స్ కూడా ఇకపై 40 శాతం శ్లాబ్‌లోకి వస్తాయి.

**మధ్యతరగతిపై ప్రభావమెంత?**

మధ్య తరగతి ప్రజలకు ఈ సవరణల్లో ఎక్కువ లాభం తెచ్చేవి ఏవైనా ఉన్నాయంటే అవి కిరాణా సరుకులు, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులే. చాలా వస్తువులు 18, 12 శాతాల నుంచి 5 శాతం పరిధిలోకి రావటమే ఇందుకు కారణం. ఇక ఔషధాలు, బీమా రూపేణా కలిసొచ్చేది ఎక్కువే. అందుకే ప్రతినెలా కొంత కచ్చితంగా ఆదా అవుతుందని ప్రభుత్వం చెబుతోంది. పట్టణ మధ్య తరగతి కుటుంబాల్లో ఈ నెలవారీ ఆదా మందులను కూడా పరిగణనలోకి తీసుకుంటే రూ.1700 నుంచి రూ.2200 వరకూ ఉండవచ్చనేది నిపుణుల అంచనా. పైపెచ్చు ఈ జీఎస్టీ సవరణల్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. అందుకే ఏ వస్తువుపై ఎంత తగ్గిందనేది ప్రతి తయారీదారూ కచ్చితంగా ప్రకటించాలనే నియమాన్ని పెట్టింది. ఈ మేరకు తయారీదారులు రకరకాల ప్రకటనలు చేస్తున్నారు. ప్రభుత్వం కూడా విస్తృత ప్రచారం కల్పిస్తోంది. పైపెచ్చు ఉత్పత్తిదారులు తగ్గించినా రిటైల్ అమ్మకందారులు తగ్గించకపోతే పన్ను తగ్గింపు ప్రయోజనం జనానికి చేరదు కనక ఈ అమలు తీరును 6 నెలల పాటు నిశితంగా పర్యవేక్షించనుంది కూడా.

**ఏవి చౌకగా లభిస్తాయంటే..**

వెన్న, నెయ్యి, చీజ్, కండెన్స్‌డ్ మిల్క్, యూహెచ్‌టీ మిల్క్ వంటివి గతంలో 12, 5 శాతాల్లో ఉండగా ఇపుడు 5, సున్నా శాతాల్లోకి వచ్చాయి. బిస్కెట్లు, కేక్‌లు, పాస్తా, ఓట్స్, కార్న్‌ఫ్లేక్స్ వంటి బ్రేక్‌ఫాస్ట్ సిరెల్స్, చీజ్ పఫ్‌లు, పలు రకాల కన్ఫెక్షనరీ ఉత్పత్తులు గతంలో ఉన్న 18 నుంచి 5 శాతానికి దిగివస్తాయి. వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులైన షాంపూలు, తల నూనె, టూత్‌పేస్ట్, సబ్బులు చాలావరకూ గతంలో 18 శాతంలో ఉండగా ఇపుడు 5 శాతం పరిధిలోకి వచ్చాయి. ఆహార దినుసులతో పాటు శీతల పానీయాల పరిధిలోకి రాని జ్యూస్‌లు, మొక్కల ఆధారిత మిల్క్ డ్రింక్‌లు, పలురకాల డ్రైఫ్రూట్స్ గతంలో 12, 28 శాతాల్లో ఉండగా ఇపుడు 5 శాతానికి వచ్చాయి. చిన్న, మిడ్‌సైజ్ కార్లపై గతంలో ఉన్న 28 శాతం పన్నును 18 శాతానికి తగ్గించారు. వాహనాల ధర ఎక్కువ కనక ఈ పన్ను తగ్గింపు ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికే దాదాపు అన్ని కంపెనీలూ జీఎస్టీ సవరణకు అనుగుణంగా తమ ధరలు తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి.

32 అంగుళాలకు మించి ఉన్న టీవీలపై ఇప్పటి వరకు ఉన్న 28 శాతం జీఎస్టీ కాస్తా 18 శాతం కిందకు వచ్చింది. దీంతో వాటి మోడళ్ల ఆధారంగా రూ.2,500 నుంచి రూ.85,000 వరకు ధరలు తగ్గాయి. ప్రముఖ కంపెనీలు సోనీ, ఎల్‌జీ, ప్యానాసోనిక్ ఇప్పటికే కొత్త ధరలను ప్రకటించాయి. ఏసీలు, కొన్ని రకాల వాషింగ్ మెషీన్లపైనా జీఎస్టీ 28% నుంచి 18 శాతానికి తగ్గింది. నిర్మాణంలోకి వినియోగించే సిమెంట్, ఇతర బిల్డింగ్ మెటీరియల్స్‌పైనా జీఎస్టీ తగ్గించడమనేది ఇళ్ల మార్కెట్‌కు అనుకూలించనుంది.

**ముందు వరుసలో కార్ల కంపెనీలు...**

మారుతి సుజుకీలో ప్రారంభ శ్రేణి కార్లు అయిన ఎస్‌ప్రెస్సోపై రూ.1,29,600, ఆల్టో కే10పై రూ.1,07,600 వరకు ధర తగ్గింది. గ్రాంట్ విటారాపై రూ.1.07 లక్షలు, ఎక్స్‌ఎల్ 6పై రూ.52,000, ఎర్టిగాపై రూ.46,400 వరకు ధర తగ్గిస్తున్నట్టు కంపెనీ ప్రకటించింది. ఇతర అన్ని మోడళ్లపైనా ధరలు తగ్గాయి. టాటా మోటార్స్ తన పంచ్ ఎస్‌యూవీపై రూ. 85,000, నెక్సాన్‌పై రూ.1.55 లక్షల వరకు ధరలు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. కర్వ్‌పై రూ.65,000, హ్యారియ ర్, సఫారీ ధరలు రూ.1.45 లక్షల వరకు తగ్గాయి. మహీంద్రా అండ్ మహీంద్రా తన మోడళ్ల ధరలను గరిష్ఠంగా రూ.1.56 లక్షల వరకు తగ్గించింది. ఇందులో పాపులర్ మోడల్ బొలెరో ధర రూ.1.27 లక్షలు తగ్గింది. థార్ డీజిల్ వేరియంట్లపై రూ.1.35 లక్షల వరకు తగ్గింది. కియా కార్ల ధరలు రూ.4.48 లక్షల వరకు చౌక అవుతున్నాయి. మెర్సెడెస్ బెంజ్ తన విలాస కార్లు ఏ%–%క్లాస్‌పై రూ.2 లక్షల వరకు, ఎస్%–%క్లాస్‌పై రూ.10 లక్షల వరకు ధరలు తగ్గించింది. బీఎండబ్ల్యూ కార్ల ధరలు రూ.13.6 లక్షల మేర తగ్గాయి. జాగ్వార్ ల్యాండ్ రోవర్ వాహన ధరలు రూ.4.5%–%30.4 లక్షల మధ్య తగ్గాయి. హీరో మోటోకార్ప్ బైక్‌లు, స్కూటర్ల ధరలు రూ.15,743 వర కు, హోండా మోటార్ సైకిల్ వాహన ధరలు 350 సీసీలోపు ఉన్న వాటిపై రూ.18,800 వరకు తగ్గాయి.

**వీటిపై ఇక నో జీఎస్టీ**

జీవిత బీమా, ఆరోగ్య బీమాపై ఇప్పటి వరకు 18 శాతం జీఎస్టీ అమల్లో ఉండగా, పూర్తి మినహాయింపు ఇచ్చారు. దీంతో ఈ మేరకు పాలసీ ప్రీమియం ధరలు తగ్గుతాయి. జీవిత బీమా పాలసీల్లోనూ ఎన్నో రకాలున్నాయి. వీటిపై భిన్నమైన జీఎస్టీ అమలవుతోంది. టర్మ్ ఇన్సూరెన్స్‌పై 18 శాతం... ఎండోమెంట్ ప్లాన్లపై మొదటి ఏడాది 4.5 శాతం.. రెండో ఏడాది నుంచి 2.25 శాతం చొప్పున కాల వ్యవధి ముగిసే వరకు ప్రీమియంపై జీఎస్టీ చెల్లించాల్సి వచ్చేది. సింగిల్ ప్రీమియం పాలసీలపై 1.8 శాతం, యులిప్ ప్లాన్లపై (పెట్టుబడి భాగం కాకుండా, బీమా రక్షణ చార్జీలపైనే) 18 శాతం అమల్లో ఉంది. వీటన్నింటిపై జీఎస్టీ మినహాయింపు ఇచ్చారు. ఇకపై ఈ మేరకు ప్రీమియం భారం తగ్గుతుంది. కేన్సర్, జన్యు సంబంధిత, అరుదైన వ్యాధులు, గుండె జబ్బులకు వినియోగించే 33 ఔషధాలను జీఎస్టీ నుంచి మినహాయించారు. వీటికి తోడు 12 శాతం పరిధిలో ఉన్న పలు ఔషధాలను 5 శాతం శ్లాబుకు మార్చడంతో ఈ మేరకు ఉపశమనం లభించనుంది. గ్లూకో మీటర్లు, డయాగ్నోస్టిక్స్ కిట్లు కూడా 5 శాతం కిందకు మారాయి. ఈ మేరకు ఎంఆర్‌పీలను సవరించాలని, లేదంటే పాత ఎంఆర్‌పీ రేట్లపై తగ్గించి విక్రయించాలని (సెప్టెంబర్ 22 నుంచి) ఔషధ కంపెనీలను ప్రభుత్వం ఆదేశించింది.

# శక్తి సహితమే శివం - శక్తి రహితమే శవం

**ఘనంగా ఆర్ఎస్ఎస్ శత జయంతి ఉత్సవాలు ప్రారంభం**

**ప్రశాంత్ నగర్ బస్తీలో కన్నుల పండువగా విజయదశమి ఉత్సవం**



**శేరిలింగంపల్లి :** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) ఆవిర్భవించి 100 వసంతాలు పూర్తయిన సందర్భంగా శేరిలింగంపల్లి నగర్, ప్రశాంత్ నగర్ బస్తీలో శతజయంతి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారం విజయదశమి ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో సాహితీ విద్యాసంస్థల చైర్మన్ డిబి రావు ముఖ్యఅతిథిగా, వనవాసి కళ్యాణాశ్రమం ప్రాంత సహ కోశాధికారి తాడేపల్లి హనుమత్ ప్రసాద్ ముఖ్య వక్త గా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు భారతదేశం ఎన్నో దాడులను ఎదుర్కొని తట్టుకొని నిలబడగలిగిందని అన్నారు. స్వాతంత్రోద్యమ సమయంలో మనమంతా ఒక్కటిగా కలిసి పోరాటం చేసేలా సమిష్టి భావన పెంపొందించాలనే ఉద్దేశంతో 1925 లో డాక్టర్ హెడ్గేవార్ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్థాపించారని అన్నారు. నాటి నుండి నేటి వరకు ఎన్నో ఆటుపోట్లను, పరీక్షలను ఎదుర్కొని ఆర్ఎస్ఎస్ శత వసంతాలను పూర్తి చేసుకున్నదని అన్నారు. ఎక్కడ ప్రకృతి విపత్తులు సంబంవించినా మొదట సేవలో నిమగ్నమయ్యేది స్వయం సేవకులేనని అన్నారు. నాటి దివిసీమ ఉప్పెన ఐనా.. నిన్న మొన్నటి కరోనా విపత్కర పరిస్థితులైనా.. సంఘ కార్యకర్తలు సేవా కార్యక్రమాల్లో బాధ్యతగా వ్యవహరించారన్నారు. శక్తి సహితమే శివం శివం... శక్తి రహితమే శవం శవం... కాబట్టి అందరూ సంఘటితమై ఉండాలన్నారు. అందుకోసం ఐదు అంశాలపై సూచించారు. 1)కుటుంబ విలువలు కాపాడాలి. 2)స్వదేశీ వస్తువులను వాడాలి. 3)పర్యావరణ పరిరక్షణ. 4)పౌర విధులకు కట్టుబడటం. 5) సామాజిక సమరసత అంటే అంటరానితనాన్ని పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉత్సవంలో భాగంగా మొదట ఆయుధ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 100 మంది గణ వేష ధారి స్వయం సేవకులతో పాటు ఆదర్శనగర్ కాలనీవాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సెయింట్ జార్జ్ ఆర్థోడాక్స్ చర్చి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జీడిమెట్ల, చింతల్‌లోని సెయింట్ జార్జ్ ఆర్థోడాక్స్ చర్చి తన 25వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ జూబ్లీ వేడుకల్లో భాగంగా సమాజ శ్రేయస్సును ప్రోత్సహించే ఉద్దేశంతో ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్‌తో కలిసి ఉచిత వైద్య, రక్తదాన శిబిరాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి స్థానికుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. సుమారు 150 మందికి పైగా ఈ శిబిరంలో పాల్గొని ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ శిబిరంలో ఆరోగ్య పరీక్షలైన ఎత్తు, బరువు, బీఎంఐ, రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయి, హిమోగ్లోబిన్, పల్మనరీ ఫంక్షన్ టెస్ట్, దంత పరీక్షలు, ఈసీజీ వంటి అనేక రకాల పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. అంతేకాకుండా వైద్యులు ఉచిత వైద్య సలహాలు, సూచనలు ఇవ్వడమే కాకుండా ఉచిత మందులను కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన కార్యక్రమానికి కూడా భారీగా స్పందన లభించింది. అనేకమంది దాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేసి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగమయ్యారు. ఈ కార్యక్రమం చర్చి గత 25 సంవత్సరాలుగా సమాజానికి అందిస్తున్న సేవలను, నిబద్ధతను తెలియజేస్తుంది. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని చర్చి కమిటీ సభ్యులు తెలిపారు. ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ సమాజానికి అవసరమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడానికి తమ ప్రయత్నాలను కొనసాగిస్తామని పేర్కొంది. ఈ కార్యక్రమం ద్వార సమాజంలో సమిష్టి స్ఫూర్తిని, ఆరోగ్య సంరక్షణ పట్ల అవగాహనను పెంపొందించేందుకు దోహదపడిందన్నారు.

# నిలిచిపోనున్న బొగ్గు ఉత్పత్తి?



**మంచిర్యాల :** సింగరేణి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా శ్రీరాంపూర్ ఓసీపీ తీవ్ర సంక్షోభంలోకి వెళ్లనుంది. నెల రోజుల నుంచే మట్టి తవ్వకాలు, రవాణా(ఓవర్ బర్డెన్) పనులను సీఆర్ఆర్ సంస్థ నిలిపివేసింది. ఇదే ఓసీపీలో ఓవర్ బర్డెన్ పనులు చేసే మరో సంస్థ జీవీఆర్ కూడా పని చేయలేమంటూ నెల రోజుల ముందే సంస్థకు, పని చేసే కార్మికులకు నోటీసులు ఇచ్చింది. దీంతో అక్టోబర్ 1వ తేదీ నుంచి ఓసీపీలో రెండు కాంటాక్ట్ సంస్థలు మట్టి తవ్వకాలు చేసే పరిస్థితి కనిపించడం లేదు. రెండు సంస్థలు చేతులెత్తేయడంతో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయే ప్రమాదం నెలకున్నది. దీంతో అధికారులు మరో టెండర్‌కు డీపీఆర్ పూర్తి చేసి సింగరేణి యాజమాన్యానికి పంపించారు. ఆగమేఘాల మీద టెండర్ ప్రాసెస్ పూర్తి చేసి, అగ్రిమెంట్ చేసుకొని పనులు ప్రారంభించడానికి కనీసం నాలుగు నెలల సమయం పట్టనుంది. ఓసీపీలో ఇలా పూర్తిస్థాయి సంక్షోభం రావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

**తొలిసారి దెబ్బకొట్టిన రెండు టెండర్ల విధానం**

సింగరేణి వ్యాప్తంగా బొగ్గు దాదాపు 80 శాతం ఓసీపీల నుంచే వస్తున్నది. ఇందులో కాంటాక్ట్ సంస్థలు కీలక పాత్ర పోషిస్తూ వస్తున్నాయి. ఇలా ఓసీపీల్లో మట్టి తవ్వకాలు, రవాణా చేసేందుకు గతంలో ఒకే కాంటాక్ట్ సంస్థకు టెండర్ అప్పగించే వారు. ఒకవేళ ఆ ఒక్క సంస్థ పని చేయని పరిస్థితుల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగకుండా ఉండేందుకు యాజమాన్యం ప్రత్యామ్నాయంగా రెండు టెండర్ల విధానాన్ని అమలు చేస్తూ వస్తున్నది. దీంతో ఒక్కో ఓసీపీలో రెండేసి సంస్థలకు ఈ బాధ్యతలు అప్పగిస్తున్నారు. అంటే సింగరేణి వ్యాప్తంగా 20 ఓసీపీల్లో 40 కాంటాక్ట్ సంస్థలు మట్టి తవ్వకాలు, రవాణా చేస్తున్నాయి. దీంతో ఒక సంస్థ పనులు ఆపేసినా, రెండో సంస్థ ఆ పనులు చేస్తున్నది. శ్రీరాంపూర్ ఓసీపీలో తొలిసారి రెండు కాంటాక్ట్ సంస్థలు పని చేయలేమని చేతులు ఎత్తేయడంతో సంస్థకు తీవ్రమైన నష్టం వాటిల్లనుంది. ఇలాంటి పరిస్థితులు తలెత్తుతాయని యాజమాన్యం గ్రహించపోవడం, అనుభవం లేని సంస్థలకు టెండర్లు అప్పగించడం, మట్టి తవ్వకాలు, బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**తక్కువకు కోట్ చేయడంతోనే ఇబ్బందులు**

శ్రీరాంపూర్ ఓసీపీలో 722.75 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకాలు, రవాణా చేసేందుకు టెండర్ పిలిచారు. ఇందుకు రూ.332 కోట్లకు సీఆర్ఆర్ సంస్థతో అగ్రిమెంట్ చేసుకున్నారు. టెండర్ సమయంలో సింగరేణి యాజమాన్యం క్యూబిక్ మీటర్‌కు రూ.53 ధర ఆఫర్ చేయగా, సీఆర్ఆర్ సంస్థ మైనస్ కోడ్ చేస్తూ రూ.43కే క్యూబిక్ మీటర్ తవ్వేందుకని టెండర్ దక్కించుకుంది. గడిచిన ఐదు నెలల్లో సీఆర్ఆర్ సంస్థ 80 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకాలకు కేవలం 51 లక్షలు క్యూబిక్ మీటర్ల(63శాతమే) మట్టి తవ్వింది. టార్గెట్ చేరుకోకపోవడం, పనులు భారంగా మారడంతో దాదాపు రూ.40 కోట్లు నష్టపోయామని, ఇక మేము పనులు కొనసాగించలేమని ఆగస్టు 24వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో పనులు నిలిపివేసింది. జీవీఆర్ సంస్థ మూడేండ్ల కాలపరిమితికి 496 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకాలు, రవాణాకు సంస్థ ఆఫర్ చేసిన రేట్ రూ.49కి మైనస్ టెండర్ రూ.41లకు వేసి టెండర్ దక్కించుకున్నది. దీంతో ఏడాది కాలంగా నష్టాల్లోనే నెట్టుకొస్తున్నామని, అక్టోబర్ నుంచి పనులు చేయలేమంటూ యాజమాన్యంతో పాటు కార్మికులకు నోటీసులు జారీ చేసింది. ఈ రెండు సంస్థలకు గతంలో బొగ్గు పరిశ్రమల్లో పని చేసిన అనుభవం లేదు. తక్కువకు టెండర్ కోట్ చేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శ్రీరాంపూర్ ఓసీపీలో రోజు 20 వేల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకాలు, 12 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలి. ప్రస్తుతం రెండు సంస్థలు చేతులు ఎత్తేయడంతో యాజమాన్యమే ఆ పనులు చేపట్టాల్సిన దుస్థితి నెలకొన్నది. సింగరేణి సంస్థకు కేవలం బొగ్గు తీసి రవాణా చేసే సామగ్రి, మ్యాన్ పవర్ మాత్రమే ఉండడంతో ఎంత కష్టపడినా రోజుకు రెండు వేల టన్నుల నుంచి మూడు వేల టన్నుల బొగ్గు మాత్రమే తీయగలరు. అంటే ప్రతి రోజు 10 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి తక్కువ అవుతుంది. ఇలా నెల రోజులకు దాదాపు రూ.100 కోట్ల విలువైన బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం పడనున్నది. మూడో టెండర్ దక్కుంచుకొని కాంట్రాక్ట్ సంస్థ పనులు చేపట్టడానికి నాలుగు నుంచి ఐదు నెలలు పట్టొచ్చు. ఆ కాలానికి దాదాపు రూ.400 కోట్ల నుంచి రూ.500 కోట్ల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయే ప్రమాదం ఉంది. బొగ్గు ఉత్పత్తి తగ్గడంతోపాటు ఓసీపీలో పని చేస్తున్న సింగరేణి పర్మినెంట్ ఉద్యోగులు 800 మందిపై అదనపు పని ఒత్తిడి పడనుంది. ఇక ఆ పనులు చేయడం సాధ్యం కాని పరిస్థితుల్లో ఈ 800 మందికి పని లేకుండా పోయే అవకాశాలు లేకపోలేదు.

**కాంట్రాక్ట్ సంస్థలతో చర్చలు**

శ్రీరాంపూర్ ఓసీపీలో పనులు చేస్తున్న రెండు కాంటాక్ట్ సంస్థలు పనులు ఆపేయకుండా సింగరేణి యాజమాన్యం కొన్ని రోజులుగా చర్చలు జరుపుతున్నది. మూడో టెండర్ ఫైనల్ అయ్యే వరకైనా నాలుగైదు నెలలపాటు పనులు కొనసాగించాలని కోరుతున్నట్లు తెలిసింది. దానికి సదరు సంస్థలు అంగీకరించడం లేదని సమాచారం. మట్టి రవాణా చేసే వాహనాల డీజిల్ సింగరేణి సంస్థ భరిస్తే, పనులు చేసేందుకు కాంటాక్ట్ సంస్థలకు సానుకూలత తెలిపాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతోపాటు రోజు వారి లక్ష్యం మేరకు మట్టి తవ్వకాలు చేయని పక్షంలో ఫెనాల్టీ విధించి, బిల్లుల నుంచి కట్ చేస్తున్నారని అలా చేయొద్దని పట్టుపడుతున్నట్లు తెలిసింది. అలా చేస్తే మిగిలిన ఓసీపీల్లోని కాంట్రాక్ట్ సంస్థలు డీజిల్ బిల్లులు సంస్థనే భరించాలని ఒత్తిడి తెచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇక్కడ ఇచ్చి అక్కడ ఇవ్వకపోతే కోర్టుకు పోవచ్చు. అప్పుడు మొదటికే మోసం వస్తుందని యాజమాన్యం భావిస్తున్నట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో ఎలా ముందుకు వెళ్తారు. ఓసీపీలో ఉత్పత్తయ్యే బొగ్గుపైనే ఆధారపడిన ఎస్టీపీపీ వంటి సంస్థల పరిస్థితి ఏంటి? ఈ సంక్షోభాన్ని ఎలా పూరిస్తారన్నది వేచి చూడాలి.

**కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు పెండింగ్**

గత నెల 24వ తేదీ నుంచే మట్టి తవ్వకాలు, రవాణాను నిలిపివేసిన సీఆర్ఆర్ సంస్థ నాలుగు నెలలుగా 600 మంది కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదు. సుమారు రూ.5 కోట్లు కార్మికులకు వేతనాల రూపంలో చెల్లించాలి. దీని కోసం కొంత కాలంగా కార్మికులు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం శ్రీరాంపూర్ ఓసీపీపై దాదాపు 12 గంటలపాటు ధర్నా చేశారు. బొగ్గు రవాణా వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, సింగరేణి ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సోమవారం వేతనాలు ఇస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. సీఆర్ఆర్ సంస్థ జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి బిల్లులు పెట్టలేదని సింగరేణి అధికారులు అంటున్నారు. కార్మికులకు వేతనాలు ఇచ్చినట్లు జూన్ నెల నుంచి బిల్లులు పెట్టలేదని, అవి పెడితేనే బిల్లులు మంజూరు అవుతాయని చెబుతున్నారు. ఇప్పటికే మట్టితవ్వకాలపై చేతులెత్తేసిన సదరు సంస్థ.. పెనాల్టీల రూపంలో జరిగిన నష్టాన్ని పూడ్చుకునేందుకు కోర్టుకు వెళ్లేందుకు సిద్ధం అవున్నట్లు తెలిసింది. ఇలాంటి పరిస్థితుల్లో బిల్లులు రాకుండా కార్మికులకు వేతనాలు చెల్లించడం ప్రశ్నార్థకంగా మారింది.

## కాలనీల సమగ్రాభివృద్ధికి కృషి

**శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్**



**శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి డివిజన్ లోగల బాపూనగర్, గోపినగర్, ప్రశాంతి నగర్ కాలనీలలో స్థానిక వాసులతో కలిసి సీసీ రోడ్డు పనులను,పలు సమస్యలపై పాదయాత్ర చేసి పరిశీలించిన కార్పొరేటర్.అనంతరం బాపునగర్ లో పూర్తయిన నూతన సీసీ రోడ్డును ప్రారంభించారు. మిగిలిన అంతర్గత సిసి రోడ్లను స్థానికవాసులకు ఇబ్బంది కలగకుండా దసరా నవరాత్రులను దృష్టిలో పెట్టుకొని దుర్గా దేవి ఆలయం వద్ద త్వరితగతిన మిగిలిన డ్రైనేజీ పనులను పూర్తి చేసి సీసీ రోడ్డు పనులను పూర్తిచేయాలని అధికారులకు ఫోన్లో ఆదేశించారు.సీసీ రోడ్డు వేసేటప్పుడు నాణ్యతగా క్యూరింగ్ చేయాలని కాంట్రాక్టర్ కు సూచించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ గారు మాట్లాడుతూ... డివిజన్ లోని కాలనీల్లో, బస్తీల్లో నెలకొన్న సమస్యలు దశలవారీగా పరిష్కరిస్తున్నామని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాజీ పడే ప్రసక్తే లేదని అభివృద్ధి, ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రథమ కర్తవ్యం అని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, సుధాకర్ రెడ్డి, రవీందర్, శ్రీనివాస్, ముక్రమ్, నర్సింహా రెడ్డి, మల్లేష్, మహేష్, ప్రవీణ్, కృష్ణ, శ్రవణ్, సైదులు యాదవ్, ఇర్ఫాన్, ఆంజనేయులు, బిచ్చయ్య, ముంతాజ్ బేగం, అశోక్, శ్రీను, సాయి, శ్రీశైలం, కుమార్,సతీష్, రమేష్,అక్షయ్,ఖలీం, షైక్ రబ్బానీ,షైక్ ముహమ్మద్, నదీమ్ స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## మన్సురాబాద్ ప్రజలకు అండగా యువ నేత జక్కిడి రఘువీరారెడ్డి



**అబ్దుల్లాపూర్ మెట్టు :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లలోకి వరద నీరు చేరి మన్సురాబాద్ డివిజన్ లోని పలు కాలనీలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిస్థితిని తెలుసుకున్న మనసురాబాద్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ యువ నేత జక్కిడి రఘువీరారెడ్డి ఆయా కాలనీలో పర్యటించి వారికి ధైర్యాన్ని నూరి పోశారు. ఇళ్లలోకి నీరు చేయడంతో పెద్దలతో పాటుగా పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని, తాత్కాలికంగా వారిని మరో చోటికి పంపించారు, ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పేదలకు కొంత ఆర్థిక సాయం చేయడంతో పాటు, మరికొందరికి నిత్యావసర సరుకులను అందించారు.ఈ సందర్భంగా జక్కిడి రఘువీరారెడ్డి మాట్లాడుతూ తనను మీ కుటుంబ సభ్యుడి గానే భావించాలని అర్ధరాత్రి అయిన ఆపద వస్తే తనను కలుసుకోవడానికి సంకోచించవద్దన్నారు.మీ అందరి కష్టసుఖాల్లో పాలుపంచుకునేందుకే తాను ప్రజల్లోకి వస్తున్నానన్నారు. కొండంత భరోసా అందించిన జక్కిడి రఘువీరారెడ్డికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రతిభకు ప్రతీకలుగా నిలవాలి విద్యార్థులు ఎస్ఐ ప్రణయ్




**షాద్ నగర్:** విద్యార్థులు చదువుతోపాటు ప్రతిభకు ప్రతీకలుగా నిలవాలని షాద్ నగర్ ఎస్ఐ ప్రణయ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని యూనిక్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జిల్లాస్థాయి కుంగ్ ఫు కరాటే టోర్నమెంట్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రధానోత్సవం కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపల్ నరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సై ప్రణయ్ హాజరై విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కుంగ్ ఫు కరాటే ఆత్మరక్షణ తోపాటు శారీరక ధారుద్యం, మానసిక ఎదుగుదలకు, సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. నేటి ప్రస్తుత పరిస్థితుల్లో ఆత్మరక్షణ కోసం విద్యార్థినులకు కరాటే లాంటివి ఎంతగానో దోహదపడుతాయని వివరించారు. అదేవిధంగా విద్యార్థులు క్రమశిక్షణతో క్రమశిక్షణతో బాగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆయన పేర్కొన్నారు. చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలరాజ్ మాస్టర్, అహ్మద్ ఖాన్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు కృషి: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ



**కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ నియోజకవర్గానికి చెందిన ప్రజలు, కాలనీ సభ్యులు, నాయకులు పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు వారు సానుకూలంగా స్పందించారు. వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. గౌరవనీయులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టి అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు , ఎమ్మెల్యే కె.పి వివేకానంద దృష్టికి తీసుకెళ్లి వారి సహాయ సహకారాలతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



# ప్రాణాంతకంగా మారిన అమీబా

అదో సూక్ష్మజీవి. కంటికి కనిపించదు. చెవికి వినిపించదు. అసలు దాని ఉనికే మనిషికి తెలియదు. కానీ మనకు తెలియకుండానే మన శరీరంలోకి దూరి, మన మెదడులోకి ప్రవేశించి..కొంచెం కొంచెంగా మన బ్రెయిన్‌ను తినేస్తుంది. కొన్నిరోజుల్లోనే మనల్ని చంపేస్తుంది. అదో సూక్ష్మజీవి. కంటికి కనిపించదు. చెవికి వినిపించదు. అసలు దాని ఉనికే మనిషికి తెలియదు. కానీ మనకు తెలియకుండానే మన శరీరంలోకి దూరి, మన మెదడులోకి ప్రవేశించి..కొంచెం కొంచెంగా మన బ్రెయిన్‌ను తినేస్తుంది. కొన్నిరోజుల్లోనే మనల్ని చంపేస్తుంది. అంతటి డేంజర్ క్రిమి..ఇప్పుడు మన దేశాన్ని భయపెడుతోంది. అదే అమీబా. ఇప్పుడది కేరళను వణికిస్తోంది. మెదడును తినే పరాన్నజీవి అమీబా ఇన్ఫెక్షన్ అయిన అమీబిక్ మెనింగోఎన్సెఫాలిటిస్ అరుదైన వ్యాధి. మూడు నెలల శిశువు నుంచి 52 ఏళ్ల వ్యక్తి దాకా ఇలా 70 మంది ప్రాణాలను బలిగొంది. ఆగస్టు నెల కోజికోడ్ జిల్లాకు చెందిన ఓ బాలిక చికిత్స పొందుతూ చనిపోయింది. బ్రెయిన్? ఈటింగ్ అమీబాతోనే బాలిక చనిపోయిందని వైద్యులు నిర్ధారించారు. ఒక్కరితో మొదలైన వ్యాధి..70దాకా చేరింది. తాజాగా త్రిస్సూర్‌లోని చావక్కాడ్‌కు చెందిన రహీం (59). కోజికోడ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. ప్రాథమిక అమీబిక్ మెనింగోఎన్సెఫాలిటిస్ చాలా అరుదైన వ్యాధి. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 500 కంటే తక్కువ కేసులు నమోదయ్యాయి. అయితే, ఒక్క కేరళలోనే 120 కంటే ఎక్కువ కేసులు నమోదయ్యాయి. వాటిలో ఈ సంవత్సరం 70 కేసులు నమోదయ్యాయి. కలుషితమైన మంచినీటిని పీల్చినప్పుడు ఇన్ఫెక్షన్ సంభవిస్తుంది. దీనివల్ల అమీబా సైనస్‌ల ద్వారా మెదడుకు ప్రయాణించి కణజాలాన్ని నాశనం చేస్తుందంటున్నారు వైద్య నిపుణులు. అంటే నిద్రాణ దశ. వెచ్చని కొలనులు, స్విమ్మింగ్ పూల్‌లాంటి వాటిల్లో వృద్ధి చెందుతుంది. ఈ దశలో తిత్తి రూపంలో అంటే ఓసంచిగా ఉంటుంది. సిస్ట్ దశలో అమీబా గట్టి రక్షణ గోడను ఏర్పరచుకుని నిద్రాణ స్థితిలో ఉంటుంది. ఇది అమీబా సంక్రమణ దశ అంటారు. అంటే ఆహారం తీసుకునే దశ. వెచ్చని తాజా నీటి వాతావరణంలో సరస్సులు, నదులు, కొలనుల్లో అమీబా స్వేచ్ఛగా అమీబా కదులుతూ ఉంటుంది. బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, ఇతర సూక్ష్మజీవులను తిని జీవిస్తుంది. మానవులలో సంక్రమణకు కారణమయ్యే దశ ఇదే. ఈ దశలో అమీబా విభజన ద్వారా పునరుత్పత్తి చేస్తుంది. పర్యావరణంలో పోషకాలు తక్కువగా ఉన్నప్పుడు లేదా నీటి పరిస్థితులు మారినప్పుడు అమీబా ఈ దశకు రూపాంతరం చెందుతుంది. ఈ దశలో అమీబాకు రెండు ఫ్లాజెల్లా.. చలనానికి సహాయపడే తోకలాంటి నిర్మాణాలు) ఏర్పడతాయి, దీనితో నీటిలో స్వేచ్ఛగా ఈత కొడుతుంటుంది. ఈ దశ తాత్కాలికమైనది, అనుకూల పరిస్థితులు తిరిగి లభిస్తే ట్రోఫోజోయిట్ దశకు తిరిగి మారుతుంది. మనిషి మెదడులోకి అమీబా ప్రవేశించే ప్రక్రియ అంటే. చెరువులు, ఈతకొలనులు, అమీబా ఉన్న ప్లేసులో మనిషి ఈతకొట్టడం, నీటిలో మునిగితే ముక్కులో నుంచి అమీబా మన మెదడులోకి వెళ్తుంది. మనిషి మెదడులోకి ప్రవేశించి మన నాడీ వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తుంది. ఇది సోకిన కొన్ని రోజుల్లోనే మనిషి చనిపోతాడు. ఇంతటి డేంజర్ ఫంగస్ మనలోకి వెళ్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనదే. శుభ్రంగా లేని ఈతకొలనుల్లో అస్సలు దిగకూడదు. ఒక వేళ దిగినా తల మాత్రం ముంచకూడదని వైద్యులు సూచిస్తున్నారు. సో.. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందంటున్నారు వైద్యులు.

# నయా ట్రెండ్.. స్లీప్ టూరిజంకు పోతారా.. !

ఒంటరిగా ప్రపంచాన్ని చుట్టి రావాలనే కల ఎంతో మందిలో ఉంటుంది. అనేక సమస్యలు, మానసిక ప్రశాంతత కోసం ఇలా చాలా మంది పర్యటనలకు వెళ్తుంటారు. బాస్ ఇప్పుడు ట్రెండ్ మారింది తెలుసా.. ఏందా ట్రెండ్ అనుకుంటున్నారా.. ఒళ్లు మర్చిపోయి నిద్రపోవడం. నిజంగా ఈ జనరేషన్‌లో చాలా మందికి పని ఒత్తిడి, ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లతో కాలక్షేపం చేస్తూ సరైన నిద్ర పోవడం లేదు. మనిషికి మంచి నిద్ర లేకపోతే తలెత్తే అనారోగ్య సమస్యలు తెలిసినా కూడా ఎలక్ట్రానిక్ పరికరాల మోజులో పడి నిద్రను త్యాగం చేస్తున్నారు. ఇగో వీటిని దృష్టిలో పెట్టుకొని వచ్చేందే..'స్లీప్ టూరిజం'. ప్రస్తుతం దీనికి ప్రాధాన్యం పెరుగుతోంది. టూరిజం అంటే సాధారణంగా కొత్త ప్రదేశాలు వెళ్లడం, చూడటంగా భావిస్తాం. కానీ స్లీప్ టూరిజం మాత్రం ప్రత్యేకం. ఈ టూరిజంలో శరీరానికి, మనసుకీ ప్రశాంతమైన నిద్రను అందించడమే దీన్ని ముఖ్య ఉద్దేశం. తాజా ఈ టూరిజం ప్రపంచ వ్యాప్తంగా సరికొత్త పరిశ్రమగా ఎదుగుతోంది. భవిష్యత్తులో ఈ టూరిజం బిలియన్ డాలర్ల వ్యాపారంగా మారుతుందంటున్నారు నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



స్లీప్ టూరిజం అంటే నిద్ర కోసం ప్రత్యేకంగా పర్యటనలకు వెళ్లడం. పనిలో ఒత్తిడి, అలసట బాధపడుతున్న వారు కొత్త ప్రాంతాలకు వెళ్లి విశ్రాంతి తీసుకోవడంతో పాటు మనసారా నిద్ర పోవడమే ఈ పర్యటకం ప్రత్యేకత. దీన్ని 'నాప్?కేషన్స్' లేదా 'డ్రీమ్ టూరిజం' అని కూడా అంటున్నారు. ఇప్పటికే అమెరికా, జపాన్, దుబాయ్, యూరప్ లాంటి ప్రాంతాల్లో ప్రత్యేకమైన 'స్లీప్ హోటల్స్' ఉన్నాయి. ఇప్పుడు మన దేశంలోనూ ఈ పద్ధతి క్రమంగా వ్యాప్తి చెందుతోంది. ముఖ్యంగా ఈ ట్రెండ్‌ను హిమాలయ ప్రాంతాలు, కేరళలోని ఆయుర్వేద రిసార్ట్‌లు, గోవా బీచ్ రిసార్ట్‌లలో అనుసరిస్తున్నారు. ఈ క్రమంలో ప్రత్యేకమైన ఆయుర్వేద మసాజ్‌లు, హెర్బల్ థెరపీ, యోగా, ధ్యానం ద్వారా సహజ నిద్రను కలిగించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇండియన్ జర్నల్ ఆఫ్ స్లీప్ మెడికన్ నివేదికలో పలు సంచలన నివేదికలు వెలుగుచూశాయి.. మన దేశంలో 61 శాతం మంది రోజుకు ఏడు గంటల కంటే తక్కువ సమయం నిద్రపోతున్నారని ఈ నివేదిక పేర్కొంది. పలు అధ్యయనాల్లో.. ప్రతి 10 మందిలో ముగ్గురు కంటే తక్కువ మంది మాత్రమే సాధారణ నిద్రపోతున్నారని వెల్లడైంది. చాలా మంది రోజులో ఆరు గంటలు కూడా నిద్ర పోవడం లేదని పేర్కొంటున్నాయి. ఈసందర్భంగా పలువురు నిపుణులు మాట్లాడుతూ.. రోజువారీ కార్యకలాపాలు, పనిలో ఒత్తిడితో పోరాటం, కుటుంబం ఆర్థిక భారం వల్ల కలిగే మానసిక ఒత్తిడిని నివారించుకోవడానికి ఈ స్లీప్ టూరిజం దోహదం చేస్తుందంటున్నారు. కొత్త ప్రాంతాల పర్యటనకు వెళ్లి, అక్కడ విశ్రాంతితో పాటు హాయిగా నిద్రపోయేందుకు ప్రాధాన్యం ఇవ్వాలంటున్నారు. మన దేశంలో స్లీప్ టూరిజంకు ఉత్తరాఖండ్?లోని రుషికేష్, బ్యాక్ వాటర్.. హౌజ్?బోటులకు ప్రసిద్ధి చెందిన కేరళలోని అలెప్పీ, పచ్చని కాఫీ తోటలు, పొగమంచు కొండలు, ప్రశాంత వాతావరణాన్ని కలిగిన కర్ణాటక లోని కూర్గ్, గోవా, కర్ణాటకలోని గోకర్ణలో ప్రశాంతంగా ఉండే బీచ్‌లు అనువైనవి. అలాగే హిమాచల్‌ప్రదేశ్‌లోని స్పితిలోయ, తీర్థన్ వ్యాలీ, గ్రేటర్ హిమాలయన్ నేషనల్ పార్కు మొదలైనవి స్లీప్?టూరిజంకు అనువుగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో హాయిగా నిద్రపోయేందుకు ప్రత్యేకంగా తయారు చేసిన సౌకర్యవంతమైన మంచాలు, నిద్ర నాణ్యతను మెరుగుపరిచే లైటింగ్ సిస్టమ్, నిద్ర నిపుణుల ద్వారా శిక్షణ, ప్రత్యేక సౌండ్ ప్రూఫ్ గదులను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

# పిల్లలతో మొబైల్ వాడకం తగ్గించే టిప్స్



ఇప్పుడు మన రోజువారీ జీవితం పూర్తిగా మారిపోయింది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి వయసులో మొబైల్ ఫోన్లను ఉపయోగిస్తున్నారు. మొబైల్ ఫోన్లు ఒక వైపు సౌకర్యం, వినోదం, విద్యా సాధనంగా మారినప్పటికీ, చిన్న వయసులో పిల్లలు ఎక్కువ సేపు వాటిని ఉపయోగించడం పెద్ద సమస్యలకు కారణం అవుతోంది. నిద్రలో అంతరాయం, కళ్ళు బలహీనపడటం, దృష్టి సమస్యలు, శారీరక వ్యాయామం లోపం, సామాజిక పరస్పర సంబంధాలు తగ్గడం వంటి సమస్యలు పిల్లలపై నేరుగా ప్రభావం చూపుతున్నాయి. తల్లిదండ్రులు, పెంపకంలో భాగంగా పిల్లల డిజిటల్ వినియోగాన్ని సమతుల్యం చేయడం ఎంతో అవసరం. కానీ ఇది సులభం కాదు, ఎందుకంటే పిల్లలు మొబైల్ ఫోన్ లో గేమ్స్, యూట్యూబ్ వీడియోలు, సోషల్ మీడియా వంటి విషయాలతో వెంటనే ఆకర్షితులు అవుతారు. ఇలాంటి సందర్భాల్లో, సరైన మార్గదర్శకత, క్రమమైన షెడ్యూలింగ్, సరైన ప్రేరణ వంటివి తీసుకుంటే పిల్లలు మొబైల్ వాడకాన్ని తగ్గించడంలో సక్సెస్ సాధించవచ్చు.

1. ఆటలతో ఆకట్టుకోండి: పిల్లలు సహజంగా ఎగురుతూ, కదులుతూ, ఆటలలో నిమగ్నమవడం ఇష్టపడతారు. కాబట్టి మొబైల్ ఫోన్లను వదలిపెట్టి, వారిని క్రికెట్, ఫుట్‌బాల్, సైక్లింగ్, వాలీబాల్ వంటి ఆటలలో పాల్గొనమని ప్రోత్సాహించండి. ఆటలు కేవలం వినోదం మాత్రమే కాదు, పిల్లల శారీరక దృఢత్వం, దృష్టి సామర్థ్యం, సమన్వయ కౌశల్యం ను కూడా పెంపొందిస్తాయి. పిల్లలని ఆటల్లో పాల్గొనమని ప్రోత్సహించడం ద్వారా, వారి మనసు మొబైల్ నుండి దూరమవుతుంది. ఉదాహరణకు, రోజు స్కూల్ తర్వాత 30–45 నిమిషాలు సైక్లింగ్ లేదా ఇంటి ప్రాంగణంలో బాస్కెట్‌బాల్ ఆడటానికి ప్రోత్సహిస్తే, వారి శారీరక వ్యాయామం కూడా పూర్తవుతుంది మరియు ఆరోగ్యకరమైన అలవాట్లు ఏర్పడతాయి.ఇలా చిన్న వయసులోనే ఆరోగ్యకరమైన, క్రియాశీలమైన జీవనశైలి కు వారిని అలవర్చించడం, వృద్ధాప్యం వరకు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మేలు చేస్తుంది.
2. పరిష్కార ఆధారిత రివార్డ్స్: పిల్లలు మొబైల్ వాడకం కోసం సహజంగా ఎక్కువ ఉత్సాహం చూపుతారు. కాబట్టి మొబైల్‌ను ఒక రివార్డ్ గా మార్చడం చాలా ప్రభావవంతమైన పద్ధతి. ఉదాహరణకు, హోంవర్క్, పాఠాలు, లేదా ఏదైనా బాధ్యతా పనిని పూర్తిగా చేసిన తర్వాతే మొబైల్ వాడడానికి అనుమతించండి. ఇది పిల్లలకు ప్రతిదానికి ఒక ప్రతిఫలాన్ని పొందడం అనే భావనను నేర్పిస్తుంది. అలా చేస్తే, మొబైల్ ఉపయోగం అలవాటుగా కాకుండా, ఒక ప్రోత్సాహకం గా మారుతుంది. పిల్లలు పని పూర్తి చేయడంలో ఉత్సాహం చూపిస్తారు, సమయపాలన మరియు దయార్థత కూడా పెరుగుతుంది. అలాగే, ఈ విధానం వల్ల వెర్సెస్ వ్యసనపు ఉపయోగం తగ్గుతుంది. కేవలం సరదాగా లేదా అనవసరంగా ఫోన్లో గడపడం కాకుండా, మొబైల్ ఉపయోగం ఒక సాధనమని భావిస్తారు. ఈ సరళమైన నియమాన్ని పిల్లల వయసుకు అనుగుణంగా అమలు చేస్తే, వారి ఆత్మ నిబంధన అభివృద్ధి అవుతుంది.
3. కుటుంబతో సమయం: పిల్లల మొబైల్ వాడకాన్ని తగ్గించడంలో కుటుంబంతో సమయం గడపడం అత్యంత ప్రభావవంతమైన మార్గం. ప్రతి రోజు కొంత సమయాన్ని పిల్లలతో ఆటలు ఆడడం, నేరుగా మాట్లాడటం, లేదా సృజనాత్మక యాక్టివిటీల్లో పాల్గొనడం కోసం వెచ్చించండి. ఈ విధంగా, పిల్లలు మొబైల్‌కు బదులుగా కుటుంబంతో గడిపే సమయాన్ని ఆస్వాదించగలరు. ఇది వారి సామాజిక మరియు భావోద్వేగపరమైన అభివృద్ధికి కూడా సహాయపడుతుంది.

# బిచ్చగాడిని కోటీశ్వరుడిగా మార్చే రత్నం..!



మత విశ్వాసం ప్రకారం, రత్నాలు ధరించడం వల్ల ఒక వ్యక్తి జాతకంలో గ్రహాల ప్రతికూల ప్రభావాలు తగ్గుతాయని నమ్ముతారు. ఈ రత్నాలు కెరీర్, వైవాహిక, ఆర్థిక, ఆరోగ్య సంబంధిత సమస్యలను అధిగమించడంలో సహాయపడతాయని విశ్వసిస్తారు. జీవితంలోని ప్రతి అంశంలో విజయాన్ని అందిస్తాయని చాలా మంది నమ్మకం. రత్నశాస్త్రం ప్రకారం, ఒకరి రాశి మేరకు రత్నం ధరించడం వల్ల జీవితంపై అనేక సానుకూల ప్రభావాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. కొన్నిసార్లు, రత్నాలు కూడా హానికరం. అశుభ గ్రహాలతో సంబంధం ఉన్న రత్నాలను ధరించడం ఎల్లప్పుడూ హానికరం అని జ్యోతిష్యా, రత్నశాస్త్ర నిపుణులు చెబుతున్నారు. ఒక జ్యోతిష్కుడు వైద్యుడు అయితే, రత్నాలు వారికి ఔషధం. సరైన రత్నాలను ఎంచుకుంటే రత్నాలను ధరించడం వల్ల ఆ వ్యక్తి విధిని మార్చగలదు అంటారు. సరైన, అనుకూలమైన రత్నాలను ధరించడం అమృతం వలె ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే తప్పుడు రత్నాలు ధరించడం విషం లాంటిదని చెబుతున్నారు. అందుకే, రత్నాన్ని ధరించే ముందు తప్పనిసరిగా దాని నిపుణులను సంప్రదించాలని సూచిస్తున్నారు. మేష రాశి వారు వజ్రం ధరించాలి. ఈ రత్నం నాయకత్వ లక్షణాలను, ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని పెంచుతుంది. ఇది బలం, స్పష్టతకు చిహ్నంగా పరిగణించబడుతుంది. వృషభ రాశి: వృషభ రాశిలో జన్మించిన వ్యక్తులు పచ్చను ధరించాలి. ఈ రత్నం జీవితంలో ఆనందాన్ని, పురోగతికి అనేక అవకాశాలను తెస్తుంది. ఈ రత్నాన్ని ధరించడం వల్ల ప్రేమ, స్థిరత్వం మరియు సహనం పెరుగుతాయి.మిథున రాశి: మిథున రాశి వారు అగేట్ రత్నం ధరించడం వల్ల ప్రయోజనం పొందుతారు. ఇది కమ్యూనికేషన్, అనుకూలత, తెలివితేటలను పెంచుతుంది. కర్కాటక రాశి వారికి చంద్రకాంతి చాలా అదృష్ట రత్నం. ఈ రత్నం వ్యక్తిని మానసికంగా బలపరుస్తుంది. వారి కరుణా స్వభావానికి మద్దతు ఇస్తుంది. సింహం: సింహ రాశి వారు రూబీ ధరించాలి. దీనిని ధైర్యం, ఉత్సాహం, అభిరుచికి చిహ్నంగా భావిస్తారు. రూబీ ఒక వ్యక్తి నాయకత్వ లక్షణాలను పెంచుతుంది. వారిని విజయానికి నడిపిస్తుంది. కన్య: కన్య రాశి వారు నీలమణిని ధరించాలి. ఈ రత్నం జ్ఞానం, మానసిక స్పష్టతకు చిహ్నంగా పరిగణించబడుతుంది. తుల: తుల రాశి వారు ఒపల్ రత్నాన్ని ధరించాలి. దీనిని ప్రేమ, ఆప్యాయత, సృజనాత్మకతకు చిహ్నంగా భావిస్తారు. ఇది తుల రాశి వారి దౌత్య లక్షణాలను పెంచుతుంది. సంబంధాలలో సమతుల్యత కోసం కృషి చేయడానికి వారికి సహాయపడుతుంది. వృశ్చిక రాశి: వృశ్చిక రాశి వారు గోమేదికం రత్నాన్ని ధరించడం ద్వారా శుభ ఫలితాలను పొందుతారు. దీనిని బలం, అభిరుచి, పరివర్తనకు చిహ్నంగా భావిస్తారు. ధనుస్సు: ధనుస్సు రాశి వారు నీలమణిని ధరించాలి. ఇది ఒక వ్యక్తిలో సత్యం, జ్ఞానం, నిజాయితీ లక్షణాలను పెంచుతుంది. ఇది వారిని ఆశావాదంగా మారుస్తుంది. అన్వేషించడానికి ధైర్యాన్ని ఇస్తుంది. మకరం: మకర రాశి వారు జామునియా రత్నాన్ని ధరించడం వల్ల ఎంతో ప్రయోజనం పొందుతారు. ఈ రత్నం దృష్టి, స్పష్టత, వృద్ధిని సూచిస్తుంది.కుంభ రాశి: కుంభ రాశి వారు నీలమణి రత్నాన్ని ధరించాలి. ఈ రత్నం కమ్యూనికేషన్, ఆవిష్కరణలను సూచిస్తుంది. ఇది ఒకరి ఆలోచనను మెరుగుపరుస్తుంది. మీనం : మీన రాశి వారు పచ్చ రాయిని ధరించాలి. ఇది జీవితంలో ఆనందం, శాంతి, భద్రతకు చిహ్నంగా పరిగణించబడుతుంది. పచ్చ రాయిని ధరించడం వల్ల మనశ్శాంతి లభిస్తుంది. మీరు మానసికంగా బలంగా ఉంటారు.

బిజినెస్ వాయిస్

# అమెరికాకు తిరిగి వచ్చేయండి

హెచ్-1బీ వీసా విషయంలో ట్రంప్ తాజా నిర్ణయంతో టెక్ కంపెనీలు అప్రమత్తమయ్యాయి. మైక్రోసాఫ్ట్ మెటా వంటి ప్రధాన ఐటీ సంస్థలు తమ ఉద్యోగులకు కీలక అడ్వైజరీ జారీ చేశాయి. %ఎ-1డీ% వీసాదారులందరూ కనీసం 14 రోజుల పాటూ అమెరికాను విడిచి వెళ్లొద్దని సూచించాయి. ప్రస్తుతం అమెరికా వెలుపల ఉన్న ఉద్యోగులు 24 గంటల్లోపు తిరిగి యూఎస్‌కు రావాలని ఆదేశించాయి. అమెరికాలో తమ భవిష్యత్తు కోసం విదేశీ ఉద్యోగులు ఈ ఆదేశాలను పాటించాలని కోరాయి. ఈ మేరకు ఉద్యోగులకు ఆయా సంస్థలు అంతర్గత మెయిల్స్ పంపినట్లు తెలిసింది. హెచ్-1బీ, హెచ్-4 వీసాదారులు 24 గంటల్లోపు అంటే సెప్టెంబర్ 21 లోపు ఆలస్యం చేయకుండా అమెరికాకు తిరిగి వచ్చేయాలని మెటా, మైక్రోసాఫ్ట్ సంస్థలు ఆదేశించాయి. అమెరికాలో ఉద్యోగం చేయాలనుకునే వారికి డొనాల్డ్ ట్రంప్ భారీ షాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. విదేశీ నిపుణుల నియామకానికి జారీ చేసే హెచ్-1బీ వీసా దరఖాస్తులపై వార్షిక రుసుంను లక్ష డాలర్లకు పెంచారు. ఈ మేరకు కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేశారు. ఈ నిర్ణయంతో అమెరికా వేదికగా పనిచేస్తున్న కంపెనీలు విదేశీ నిపుణులను




నియమించుకునేందుకు జారీ చేసే ఒక్కొక్క వీసాపై ఇకపై ఏడాదికి లక్ష డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. చెల్లింపులకు కంపెనీలు సిద్ధంగా లేనట్లయితే వర్క్ వీసాపై వెళ్లేవారు ఇంటి ముఖం పట్టాల్సిందే. దీని ప్రభావం భారతీయ వృత్తి నిపుణులు, నైపుణ్యం కలిగిన చైనా కార్మికులపై ఆధారపడే టెక్ రంగంపై అధికంగా ఉండనుంది. అదేవిధంగా అగ్రరాజ్యంలో మాస్టర్స్ ప్రోగ్రామ్ చేయాలను కునే భారతీయుల ఆశలు ఆవిరయ్యే ప్రమాదం ఉన్నది. అమెరికాలో కార్యకలాపాలు సాగిస్తున్న పలు టెక్ కంపెనీలకు ట్రంప్ నిర్ణయం పెద్ద దెబ్బే అని చెప్పాలి. ఎందుకంటే.. భారత్‌కు చెందిన పలు దిగ్గజ సంస్థలు ఎక్కువగా హెచ్-1బీ వీసాలతోనే అమెరికాలో తమ వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఈ వీసాలతోనే భారతీయుల్ని నియమిం చుకుంటున్నాయి. ఇందులో అమెజాన్ సంస్థ టాప్‌లో ఉంది. ఆ తర్వాత టాటా కన్సల్టెన్సీ రెండోస్థానంలో నిలిచింది. యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ డేటా ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరం జూన్ నాటికి అమెజాన్ దాదాపు 10,044 హెచ్-1బీ వీసాలను ఉపయోగించింది. ఆ తర్వాత టీసీఎస్ 5,505, మైక్రోసాఫ్ట్ (5,189), మెటా (5,123), యాపిల్ (4,202), గూగుల్ (4,181), డెలాయిట్ (2,353), ఇన్ఫోసిస్ (2,004), విప్రో (1,523), టెక్ మహీంద్రా అమెరికాస్ (951), ఒరాకిల్ (2,092), అమెజాన్ వెబ్ సర్వీసెస్ (2,347), కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ (2,493), వాల్‌మార్ట్ అసోసియేట్స్ (2,390) హెచ్-1బీ వీసాలను దక్కించుకున్నాయి. ఇవే కాకుండా అమెరికాకు చెందిన పలు కంపెనీలు కూడా హెచ్-1బీ వీసాలతో ఎక్కువమంది భారతీయులను నియమించుకుం టున్నాయి. వాటిపై కూడా తీవ్ర ప్రభావం పడనుంది.

## బంగారం ధర పెరిగినా.. డిమాండ్ తగ్గదు!



భారతీయులకు బంగారంపై మక్కువ కొంత ఎక్కువే. ఈ కారణంగానే పెళ్లిళ్లకు, పండుగలకు గోల్డ్ కొనేస్తూ ఉంటారు. దీంతో ఇండియా ప్రపంచంలోనే అతిపెద్ద బంగారం వినియోగదారులలో ఒకటిగా అవతరించింది. భారతీయ కుటుంబాలు సుమారు 24,000 టన్నుల బంగారాన్ని కలిగి ఉన్నట్లు అంచనా. ఇది ప్రపంచ కేంద్ర బ్యాంకుల మొత్తం బంగారం నిల్వల కంటే ఎక్కువ. అయితే ప్రస్తుతం ధరలు భారీగా పెరిగాయి?. రాబోయి దసరా, దీపావళి సమయంలో పసిడి కొనుగోళ్లు ఎలా ఉండబోతున్నాయనే విషయాన్ని నిపుణులు అంచనా వేశారు. భారతదేశంలో పండుగ సీజన్ మొదలైంది. బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరాయి. ప్రస్తుతం ఇండియన్ మార్కెట్లో ఒక గ్రామ్ 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 11,000 దాటింది. కాగా గత సంవత్సరం ఇదే సమయంలో.. బంగారం ధర రూ.7,500 మాత్రమే!. దీన్ని బట్టి చూస్తే 12 నెలల్లో పసిడి ధర ఎంతలా పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. మనదేశంలో మొదటిసారి 10 గ్రాముల బంగారం ధరలు లక్ష రూపాయలు దాటేసింది. ధర ఎంత పెరిగినా.. పండుగ సీజన్లో బంగారానికి డిమాండ్ పెరిగే సంకేతం ఉందని 'వరల్డ్ గోల్డ్ కౌన్సిల్' వెల్లడించింది. సెప్టెంబర్ 22 నుంచి జీఎస్టీ సంస్కరణలు అమలులోకి రానున్నాయి. ఇది ప్రజల బడ్జెట్‌లో కొంత మిగులును మిగిల్చే అవకాశం ఉంది. ఈ మిగులు బడ్జెట్ బంగారం కొనుగోలుకు దారితీసే అవకాశం ఉంది. బంగారం ధరలకు పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఇందులో రష్యా ఉక్రెయిన్ యుద్ధం, ఇరాన్-ఇజ్రాయెల్-పాలస్తీనా మధ్య మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, భౌగోళిక రాజకీయాలు కొంత అస్తవ్యస్తంగా మారడం వల్ల.. ప్రపంచ దేశాల్లో భయం, అనిశ్చితి ఏర్పడింది. దీంతో కేంద్ర బ్యాంకులు మరింత బంగారం కొనుగోలు చేయడం ఆరంభించాయి. ట్రంప్ సుంకాలు ప్రకటించిన తరువాత బంగారం ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పెట్టుబడిదారులు బంగారంపై ఇన్వెస్ట్ చేయడం మొదలుపెట్టారు. దీంతో గోల్డ్ కొనుగోలుచేసేవారి సంఖ్య కూడా పెరిగింది. ఓ వైపు శ్రావణమాసం.. మరోవైపు వస్తున్న పండుగ సీజన్. ఇవన్నీ కూడా బంగారం ధరలను మరింత పెంచేసాయి.

## 23 నుంచి ట్రూ కలర్స్ ఐపీఓ.. షేర్ల ధరలు ఎంతంటే..




**ముంబై:** డిజిటల్ టెక్స్‌టైల్ ప్రింటర్ల దిగుమతి, పంపిణీదారు ట్రూ కలర్స్ కంపెనీ ఐపీఓకి సిద్ధమైంది. మార్కెట్ నుంచి రూ.128 కోట్లు సమీకరించనుంది. ఇందుకు ధరల శ్రేణి రూ.181%-%191గా నిర్ణయించింది. సబ్‌స్క్రిప్షన్ మంగళవారం (సెప్టెంబర్ 23న) ప్రారంభమై... గురువారం ముగిస్తుంది. యాంకర్ ఇన్వె స్టర్లకు సెప్టెంబర్ 22నే బిడ్డింగ్ విండో తెరుచుకోనుంది. సమీకరించిన నిధుల్లో మూలధన అవసరాలకు రూ.48.90 కోట్లు, రుణ చెల్లింపులకు రూ.40.40 కోట్లు మిగిలిన ధనాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు కంపెనీ వినియోగించనుంది. జీవైఆర్ క్యాపిటల్ అడ్వైజర్స్ బుకింగ్ రన్నింగ్ మేనేజర్‌గా, బిగ్‌షేర్ సర్వీసెస్ రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్నాయి. 2021 అక్టోబర్‌లో ఏర్పాటైన ట్రూ కలర్స్ సంస్థ కోనికా మినోల్టా, హెూప్‌టెక్, ఐటెన్, పెంగ్డా, స్కైజెట్ వంటి బ్రాండ్ల నుండి డిజిటల్ టెక్స్‌టైల్ ప్రింటర్లను దిగుమతి చేసుకొని పంపిణీ చేస్తోంది.

## ఎస్ఎస్ఈలో మరిన్ని ట్రస్ట్‌లకు చోటు

సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజీ(ఎస్ఎస్ఈ) ప్లాట్‌ఫామ్‌ను మరింత విస్తృతపరిచేందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా నిర్ణయించింది. దీనిలో భాగంగా ఎస్ఎస్ఈ ద్వారా నిధుల సమీకరణకు మరిన్ని చారిటబుల్ ట్రస్ట్‌లను అనుమతించనుంది. ఈ బాటలో లిస్టింగ్ పరిధిని పెంచుతూ సర్క్యులర్‌ను జారీ చేసింది. ఇందుకు లాభాపేక్షలేని సంస్థ(ఎన్‌పీవో)ల నిర్వచనాన్ని విస్తృతం చేసింది. దీంతో ఎస్ఎస్ఈ లిస్టింగ్ పరిధిలోకి మరిన్ని సంస్థలు




చేరనున్నాయి. ఇందుకు అనుగుణంగా 1908 ఇండియన్ రిజిస్ట్రేషన్ చట్టం, సంబంధిత రాష్ట్ర సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం, 1956 కంపెనీల చట్టంలో భాగంగా సెక్షన్ 25కింద రిజిస్టరైన కంపెనీలను తాజా మార్గదర్శకాలలోకి చేర్చింది. అయితే ఈ సంస్థల జవాబుదారీతనాన్ని పెంచుతూ సంబంధిత నిబంధనలను సైతం ప్రకటించింది. ఎలాంటి సెక్యూరిటీలను లిస్ట్‌చేయని ఎన్‌పీవోలు ఏఐఆర్ నివేదికను సొంతంగా రూపొందించి దాఖలు చేయవలసి ఉంటుంది. తద్వారా ఎన్‌పీవో ప్రధాన కార్యకలాపాలతోపాటు ఏడాది పొడవునా చేపట్టిన ప్రోగ్రామ్‌లు, మధ్యవర్తిత్వాలు, ప్రాజెక్టులను వివరణలతో తెలియజేయవలసి ఉంటుంది. ఆయా సంస్థల ప్రాధాన్యతను గుర్తించేలా వీటిని రూపొందించవలసి ఉంటుంది.

## పాక్‌తో పోరు.. ఆ ఇద్దరిపై వేటు!..

# భారత తుదిజట్టు ఇదే!

ఆసియా కప్ టీ20-2025 టోర్నమెంట్లో అసలైన పోటీ మొదలైంది. లీగ్ దశలో సత్తా చాటిన టీమిండియా, శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్తాన్ సూపర్-4కు అర్హత సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో టైటిల్ వేటలో భాగంగా బంగ్లా- లంక మధ్య శనివారం జరిగిన మ్యాచ్‌లో.. బంగ్లాదేశ్ సంచలన విజయం సాధించింది.

**బంగ్లా సంచలన విజయంతో**

ఆఖరి వరకు పట్టువదలకుండా పోరాడి.. శ్రీలంకను నాలుగు వికెట్ల తేడాతో ఓడించి.. ముందంజ వేసింది. ఇక ఆదివారం (సెప్టెంబరు 21) నాటి మ్యాచ్‌లో భాగంగా చిరకాల ప్రత్యర్థులు భారత్- పాకిస్తాన్ తలపడనున్నాయి. దుబాయ్‌లో జరిగే ఈ మ్యాచ్‌లో భారత తుదిజట్టులో కీలక మార్పు జరిగే అవకాశం ఉంది.

**బుమ్రా రీఎంట్రీ.. ఆ ఇద్దరిపై వేటు**

లీగ్ దశలో ఆఖరిగా ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో విశ్రాంతి తీసుకున్న ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా రీఎంట్రీ ఇవ్వడం లాంఛనమే. అదే విధంగా స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కూడా తిరిగి జట్టులోకి రానున్నాడు. ఈ క్రమంలో యువ పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణాలపై వేటు పడే అవకాశాలు ఉన్నాయి.

**అక్షర్ దూరమైతే మాత్రం**

అయితే, ఒమన్‌తో మ్యాచ్ సందర్భంగా ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ గాయపడిన విషయం తెలిసిందే. క్యాచ్ అందుకునే క్రమంలో కిందపడిన




అక్షర్ తల మైదానాన్ని బలంగా కొట్టుకోవడంతో.. అతడు గ్రౌండ్ వీడి వెళ్లిపోయాడు. ఆ తర్వాత కూడా మళ్లీ ఫీల్డింగ్‌కు రాలేదు. ఈ నేపథ్యంలో పాక్‌తో మ్యాచ్‌కు అక్షర్ దూరమయ్యే అవకాశం ఉంది. అదే జరిగితే అర్ష్‌దీప్ లేదంటే హర్షిత్‌లలో ఒకరు తమ స్థానాన్ని నిలబెట్టుకునే అవకాశం ఉంటుంది. అంతర్జాతీయ టీ20 ఫార్మాట్‌లో టీమిండియా తరఫున వంద వికెట్ల క్లబ్‌లో చేరిన అర్ష్ వైపు మేనేజ్‌మెంట్ మొగ్గుచూపుతుందా?.. లేదంటే హెడ్‌కోచ్ గౌతం గంభీర్ ప్రియ శిష్యుడు హర్షిత్‌కు ఓటు వేస్తుందా? అన్నది చూడాల్సి ఉంది. ఈ స్వల్ప మార్పులు మినహా భారత్ పాత జట్టుతోనే పాక్‌తో బరిలో దిగే అవకాశం ఉంది.

**గ్రూప్-ఎ టాపర్‌గా టీమిండియా**

గ్రూప్-ఎలో భాగంగా యూఏఈ, పాకిస్తాన్, ఒమన్ జట్లపై హ్యాట్రిక్ విజయాలు సాధించిన టీమిండియా.. టాపర్‌గా సూపర్-4లో అడుగుపెట్టింది. ఇదే గ్రూపు నుంచి యూఏఈ, ఒమన్‌లపై విజయాలతో పాక్ కూడా సూపర్-4కు అర్హత సాధించింది. మరోవైపు.. గ్రూప్-బిలో అఫ్గనిస్తాన్, హాంకాంగ్‌లను ఎలిమినేట్ చేసి.. శ్రీలంక, బంగ్లాదేశ్ క్వాలిఫై అయ్యాయి.

**భారత తుదిజట్టు అంచనా:**

అభిషేక్ శర్మ (ఓపెనర్), శుబ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్-ఓపెనర్), సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్-బ్యాటర్), తిలక్ వర్మ (బ్యాటర్), సంజూ శాంసన్ (వికెట్ కీపర్ బ్యాటర్), శివం దూబే (ఆల్‌రౌండర్), హార్దిక్ పాండ్యా (ఆల్‌రౌండర్), అక్షర్ పటేల్ (ఆల్‌రౌండర్)/అర్ష్‌దీప్ సింగ్ (పేసర్), వరుణ్ చక్రవర్తి (స్పిన్నర్), కుల్దీప్ యాదవ్(స్పిన్నర్), జస్‌ప్రీత్ బుమ్రా (పేసర్)

## రెండు స్వర్ణ పతకాలు.. తొలి భారత అథ్లెట్‌గా వేల్‌కుమార్

ఇంటర్నెట్ డెస్క్: నార్వే వేదికగా జరిగిన ప్రపంచ స్పీడ్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్ ఆనంద్‌కుమార్ వేల్‌కుమార్ చరిత్ర సృష్టించాడు. ఆదివారం నిర్వహించిన 42 కి.మీ మెన్స్ మారథాన్‌లో స్వర్ణం గెలిచాడు. అంతకుముందు 1000 మీటర్ల స్ప్రింట్‌లోనూ స్వర్ణం, 500 మీటర్ల స్ప్రింట్‌లో కాంస్య నెగ్గాడు. ఈ ఛాంపియన్‌షిప్‌లో రెండు సార్లు విజేతగా నిలిచిన తొలి భారతీయుడిగా రికార్డు నమోదు చేశాడు. అలాగే మూడు పతకాలు సాధించిన ఏకైక భారత అథ్లెట్.

చాలా కష్టమైనా సరే..

1000 మీటర్ల స్ప్రింట్‌తో పోలిస్తే 42 కి.మీ మారథాన్ చాలా కష్టమైంది. అద్భుతమైన నైపుణ్యాలు ఉంటే కానీ ఇందులో విజయం సాధించలేరు. సుదీర్ఘంగా సాగే రేసును వ్యూహాత్మకంగా పూర్తి చేయాలి. వేల్‌కుమార్ తన సత్తా ఏంటో ప్రపంచానికి చూపించాడు.



క్రీడా వాయిస్

## ఇంగ్లండ్‌పై హిట్.. ఆసియా కప్‌లో ఫ్లాఫ్.. గిల్ ఎందుకిలా..?

భారత టెస్టు సారథి శుభ్‌మన్ గిల్ టీ20 ఫార్మాట్‌లో జరుగుతున్న ఆసియా కప్‌లో తీవ్రంగా నిరాశపరుస్తున్నాడు. కెప్టెన్‌గా మొదటిదైన ఇంగ్లండ్ గడ్డపై సెంచరీల మోతతో అత్యధిక పరుగుల వీరుడిగా అవతరించిన గిల్.. ఆసియ దేశాల టోర్నీలో మాత్రం అలవోకగా వికెట్




ఇచ్చేస్తున్నాడు. అభిషేక్ శర్మకు జోడీగా ఇన్నింగ్స్ ఆరంభిస్తున్న అతడు మూడు మ్యాచుల్లో కలిపి 35 రన్స్ చేశాడంతే. టెక్నిక్ పరంగా తిరుగులేని గిల్ పొట్టి ఫార్మాట్‌కు తగ్గట్టు దూకుడుగా ఆడబోయి వెనుదిరుగుతున్నాడు. అభిషేక్ తరహాలో దంచికొట్టబోయిన గిల్.. బౌలర్ల వ్యూహంలో చిక్కుకొని డగౌట్ చేరుతున్నాడు. దాంతో.. సూపర్-4 లో ఆదవారం పాకిస్థాన్‌తో మ్యాచ్‌లోనైనా ఈ డాషింగ్ బ్యాటర్ విలువైన ఇన్నింగ్స్ ఆడాలని కెప్టెన్ సూర్య, కోచ్ గంభీర్ ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే యువకెరటం గిల్‌కు మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రా అమూల్యమైన సలహా ఇచ్చాడు. 'ఆసియాకప్‌లో అంచనాలను అందుకుంటూ అభిషేక్ ఇరగదీస్తున్నాడు. అతడు 200 స్ట్రయిక్ రేటుతో ఆడుతూ జట్టుకు శుభారంభం ఇస్తున్నాడు. మెరుపు వేగంతో షాట్లు ఆడుతూ ప్రత్యర్థి బౌలర్లను ఒత్తిడిలో పడేస్తున్నాడు. కానీ, గిల్ మాత్రం అట్టర్ ఫ్లాఫ్ అవుతున్నాడు. ఎందుకుంటే.. అతడు అభిషేక్‌లా దూకుడుగా ఆడాలని చూస్తున్నాడు. తొలి మ్యాచ్‌లో యూఏపై 20 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన వైస్ కెప్టెన్ .. పాక్‌పై స్వల్ప స్కోర్‌కే ఆయూబ్ ఓవర్లో ఔటయ్యాడు. లీగ్ దశ చివరి మ్యాచ్‌లో ఒమన్‌పై చెలరేగిపోతాడనుకుంటే క్లీన్‌బౌల్డ్ అయ్యాడు గిల్. టీ20ల్లో సంజూ శాంసన్ బదులు ఓపెనర్ ఛాన్స్ కొట్టేసిన గిల్ అతడిలా ఆడే క్రమంలో విఫలమవుతున్నాడు. ఇదంతా దూకుడుగా ఆడాలనే తాపత్రయంతో వచ్చిన ఇబ్బంది. అలా కాకుండా గిల్ ఐపీఎల్‌లో ఎలాగైతే తనదైన స్టయిల్లో ఎక్కువ ఓవర్లు ఆడుతూ ఇన్నింగ్స్ నిర్మించేవాడో.. ఇకపై సూపర్ 4 మ్యాచుల్లోనూ అదే చేయాలి. అతడు కనీసం ఏడు నుంచి 10 ఓవర్లు నిలబడితే చాలు పరుగులు వాటంతటవే వస్తాయి. ఒకవేళ గాయంతో బాధపడుతున్న అక్షర్ పటేల్ పాక్‌పై ఆడకుంటే.. బ్యాటింగ్ బలం తగ్గుతుంది. అందుకే.. దాయాదిపై గిల్ ఎక్కువ ఓవర్లు ఆడాల్సి వస్తుంది' అని చోప్రా వెల్లడించాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వీడ్కోలుతో ఇంగ్లండ్ పర్యటనకు సారథిగా ఎంపికైన గిల్.. తనలోని విధ్వంసక బ్యాటర్‌ను ప్రపంచానికి చూపించాడు. ఐదు టెస్టుల సిరీస్‌లో 75.40 సగటుతో నాలుగు సెంచరీలు బాదిన అతడు ఏకంగా 754 పరుగులు సాధించాడు. కానీ.. దుబాయ్‌లో టీ20 ఫార్మాట్‌లో జరుగుతున్న ఆసియా కప్‌లో మాత్రం తేలిపోతున్నాడీ రన్ మెషీన్. దాంతో.. మిడిలార్డర్‌పై ఎక్కువ భారం పడుతోంది. అలాకాకుండా ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడినట్టు నిదానంగా మొదలెట్టి.. ఆఖర్లో సునామిలా చెలరేగాడంటే సూపర్ 4 దశలోనూ భారత జట్టుకు తిరుగులేనట్టే.




## ఓటీటీలోకి ఫహాద్ ఫాజిల్ కొత్త మూవీ..

మలయాళ నటుడు ఫహాద్ ఫాజిల్ ప్రధాన పాత్రలో నటించిన రొమాంటిక్ కామెడీ మూవీ 'ఓడుం కుతిర చాదుం కుతిర' ఈ సినిమాలో కొత్త లోకతో సూపర్ హిట్ అందుకున్న ల్యాణి ప్రియదర్శన్ రేవతి పిళ్లై కథానాయికలుగా నటించారు. ఆగష్టు 29న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి హిట్ అందుకుంది. అయితే తాజాగా ఈ సినిమాను ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక 'నెట్‌ఫ్లిక్స్'లో ఈ నెల 26 నుంచి తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతుంది.



# మరోసారి రిస్క్ చేస్తున్న రాజశేఖర్..

## వర్కౌట్ అయ్యేనా?

హీరో రాజశేఖర్ వెండితెరపై కనిపించి చాలా రోజులైంది. ఆయన హీరోగా నటించిన చివరి చిత్రం 'శేఖర్'. 2022లో ఈ మూవీ రిలీజైంది. ఆ తర్వాత ఆయన హీరోగా నటించిన చిత్రాలేవి ప్రేక్షకుల ముందుకు రాలేదు కానీ నితిన్ 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్'(2023)లో క్యామియో రోల్ ప్లే చేసి ఆకట్టుకున్నాడు. చాలా కాలం తర్వాత రాజశేఖర్ మళ్లీ ఓ సినిమా చేయబోతున్నాడట. అది కూడా రీమేక్. తమిళ్‌లో పెద్ద హిట్ అయిన 'లబ్బర్ పందు' సినిమాను తెలుగులో రీమేక్ చేస్తున్నారట రాజశేఖర్. హరీష్ కళ్యాణ్– దినేష్ ప్రధాన పాత్రల్లో నటించిన 'లబ్బర్ పందు' సినిమాను తమిళరాసన్ పంచముత్తు దర్శకత్వం వహించారు. గల్లీ క్రికెట్ బ్యాక్?డ్రాప్?తో వచ్చిన ఈ చిత్రం బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ఇప్పుడు ఈ సినిమాను తెలుగులో రీమేక్ చేస్తున్నారట. ఒరిజినల్‌లో దినేష్ చేసిన పాత్రను తెలుగులో రాజశేఖర్ చేస్తున్నారట. విశ్వదేవ్ రాచకొండ మాతృకలో అర్జున్ కళ్యాణ్ చేసిన పాత్రను చేస్తున్నాడట. రాజశేఖర్ తనయురాలే ఇందులో హీరోయిన్‌గా కనిపించనుందట. ఓటీటీ వాడకం పెరిగిన తర్వాత రీమేక్ చిత్రాలేవి వర్కౌట్ కావడం లేదు. ఒక భాషలో హిట్టయిన సినిమాను..ఓటీటీలో అన్ని ప్రాంతాల వారు చూస్తున్నారు. ఇలాంటి సమయంలో రాజశేఖర్ రిస్క్ చేసి రీమేక్ చేస్తున్నాడు. ఒకప్పుడు ఆయన రీమేక్ చేసిన చిత్రాలన్నీ సూపర్ హిట్‌గా నిలిచాయి. కానీ ఇప్పుడు పరిస్థితుల మారాయి. ఆయన రీమేక్ చేసిన గడ్డం గ్యాంగ్, శేఖర్ చిత్రాలు సైతం బాక్సాఫీస్ వద్ద బోల్తా పడ్డాయి. అయినా కూడా రాజశేఖర్ మళ్లీ రీమేక్‌నే నమ్ముకున్నాడు. మరి ఆయన రిస్క్ ఫలిస్తుందో లేదో చూడాలి.

## ఇండియన్ ఐకాన్‌కు దక్కిన గౌరవం.. మోహన్ లాల్‌కు ఎన్టీఆర్ విషెస్



మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్‌కు జూనియర్ ఎన్టీఆర్ అభినందనలు తెలిపారు. సినీ రంగంలో అందించే ప్రతిష్టాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు. నిజమైన ఇండియన్ సినిమా ఐకాన్‌కు దక్కిన గౌరవమని ట్వీట్ చేశారు. కాగా.. కేంద్ర ప్రభుత్వం 2023 ఏడాదికి గానూ సినీ పరిశ్రమలో అందించే అత్యున్నత దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించింది. జూనియర్ ఎన్టీఆర్ హీరోగా వచ్చిన జనతా గ్యారేజ్ చిత్రంలో మోహన్ లాల్ కీలక పాత్రలో కనిపించారు. కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచింది. 2016లో వచ్చిన ఈ సినిమాలో సమంత హీరోయిన్‌గా నటించింది. కాగా.. మోహన్ లాల్ మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లోనూ నటించారు.

## అట్లీకి బర్త్‌డే విషెస్ తెలిపిన అల్లు అర్జున్

టాలీవుడ్ స్టార్ హీరో అల్లు అర్జున్, ప్రముఖ తమిళ దర్శకుడు అట్లీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. సెప్టెంబర్ 21న అట్లీ పుట్టినరోజు కావడంతో బన్నీ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. పుట్టినరోజు శుభాకాంక్షలు అట్లీ. ఈ సంవత్సరం నీకు గొప్పగా ఉండాలని కోరుకుంటున్నాను. నువ్వు మరిన్ని విజయాలు సాధించాలని ఆశిస్తున్నాను. మీరు సృష్టిస్తున్న సినిమాటిక్ మాయాజాలాన్ని అందరూ అనుభవించే వరకు వేచి ఉండలేను అంటూ అల్లు అర్జున్ రాసుకోచ్చాడు. అట్లీ గతంలో 'రాజా రాణి', 'తెరి', 'మెర్సల్', 'బిగిల్' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాలతో తమిళ చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇటీవల షారుఖ్ ఖాన్ నటించిన 'జవాన్' సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. ఈ సినిమా కూడా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించింది. ప్రస్తుతం అట్లీ అల్లు అర్జున్‌తో కలిసి ఒక సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాలో దీపిక పదుకొనే కథానాయికగా నటిస్తుండగా.. సన్ పిక్చర్స్ నిర్మిస్తుంది.





# దీపికా పదుకొణె స్థానంలో స్టార్ హీరోయిన్.. రేసులో ఇద్దరు

'కల్కి 2898 ఏడీ' సినిమా నుంచి బాలీవుడ్ నటి దీపికా పదుకొణెను తప్పించిన తర్వాత ఆ స్థానాన్ని భర్తి చేసేది ఎవరు అనే ప్రశ్న చాలామందిలో ఉంది. ఈ విషయంలో ఇప్పటికే పెద్ద ఎత్తున చర్చ కూడా జరుగుతుంది. ఈ ఏడాది చివరిలో సీక్వెల్ షూటింగ్ ఉంటుందని దర్శకుడు నాగ్ అశ్విన్ ఇప్పటికే ప్రకటించారు. ఇప్పుడు సడెన్‌గా దీపికను తప్పించడంతో అందరూ ఆశ్చర్యపోయారు. కల్కిలో దీపికా పదుకొణె పర్‌ఫార్మెన్స్ చాలా బాగుందని, తన క్యారెక్టర్‌లో ఆమె లీనమై నటించారని టాక్ ఉంది. ఇప్పుడు ఆ స్థానాన్ని రీప్లేస్ చేసే ఏకైక హీరోయిన్ అనుష్క మాత్రమేనని సోషల్‌మీడియాలో చాలామంది తమ అభిప్రాయాన్ని పంచుకుంటున్నారు. దీపిక పదుకొణెను రీప్లేస్ చేసే హీరోయిన్ కోసం కల్కి యూనిట్ ఇప్పటికే వేట మొదలు పెట్టింది. ఈ క్రమంలో సోషల్‌మీడియాలో ఇద్దరి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభాస్–అనుష్క కలిసి మరోసారి సినిమా చేస్తే చూడాలని అభిమానులతో పాటు నెటిజన్లు కూడా కోరుతున్నారు. బాహుబలి తర్వాత మళ్లీ వీరిద్దరూ కలిసి ఎక్కడా కూడా కనిపించలేదు. అందువల్ల దీపిక స్థానాన్ని అనుష్కతో భర్తీ చేస్తే సినిమాకు మరింత జోష్ రావడం ఖాయం అంటున్నారు.బాహుబలిలో గర్భవతిగా అనుష్క కనిపించిన విషయం తెలిసిందే. కల్కిలో కూడా దీపిక గర్భవతిగానే కనిపిస్తుంది. దీంతో ఎక్కువ మంది ఇదే కంటిన్యూటీని కోరుకుంటున్నారు. 'కొత్త లోక' సినిమాతో ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న 'కళ్యాణి ప్రియదర్శన్'ను కల్కి కోసం ఎంపిక చేసినా బాగుంటుందని కొందరు చెబుతున్నారు. కొత్త లోక సినిమాలో ఆమె సూపర్ యోధగా నటించి అభిమానులను మెప్పించిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో నయనతార, అలియా భట్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ విషయంలో చిత్ర నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ త్వరలో అధికారికంగా ప్రకటించే ఛాన్స్ ఉంది.



# రామ్ చరణ్ సరసన కృతి సనన్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం డైరెక్టర్ బుచ్చిబాబు సన దర్శకత్వంలో పెద్ది సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. విలేజ్ స్పోర్ట్స్ డ్రామాగా వస్తున్న ఈ మూవీలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా.. కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ భారీ అంచనాలు క్రియేట్ చేసింది. ఇందులో చరణ్ ఊరమాస్ అవతారంలో కనిపించనున్నాడు. అలాగే పక్కా మాస్ యాక్షన్ హీరోగా చాలా కాలానికి థియేటర్లలో విధ్వంసం సృష్టించేందుకు రెడీ అయ్యారు చరణ్. దీంతో ఈ సినిమా కోసం మెగా ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇదివరకే ప్రకటించారు. ఈ సినిమాతోపాటు చరణ్ తన నెక్స్ట్ ప్రాజెక్ట్ సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో చరణ్ తన నెక్స్ట్ ప్రాజెక్ట్ చేయనున్నారు. వీరిద్దరి కాంబోలో ఇదివరకు వచ్చిన రంగస్థలం సినిమా సూపర్ హిట్ అయిన సంగతి తెలిసిందే. ఇప్పుడు వీరిద్దరి కాంబో మరోసారి రిపీట్ కావడంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి. పాన్ ఇండియా లెవల్లో ఈ సినిమాను తెరకెక్కించనున్నారట. దీంతో ఇప్పుడు హీరోయిన్ ఎవరనే విషయంపై నెట్టింట చర్చ నడుస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా ఫిల్మ్ వర్గాల్లో ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ వినిపిస్తుంది. ఈ సినిమాలో చరణ్ జోడిగా బాలీవుడ్ బ్యూటీ కృతి సనన్ ను తీసుకోవాలని ప్లాన్ చేస్తున్నారట మేకర్స్. గతంలో సుకుమార్, మహేష్ బాబు కాంబోలో వచ్చిన నేనొక్కడినే సినిమాతో కథానాయికగా పరిచయమైంది కృతి. ఆ తర్వాత దోచేయ్, ఆదిపురుష్ వంటి చిత్రాల్లో నటించింది. ఈ ముద్దుగుమ్మ నటించిన ఈ మూడు సినిమాలు అంతగా ఆకట్టుకోలేదు. ఆ తర్వాత పూర్తిగా బాలీవుడ్ కు మకాం మార్చిన కృతి.. ఇప్పుడు చాలా కాలం తర్వాత రామ్ చరణ్ సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి రీఎంట్రీ ఇవ్వబోతుంది. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com